# సుస్వాగతం

مرحباً بكم في الإسلام

17

بلغة التلغو

المسابقة الثقافية
الرمضانية السابعة عشر
للجاليات ١٤٣٦هـ

www.islamhouse.com



ننشر الإسلام بـ ١٠٠ لغة

100 భాషలలో ఇస్లాం పరిచయం

Islamhouse.com


المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة

هاتف: ٩٦٦١١٤٤٥٤٩٠٠+ فاكس: ٩٦٦١١٤٩٧٠١٢٦+ ص ب: ٢٩٤٦٥ الرياض: ١١٤٥٧

ISLAMIC PROPAGATION OFFICE IN RABWAH

P.O.BOX 29465 RIYADH 11457 TEL: +966 11 4454900 FAX: +966 11 4970126

OFFICERABWAH

# సుస్వాగతం

## مرحباً بكم في الإسلام

17

بلغة التلغو

المسابقة الثقافية الرمضانية السابعة عشر للجاليات ١٤٣٦هـ

# సుస్వాగతం

మూలం

www.islamicpamphlets.com

సంకలనం


ముహమ్మద్ కరీముల్లాహ్

దివ్యఖుర్ఆన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, హైదరాబాద్.

# 1. మన జీవిత ఉద్దేశ్యం ఏమిటి ?

**నేనెక్కడి నుండి వచ్చాను?**

**ఇక్కడెందుకు ఉన్నాను?**

**ఎక్కడికి పోబోతున్నాను?**

మన జీవిత ఉద్దేశ్యం ఏమిటి అనే దానిపై దృష్టి సారించినప్పుడు, మన మెదడులో మొట్ట మొదట "అసలు మనం ఎక్కడి నుండి వచ్చాము?" అనే ప్రశ్న ఉదయిస్తుంది. యాదృచ్ఛికంగా, కాకతాళీయంగా జరిగే ప్రకృతి సహజ పరిణామాల వలన ఇక్కడ ఉన్నామా లేక దీని వెనుక అత్యంత వివేకవంతుడైన ఒక మహోన్నత సృష్టికర్త ఉన్నాడా? మన జీవితం యొక్క అసలు ఉద్దేశ్యాన్ని గ్రహించడంలో మొట్టమొదటి మెట్టు సృష్టికర్త ఉనికిని గుర్తించడం మరియు విశ్వసించడం. సృష్టికర్తను ఎందుకు విశ్వసించాలనే ప్రశ్నకు విచక్షణా పూర్వకమైన, వివేకవంతమైన హేతువాద కారణాలు ఎన్నో ఉన్నాయి. అయితే వాటిలో నుండి మూడు కారణాలను ఇక్కడ క్లుప్తంగా ప్రస్తావిస్తున్నాము.

## 1. విశ్వం ఆరంభం

సృష్టికర్త ఉనికిని స్పష్టంగా తెలిపే సృష్టి ఆరంభం గురించి అర్థం చేసుకోవడంపై దృష్టి సారించడం వైపు మొదటి సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది.

ఉదాహరణకు ఎడారిలో నడుస్తుండగా, ఒక చేతి గడియారం అక్కడ పడి ఉండటం మీకు కంట కనబడిందని భావించుదాం. చేతి గడియారంలో గాజు

కవరు, ప్లాస్టిక్ మరియు ఇనుము ఉంటాయనేది మనకు తెలుసు. సన్నటి ఇసుక నుండి గాజు తయారవుతుంది, ఆయిల్ నుండి ప్లాస్టిక్ తయారవుతుంది మరియు భూమి నుండి ఇనుము సంగ్రహించబడుతుంది – ఇవన్నీ ఎడారిలో లభిస్తాయి. మరి, అలాంటప్పుడు, గడియారం తనకు తానుగా తయారై పోతుందా? సూర్యుడు ప్రకాశించుట, గాలి వీచుట, పిడుగులు పడుట, ఆయిల్ భూమి ఉపరితలం పైకి వచ్చి, సన్నటి ఇసుక మరియు ఇనుముతో కలిసి అనేక మిలియన్ల సంవత్సరాల వరకు ఉండిపోయిన తర్వాత, యాధృచ్ఛికంగా లేక సహజ సిద్ధంగా అది గడియారంలా తయారు కావడమనేది సంభవమేనా ?

కొందరు ఇలా ప్రశ్నించవచ్చు, "అల్లాహ్ ను ఎవరు సృష్టించారు?". సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్, తన సృష్టి కంటే భిన్నమైన వాడు. ఆయన నిత్యుడు, ఆద్యంత రహితుడు. ఎల్లప్పుడూ ఉంటాడు. ఆయనకు ఆరంభం లేదు – అంతమూ లేదు. కాబట్టి, 'అల్లాహ్ ను సృష్టించింది ఎవరు?' అనే ప్రశ్న ఒక అవివేకమైన, అసంబద్ధమైన, బుద్ధిహీనమైన ప్రశ్నే తప్ప మరేమీ కాదు.

మానవజాతి అపార అనుభవం మరియు సింపుల్ లాజిక్ మనకు చెబుతున్నదేమిటంటే ఆరంభం ఉన్నది ఏదైనా సరే, అది శూన్యం నుండి సృష్టించబడదు. అంతేగాక, ఏదీ తనను తానుగా సృష్టించుకోజాలదు. కాబట్టి, అత్యంత హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, మహోన్నతుడైన ఒక సృష్టికర్త ఈ విశ్వాన్ని సృష్టించాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు మరియు వివేకవంతుడూను. ఎందుకంటే ఆయన మొత్తం విశ్వాన్ని ఏ చిన్న లోపమూ లేకుండా చాలా అద్భుతంగా సృష్టించాడు మరియు విశ్వం అనుసరించవలసిన వైజ్ఞానిక చట్టాల్ని కూడా. ఆ సృష్టికర్త కాలాతీతుడు మరియు స్థలాతీతుడు. ఎందుకంటే, కాలం, స్థలం మరియు పదార్థం అనేవి విశ్వ సృష్టి సమయంలో సృష్టించబడినాయి. సృష్టికర్త ఈ లక్షణాలకు అతీతుడు. అవి సర్వలోక సృష్టికర్త ప్రాథమిక దైవభావన ఔన్నత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ విశ్వం పరిమితమైనది

మరియు దానికొక ఆరంభం ఉందని తెలిపే నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో ఇది పూర్తిగా ఏకీభవిస్తున్నది.

## 2. విశ్వం యొక్క పరిపూర్ణత

ఎంతో వివేకవంతుడైన సృష్టికర్త ఉనికిని చాటే మన క్లిష్టతరమైన విశ్వం యొక్క పరిపూర్ణ సంతులనం మరియు క్రమం పై దృష్టి సారించడం వైపు రెండో సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది.

సూర్యుడికి నిర్ణీత దూరంలో ఉంచబడిన భూమండం, భూమి పై పొర మందం, భూమి తన చుట్టూ తాను పరిభ్రమించే వేగం, వాతావరణంలోని ఆక్సిజన్ శాతం, భూమి ఒక కోణంలో వంగి ఉండటం మొదలైన విశ్వంలోని అనేక విశేషతలు సమస్త జీవరాశుల మనుగడకు అనుకూలంగా విశ్వమంతా ఒక అద్భుత పథకం ద్వారా యోచించబడిందని స్పష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణీత కొలతలలో ఏ మాత్రం హెచ్చుతగ్గులున్నా, భూమండలంపై జీవరాశుల ఉనికి కనబడేది కాదు.

ఖచ్చితమైన సమయాన్ని చూపేలా గడియారాన్ని తయారు చేసే ఒక వివేకవంతుడైన తయారీదారుడు ఉన్నట్లే, ఖచ్చితంగా నిర్ణీత సమయం ప్రకారం సూర్యుడి చుట్టూ తిరిగేలా నియంత్రించి, భూమిని తయారు చేసిన మహావివేకవంతుడైన ఒక తయారీదారుడూ తప్పక ఉన్నాడు. దీనికి భిన్నంగా ఈ భూమి తనకు తానుగా ఉనికిలోనికి రావడమనేది సంభవమేనా?

విశ్వం పాటిస్తున్న క్రమశిక్షణ, ఖచ్చితమైన విశ్వచట్టాలు, మనలోని మరియు మొత్తం విశ్వంలోని వ్యవస్థ మొదలైన వాటిని నిశితంగా పరిశీలించి, దానికి ఒక నిర్వహణకర్త తప్పకుండా ఉంటాడని భావించడం వివేకవంతంగా లేదా? ఇలాంటి లోపరహితమైన సృష్టి క్రమశిక్షణను రూపొందించి, నియంత్రిస్తున్న సర్వలోక సృష్టికర్త అల్లాహ్ యొక్క ఉనికిని ఈ '**నిర్వహణకర్త**' పాత్ర స్పష్టంగా ఋజువు చేస్తున్నది.

## 3. అల్లాహ్ తరుఫు నుండి పంపబడే దివ్యసందేశం (వహీ)

తన ఉనికిని సూచించే నిదర్శనంగా మానవజాతి వద్దకు అల్లాహ్ పంపిన అసలు దివ్యసందేశంపై దృష్టి సారించడం వైపు మూడో సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది. ఇస్లాం మూలాధారమైన దివ్య ఖుర్ఆన్ గ్రంథం, అల్లాహ్ యొక్క దివ్యవచనమని నిరూపించే అనేక స్పష్టమైన సూచనలు ఖుర్ఆన్ లో ఉన్నాయి. ఈ వాదనను బలపరిచే కొన్ని సాక్ష్యాధారాలు క్లుప్తంగా ఇక్కడ ప్రస్తావించబడినాయి.

### ఖుర్ఆన్ :

- ఖుర్ఆన్ అవతరించి 1400 సంవత్సరాలు దాటిపోయాయి. ఆ కాలంలోని ప్రజలకు అస్సలు తెలియని మరియు ఈ మధ్యనే సైన్సు ద్వారా కనిపెట్టబడిన అనేక వైజ్ఞానిక అంశాలు ఇందులో పేర్కొనబడినాయి. ఉదాహరణకు: జీవరాశులన్నింటి మూలం నీరు (ఖుర్ఆన్ 21:30); వ్యాపిస్తున్న విశ్వం (ఖుర్ఆన్ 51:47); సూర్యుడు మరియు చంద్రుడి స్వంత కక్ష్యలు (ఖుర్ఆన్ 21:33).
- ఖుర్ఆన్ లో అనేక చారిత్రక వాస్తవ సంఘటనలు పేర్కొనబడినాయి. ఆనాటి కాలంలోని ప్రజలకు వాటి గురించి తెలియదు. అంతేగాక అనేక భవిష్యవాణులు కూడా ప్రస్తావించబడినాయి. వాటిలో కొన్ని నిజంగా జరిగిపోయాయి, మరికొన్ని జరగబోతున్నాయి.
- వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, క్రమక్రమంగా 23 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో అవతరించినా, ఎలాంటి లోపాలు మరియు పరస్పర విరుద్ధ వచనాలు లేకుండా ఖుర్ఆన్ దోషరహితంగా ఉన్నది.

- ఖుర్ఆన్ లో ప్రజలపై గాఢమైన ప్రభావం చూపే మరియు వారిని కదిలించే మహాద్భుతమైన దివ్యసందేశం ఉన్నది.
- కాలక్రమంలో కనుమరుగు అయి పోయిన ఇతర ధర్మాల అసలు మూలగ్రంథాలకు భిన్నంగా, అవతరించిన అరబీ భాషలో అసలు ఖుర్ఆన్ లోని ప్రతి పదం సురక్షితంగా భద్రపరచబడింది.
- ఖుర్ఆన్ లో మానవుడి వివేకాన్ని మరియు సృష్టికర్త గురించిన స్వాభావిక విశ్వాసాన్ని మేలుకొల్పే సరళమైన మరియు స్వచ్ఛమైన సార్వజనిక సందేశం ఉన్నది.
- ఖుర్ఆన్ గ్రంథం అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించింది. ఆయన నిరక్షరాస్యులైనా, దాని భాష అత్యుత్తమమైన వాగ్ధాటి, వక్తృత్వం మరియు భాషాపరమైన సాహిత్య సౌందర్యాలతో అరబీ భాషలో సాటిలేని తనదైన ప్రత్యేక శైలి కలిగి ఉన్నట్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడినది.

ఖుర్ఆన్ యొక్క అనేక అపూర్వ మరియు అద్భుత అంశాలలో అత్యంత హేతువాద విషయం ఏమిటంటే అది మనందరి సృష్టికర్త అయిన అల్లాహ్ నుండి తిన్నగా పంపబడింది.

## అల్లాహ్ దివ్యసందేశాల్ని పంపినాడు

అత్యంత వివేకవంతుడైన అల్లాహ్ చే మనం సృష్టించబడినాము అనే విషయం గుర్తించిన తర్వాత, అసలు మన జీవిత లక్ష్యం ఏమిటో తెలుపబడాలని మనం ఆశిస్తాము. సృష్టికర్త మన నుండి ఏమి ఆశిస్తున్నాడో మనమెలా తెలుసుకోగలం? మనం ఏదో విధంగా జీవించాలా లేక స్వంతంగా ఏదైనా జీవిత లక్ష్యం పెట్టుకోవాలా? ఇతరులను అనుసరిస్తూ జీవన ప్రవాహంలో కొట్టుకు పోవాలా? లేదు. మన జీవిత లక్ష్యం మనకు తెలిపేందుకు అల్లాహ్ ప్రవక్తలను మరియు దివ్యసందేశాలను పంపినాడు.

అల్లాహ్ వేలాది ప్రవక్తలను పంపినాడు, దాదాపు ప్రతి జాతి కోసం కనీసం ఒక ప్రవక్తను పంపినాడు. ఏ జాతిలో, ఏ భాషలో, ఏ కాలంలో పంపబడినా, వారందరిదీ ఒకే సందేశం: కేవలం సృష్టికర్తను మాత్రమే ఆరాధించండి మరియు ఆయన మార్గదర్శకత్వాన్ని మాత్రమే అనుసరించండి. ఆ ప్రవక్తలలో కొందరు – ఆదమ్, నూహ్, అబ్రహామ్, మోసెస్, జీసస్ అలైహిస్సలాం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ప్రవక్తల పరంపరలో చిట్టచివరి వారైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజాయితీ, న్యాయం, కారుణ్యం మరియు ధైర్యసాహసాలు నిండిన ఒక పరిపూర్ణ ఆదర్శవంతుడు. ఆయనపై అల్లాహ్ తన అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ ను అవతరింపజేసినాడు. ఈ ప్రాపంచిక జీవితంలో ఖుర్ఆన్ లోని దివ్యసందేశాలను ఎలా ఆచరించాలో ప్రయోగాత్మకంగా చూపెట్టినారు.

అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ ఒక గొప్ప మార్గదర్శక గ్రంథం. అది మన ఉనికి ఉద్దేశ్యం, అసలు ఆరాధ్యుడు ఎవరు, అల్లాహ్ కు ఇష్టమైన మరియు అయిష్టమైన పనులు ఏవి, ప్రవక్తల వృత్తాంతాలు మరియు వాటి గుణపాఠాలు, స్వర్గనరకాలు మరియు అంతిమ తీర్పుదినం వంటి అనేక భావనలను వివరిస్తున్నది. సర్వలోక సృష్టికర్త గురించి ప్రజలలో వ్యాపించి ఉన్న అపోహలు, భ్రమలు దూరం చేయడం కూడా దాని లక్ష్యాలలో ఒక ప్రధాన లక్ష్యం, ఉదాహరణకు సృష్టికర్త స్వభావానికి మరియు జీసస్ యొక్క స్వభావం & పాత్రకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టం చేయడం.

ఇతర ప్రవక్తల వలే జీసస్ అలైహిస్సలాం కూడా అనేక మహిమలు ప్రదర్శించి చూపారు మరియు ఏకైక నిజ దైవాన్ని మాత్రమే ఆరాధించమని ఆహ్వానించారు. (ఖుర్ఆన్ 19:36).

## జీసస్ (అలైహిస్సలాం) స్వభావం

ఇస్లాం ధర్మంలోని దైవభావన గురించి అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు జీసస్ అలైహిస్సలాం హెూదా, ఆయన స్వభావం గురించి విస్తృతంగా వ్యాపించి ఉన్న అపోహలు, అస్పష్టత, గందరగోళం మరియు ఆయన స్వభావంపై వినిపిస్తున్న విభిన్న దావాల గురించి చర్చించడం చాలా ముఖ్యం.

కొందరు క్రైస్తవులు "జీసస్ దేవుడు" లేక "త్రైత్వంలో ఒకడని" దావా చేస్తున్నారు – అంటే భూమండలంపై దేవుడి అవతారమనీ మరియు దేవుడు మానవుడిగా మారాడనీ దావా చేస్తున్నారు. అయితే, బైబిల్ ప్రకారం జీసస్ జన్మించారు, భుజించారు, నిద్రించారు, ప్రార్థించారు మరియు ఆయన జ్ఞానం పరిమితమైంది – ఈ లక్షణాలన్నీ సృష్టికర్త స్థాయికి ఎంతమాత్రం తగినవి కావు. మానవుడి లక్షణాలకు భిన్నంగా, సృష్టికర్త దివ్యలక్షణాలలో పరిపూర్ణత్వం ఉంటుంది. మరి అలాంటప్పుడు, పూర్తిగా రెండు భిన్నమైన అంశాలు ఏకకాలంలో ఎలా సంభవించగలవు? ఇది ఎంతమాత్రం హేతుబద్ధమైన విషయం కాదు.

అయితే, కొందరు ఇలా ప్రశ్నించవచ్చు, "ఒకవేళ దేవుడు ఏదైనా చేయ గలిగే శక్తిసామర్థ్యాలు కలిగి ఉంటే, మనిషిగా ఎందుకు మారలేడు?" నిర్వచనం ప్రకారం, సర్వలోక సృష్టికర్త తన స్థాయికి తగని పనులు చేయడు. కాబట్టి, ఒకవేళ దేవుడు మానవుడిగా మారి, మానవుడి లక్షణాలు అలవర్చుకుంటే, ఇక ఆయన ఎంత మాత్రమూ దేవుడిగా మిగిలి ఉండడు.

అంతేగాక, దేవుడు మరియు తాను వేర్వేరు అని స్పష్టం చేస్తున్న జీసస్ అలైహిస్సలాం పలుకులు మరియు ప్రవర్తనలను తెలిపే అనేక వచనాలు బైబిల్ లో ఉన్నాయి. ఉదాహరణకు, జీసస్ "సాగిలపడి నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగి పోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని ప్రార్థించెను." [మత్తయి 26:39]. ఒకవేళ జీసస్ యే

గనుక దేవుడు అయినట్లయితే, దేవుడు అలా సాగిలపడి, ప్రార్థిస్తాడా? మరియు ఆయన ఇక్కడ ప్రార్థించింది ఏ దేవుడిని?

కొందరు క్రైస్తవులు "జీసస్ దేవుడి కుమారుడు" అని దావా చేస్తున్నారు. అసలు దీని అర్థం ఏమిటి? అని మనల్ని మనం ప్రశ్నించుకోవలసి వస్తున్నది. నిస్సందేహంగా సర్వలోక సృష్టకర్త శారీరక మరియు శాబ్దిక కొడుకు కలిగి ఉన్నాడనే భావనలకు అతీతుడు. అయితే, "దేవుని కుమారుడు" అనే పదం మొదటి తరాల బైబిల్ భాషలలో లాంఛనపరంగా "ధర్మపరాయణుడు, సత్యవంతుడు, నీతిమంతుడు, సదాచారి అయిన వ్యక్తి" ని సూచిస్తూ వాడబడింది. మొత్తం పాతనిబంధనలో అనేక చోట్ల డేవిడ్, సోలోమాన్ మరియు ఇజ్రాయీలు మొదలైన సదాచార ప్రవక్తలను సూచిస్తూ వాడబడింది – అంతేగాని కేవలం జీసస్ అలైహిస్సలాంకు మాత్రమే పరిమితం చేయబడలేదు, ఉదాహరణకు

"...ఇశ్రాయేలు నాకు మొదట పుట్టిన కుమారుడు," (నిర్గమ కాండము 4:22).

"కుమారుడిని కలిగి ఉన్నాడనటం అల్లాహ్ ఔన్నత్యానికి తగిన మాట కాదు; ఆయన పరిపూర్ణుడు మరియు ఎలాంటి లోపాలూ లేనివాడు!"ఖుర్ఆన్ 19:35

అసలు జీసస్ అలైహిస్సలాం ఎవరు అనే అంశాన్ని ఆయన గురించిన ఇస్లామీయ విశ్వాసం స్పష్టంగా వివరిస్తున్నది, అంతేగాక సర్వలోక సృష్టికర్త యొక్క పరిపూర్ణ ఘనత, ఏకత్వం మరియు సంపూర్ణత్వం గురించిన స్వచ్ఛమైన విశ్వాసాల్ని కూడా వివరిస్తున్నది. అదేమిటంటే, జీసస్ అలైహిస్సలాం ఒక గౌరవనీయుడైన మహా ప్రవక్త. కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని ప్రజలను ఆహ్వానించేందుకు ఆయన పంపబడినారు.

## మరి...నేనిక్కడ ఎందుకు ఉన్నాను?

మన అవయవాలైన కళ్ళు, చెవులు, మెదడు మరియు గుండె మొదలైన వాటన్నింటికీ ఒక్కో ఉద్దేశ్యం ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ

అంగీకరిస్తారు. మరి అలాంటప్పుడు మొత్తం అవయవాలతో కూడిన మన శరీరానికీ ఏదైనా ఉద్దేశ్యం, ప్రయోజనం ఉందా ?

అత్యంత వివేకవంతుడైన అల్లాహ్ మనల్ని ఎలాంటి లక్ష్యం లేకుండా అటూ ఇటూ తిరగటానికి లేదా మన సహజ అవసరాలు మరియు చిన్న చిన్న కోరికలు తీర్చుకోవటానికి సృష్టించలేదు. మన జీవితానికి ఒక గొప్ప ఉద్దేశ్యం ఉన్నది – అదేమిటంటే, సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ ను గుర్తించుట మరియు కేవలం ఆయనను మాత్రమే ఆరాధించుట, తద్వారా సృష్టికర్త మార్గదర్శకత్వంలో జీవితం గడుపుట. అన్ని కోణాలలో సాఫల్యవంతమైన మరియు శుభప్రదమైన జీవితాన్ని గడిపేలా ఈ మార్గదర్శకత్వం దారి చూపుతుంది. ఉదాహరణకు – వ్యక్తిగత ఆరాధనలైన నమాజు, దుఆలతో పాటు సమాజానికి ప్రయోజనం కలిగించే ఇరుగు పొరుగు వారితో మంచిగా మెలగడం, కుటుంబ పోషణ బాధ్యతలు, నిజాయితీ మరియు పశుపక్ష్యాదుల మంచిచెడులు చూడుట మొదలైన పనులు.

తనను వదిలి లేదా తనతో పాటు ఇతరులను ఆరాధించుట, సాటి కల్పించుట మొదలైన అవిధేయతలను, అవిశ్వాసాల్ని అల్లాహ్ పూర్తిగా నిషేధించినాడు. (ఉదాహరణకు, విగ్రహారాధన, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాల పూజ, బాబాలు, గురువులు లేక ప్రవక్తల పూజ మొదలైనవి ఇస్లాంలో పూర్తిగా నిషేధించబడినాయి.). ఆయనకు ఎవ్వరి భాగస్వామ్యం లేక మధ్యవర్తిత్వం యొక్క అవసరం లేదు. ప్రతి మానవుడూ ఏ సమయంలోనైనా సరే, అల్లాహ్ ను డైరక్టుగా ఆరాధించవచ్చు, వేడుకోవచ్చు.

ఈ మానవజీవితం ఒక పరీక్షా కాలమని అల్లాహ్ స్పష్టంగా తెలిపినాడు. ఇక్కడ వేర్వేరు పద్ధతులలో ప్రజలు పరీక్షించబడతారు. జరుగుతున్న దానిని మనం నియంత్రించలేము. కానీ, దానికి మనమెలా స్పందించాలో నియంత్రించు కోగలం. కష్టకాలంలో సహనం, ఓర్పు మరియు శుభకాలంలో అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకోవడం మొదలైనవి మనల్ని అల్లాహ్ దగ్గరికి చేర్చే

మరియు శాశ్వత స్వర్గంలో మంచి స్థానం సంపాదించి పెట్టే కొన్ని మాధ్యమాలు. అలాగే ఒకవేళ అవిశ్వాస మార్గాన్ని ఎంచుకుంటే మరియు ఆయన దివ్యాజ్ఞలను పెడచెవిన పెడితే, నరకంలో భయంకరమైన శిక్ష ఉంటుందని హెచ్చరించబడింది.

## మరి... ఇప్పుడు నేనేం చేయాలి?

అసలు విశ్వాస పరీక్ష ఏమిటంటే మనకు ప్రసాదించిబడిన తెలివి తేటలను ఉపయోగించి అల్లాహ్ సూచనలు మరియు చిహ్నాల గురించి లోతుగా ఆలోచించి, యోచించి, అల్లాహ్ ను గుర్తించి, ఆయన మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ జీవించుట. ఇలా చేయాలంటే మనం మహోన్నతుడైన అల్లాహ్ యొక్క దైవాజ్ఞలకు పూర్తిగా సమర్పించుకోవాలి, అలా సమర్పించుకున్న వారినే అరబీ భాషలో **"ముస్లిం"** లు అంటారు. అరబీ భాషలో ఏకైక సృష్టికర్త పేరు అల్లాహ్. ఆయన ఇస్లాం ధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా సరే ఆచరించేలా సార్వజనిక ధర్మంగా చేసినాడు. ప్రపంచంలో ఏ మారుమూల నివసించేవారైనా సరే తమ చారిత్రక, భూత, వర్తమాన పరిస్థితులతో నిమిత్తం లేకుండా అల్లాహ్ యొక్క సత్యధర్మాన్ని స్వీకరించవచ్చు మరియు క్రింది షహాదా అంటే సాక్ష్యప్రకటన పలుకుతూ ముస్లింగా మారవచ్చు:

"నేను సాక్ష్యమిస్తున్నాను – అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడెవ్వడూ లేడని, మరియు నేను సాక్ష్యమిస్తున్నాను – ముహమ్మద్, అల్లాహ్ యొక్క సందేశహరుడనీ."

మరి, జీవిత ఉద్దేశ్యాన్ని మరియు లక్ష్యాన్ని సాధించే దిశలో పయనించే, సత్యానికి సమర్పించుకునే మరియు మీ సృష్టికర్త అయిన అల్లాహ్ ను గుర్తించే సమయం ఇంకా ఆసన్నం కాలేదా ?

# 2. ఇస్లాం ఎందుకు ?

## ఇస్లాంలోని అద్భుతాలు మరియు ప్రయోజనాలు

### అన్ని మతాలు ఒకటేనా?

### వాటన్నింటిలో ఏది సరైన మతమో నాకెలా తెలుస్తుంది?

### నేను ఇస్లాం ధర్మాన్నే ఎందుకు ఎన్నుకోవాలి?

ఇతర ధర్మాలకు మరియు సిద్ధాంతాలకు భిన్నంగా ఇస్లాంలో స్పష్టంగా కనబడే ముఖ్య ఆకర్షణలు, లాభాలు మరియు ప్రత్యేకతల గురించి చర్చించడమే ఈ అధ్యాయం యొక్క లక్ష్యం.

### 1. సృష్టికర్తతో దగ్గర సంబంధం

తన సృష్టికర్తతో ఒక వ్యక్తి కలిగి ఉండవలసిన వ్యక్తిగత సంబంధంపై ఇస్లాం ధర్మ కేంద్రభాగం దృష్టి కేంద్రీకరిస్తున్నది. శాశ్వత సంతోషానికి తాళం చెవి - 'సృష్టికర్త గురించి స్థిరమైన అవగాహన'. ఒక దైవవిశ్వాసి దానిని కలిగి ఉండేలా ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది.

సృష్టికర్తే విశ్వశాంతి మూలమని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఈ ముఖ్య సంబంధంపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మరియు సృష్టికర్త మార్గదర్శకత్వాన్ని అనుసరించడం ద్వారా దైవవిశ్వాసులు అంతర్గత శాంతి మరియు ప్రశాంతత పొందగలరు. స్వంత కోరికలను అనుసరించడం లేదా ప్రాపంచిక సంపద కూడగట్టడం వంటి ఇతర మార్గాల ద్వారా శాశ్వత సంతోషాన్ని సంపాదించే చేసే

ప్రయత్నం మనలోని శూన్యాన్ని ఎన్నడూ నింపలేదు. కేవలం సృష్టికర్త యొక్క అవగాహన, జ్ఞానం మాత్రమే ఈ ఆవశ్యకతను నింపుతుంది.

అలాగే సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలుపడం మరియు విధేయత చూపడంలోనే నిజమైన ప్రశాంతత దొరుకుతుంది: "నిజంగా, దైవధ్యానంలోనే హృదయాలకు విశ్రాంతి దొరుకుతుంది." ఖుర్ఆన్ 13:28

ముస్లింలు తమ సృష్టికర్తతో డైరక్ట్ కనెక్షన్ కలిగి ఉండటమే సృష్టికర్తతో వారి ఈ దగ్గర సంబంధానికి అసలు కారణం. దైవారాధనలో భాగంగా ఇతరులను పూజించడం లేదా ఇతరుల ద్వారా ఆరాధించడం వంటి ఇస్లామేతర ధర్మాల మధ్యవర్తిత్వ, సిఫారసు పద్ధతులు ఇస్లాం ధర్మంలో లేవు.

## 2. జీవితంపై పాజిటివ్ దృక్పథం

తమ జీవితంలో జరిగే 'మంచి - చెడులు' నిజానికి సృష్టికర్త నుండి వచ్చే పరీక్షలే అనే స్పష్టమైన దృక్పథాన్ని ఇస్లాం ధర్మం మానవుడికి ఇస్తున్నది. సృష్టికర్తకు కృతజ్ఞత తెలుపడం మరియు విధేయత చూపడం ద్వారా మొత్తం మానవజీవిత ప్రయోజనానికి సంబంధించిన పరిస్థితులకు అనుగుణంగా ఆ ఘటనలు అర్థం చేసుకునేలా ఇస్లాం ధర్మం మానవుడిని ప్రోత్సహిస్తున్నది. ఎవరు తన మార్గదర్శకత్వాన్ని స్వచ్ఛందంగా, మనస్ఫూర్తిగా ఎంచుకుంటారో పరీక్షించేందుకు వారికి అవసరమైనన్ని తెలివితేటలతో మరియు స్వేచ్ఛతో సృష్టికర్త మానవులను సృష్టించినాడు. ఈ ప్రాపంచిక జీవితం చిట్టచివరి పరీక్షా మైదానం. మనకు జరగబోయే ప్రతిదీ మన నియంత్రణలో లేకపోయినా, మన రియాక్షన్ ను మాత్రం నియంత్రించుకోగలిగే శక్తి మనకు ప్రసాదించబడింది. మన నియంత్రణలో ఉన్న దానిపై దృష్టి కేంద్రీకరించమని, సృష్టికర్త ప్రసాదించిన అనుగ్రహాలకు బదులుగా ఆయనకు కృతజ్ఞత తెలపాలని, కష్టనష్టాలలో సహనంతో ఉండాలని ఇస్లాం ధర్మం మానవుడిని ప్రోత్సహిస్తున్నది. సహనం మరియు కృతజ్ఞత – సంతోష జీవితం యొక్క అసలైన ఫార్ములా ఇదే.

ప్రాపంచిక సుఖసంతోషాలలో అతిశయించడం నుండి దూరంగా ఉండమని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఎందుకంటే, అలాంటి స్థితి సృష్టికర్తను మరిచిపోయేలా చేస్తుంది. అలాగే కష్టనష్టాలలో మితిమీరి దు:ఖించడం నుండి దూరంగా ఉండమని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఎందుకంటే అది సృష్టికర్తపై ఆశలు కోల్పోయేలా చేసి, ఆయనను నిందించేలా చేస్తుంది. ఒక ముస్లిం ఈ భౌతిక ప్రపంచంతో అమితమైన అనుబంధం పెంచుకోకుండా, ఎలాంటి కఠిన పరిస్థితులలనైనా అలవోకగా ఎదుర్కొనే శక్తి పెంపొందించుకుని, సమాజానికి ప్రయోజనం చేకూర్చుతూ మరియు ఉదారంగా ప్రవర్తిస్తూ జీవిస్తాడు. కాబట్టి ఎంతో సంతులిత మరియు సానుకూల జీవిత దృక్పథం కలిగి ఉంటాడు.

## 3. పరిశుద్ధమైన మరియు స్పష్టమైన దైవభావన

ఇస్లామేతర ధర్మాల పేర్లు వాటి మూలస్థాపకుడు లేదా మూలసమాజం పేరు మీద ప్రఖ్యాతి చెందాయి. కానీ, ఇస్లాం ధర్మం విషయంలో అలా జరగలేదు. అరబీ భాషలోని 'ఇస్లాం' అనే పదం ఒక attributive title అంటే లక్షణాల్ని తెలిపే పదం. ఇది 'సర్వలోకాల సృష్టికర్తకు విధేయత' చూపడంలోని ప్రాధాన్యతను సూచిస్తుంది. ఈ పేరులోని ఒక ముఖ్యమైన ప్రత్యేకత ఏమిటంటే అది అసలు ఎక్కడా రాజీ పడకుండా సర్వలోక సృష్టికర్త యొక్క ఏకత్వం, సార్వభౌమత్వం, ఘనత, పరిపూర్ణతలను ప్రకటిస్తున్నది. అందువలన ఇది ఇస్లాం బోధించే సృష్టికర్త యొక్క స్వచ్ఛమైన దివ్యలక్షణాలలో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నది. ఉదాహరణ -

### సర్వలోక సృష్టికర్త ఒక్కడే మరియు ఆయన ఏకైకుడు:

- ఆయనకు భాగస్వాములు లేరు, ఆయనకు సాటి లేరు మరియు ఆయనకు ప్రత్యర్థులు లేరు.
- ఆయనకు తండ్రి, తల్లి, కొడుకులు, కూతుళ్ళు లేదా భార్యలు లేరు.
- కేవలం ఆయన మాత్రమే ఆరాధించబడే అర్హతలు కలిగి ఉన్నాడు.

## ఆయన సర్వశక్తిమంతుడు:

- సమస్త సృష్టిపై ఆయన సంపూర్ణ అధికారం, శక్తీ కలిగి ఉన్నాడు.
- ఆయనకు మనం చూపే విధేయత ఆయన శక్తినేమీ పెంచదు. అలాగే మన అవిధేయత ఆయన శక్తినేమీ తగ్గించదు..

## ఆయన అత్యంత మహోన్నతుడు:

- ఆయన కంటే మహోన్నతమైనదేదీ లేదు. అలాగే ఆయనతో పోల్చదగినదేదీ లేదు.
- సృష్టితాల లక్షణాలకూ మరియు ఆయన దివ్యలక్షణాలకూ మధ్య అస్సలు పోలిక లేదు.
- ఆయనలోని ఏ భాగమూ ఎవ్వరిలోనూ, ఎందులోనూ ప్రవేశించదు.

## ఆయన పరిపూర్ణుడు, సంపూర్ణుడు:

- ఆరు రోజుల విశ్వసృష్టి పూర్తి చేసిన తర్వాత ఏడవ రోజు విశ్రాంతి తీసుకోవలసిన అవసరం ఆయనకు అస్సలు లేదు. ఎందుకంటే ఆయన అపరిమితమైన శక్తిసామర్థ్యాలు కలిగిన వాడు.
- ఆయన తన పరిపూర్ణ దివ్యలక్షణాల్ని నిరంతరం కొనసాగిస్తూ ఉంటాడు. తన పరిపూర్ణత్వానికి రాజీ పడ వలసి వచ్చే ఏ పనీ ఆయన చేయడు. ఉదాహరణకు – ఇతర ధర్మాలు తెలుపుతున్నట్లుగా మానవరూపం ధరించడం. తన మహోన్నత స్థాయికి తగిన దివ్యకార్యాలను వదిలి స్వయంగా అలాంటి అల్పమైన పనులు చేయవలసిన అవసరం ఆయనకు లేదు. కాబట్టి, ఒకవేళ తన దైవత్వ స్థాయిని వదిలి, మానవరూపంలో అవతరించాడని భావిస్తే, ఆ క్షణం నుండి ఆయన దేవుడు కాజాలడు.

## 4. సాక్ష్యాధారాలు మరియు దైవవిశ్వాసములు నొక్కి వక్కాణించటం

ఇస్లాం ధర్మంలో దైవవిశ్వాసం స్పష్టమైన సాక్ష్యాధారాలపై మాత్రమే ఆధారపడి ఉంది. సృష్టికర్త ప్రసాదించిన తెలివితేటలు ఉపయోగించి, జీవితం గురించి మరియు సువిశాల విశ్వం గురించి లోతుగా ఆలోచించమని ప్రజలను ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రాపంచిక జీవితం ఒక పరీక్షాకాలం. అయినా, విశాల దృక్పథంతో మరియు చిత్తశుద్ధితో సత్యాన్వేషణ చేసే ప్రజల కొరకు సృష్టికర్త ఎన్నో సూచనలు మరియు మార్గదర్శకత్వం పంపినాడు.

"నిశ్చయంగా మేము విషయాలను స్పష్టంగా తెలిపే సూచనలు పంపాము: మరియు తను తలిచిన వారికి అల్లాహ్ సన్మార్గాన్ని చూపుతాడు."ఖుర్ఆన్ 24:46

ఇతర ధర్మాల ప్రజలు తమ ధర్మ మూలగ్రంథ అవతరణ గురించి విభిన్న అభిప్రాయాలు కలిగి ఉన్నారు. దీనికి భిన్నంగా ఇస్లాం ధర్మ మూలగ్రంథమైన ఖుర్ఆన్ గ్రంథం సర్వలోక సృష్టికర్త నుండే తిన్నగా అవతరించబడింది అనే వాస్తవాన్ని అనేక ఋజువులు, సూచనలు, చిహ్నాలు మరియు మహిమలు స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

### ఖుర్ఆన్ :

- 23 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో అవతరించినా, దానిలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు, లోపాలు, దోషాలు మరియు పరస్పర వైరుధ్యాలు లేవని, అది వాటికి అతీతంగా ఉందని ఋజువు అయింది.
- అరబీ భాషలో అవతరించిన నాటి నుండి, దానిలోని ప్రతి అక్షరం యథాతథంగా దాని అసలు రూపంలో ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాకుండా, ఒక్క అక్షరం కూడా కోల్పోకుండా ఈనాటికీ దాని అసలు అవతరించిన రూపంలోనే భద్రంగా ఉన్నది.

- దానిలో చిత్తశుద్ధితో సత్యాన్వేషణ చేస్తున్న ప్రతి ఒక్కరి కోసం సులభమైన, స్వచ్ఛమైన మరియు సర్వసామాన్య సందేశం ఉన్నది.
- అసమాన, అపూర్వ మరియు అనుకరింప శక్యం కాని భాషాశైలి కలిగి ఉన్నది. విశ్వవ్యాప్తంగా అది అరబీ భాషా వాగ్ధాటిలో మరియు సాహిత్య సౌందర్యంలో అత్యున్నత శిఖరానికి చేరుకున్న ఏకైక గ్రంథంగా ప్రసిద్ధి చెందినప్పటికీ, వాస్తవానికి చదవటం వ్రాయటం రాని అంటే అక్షరజ్ఞానం లేని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఖుర్ఆన్ అవతరించటమనేది సృష్టకర్త ఘనతను తెలిపే ఒక గొప్ప సూచన.
- 1400 సంవత్సరాలకు పూర్వం అవతరించబడినప్పటికీ, ఈ మధ్య కాలంలో మాత్రమే శాస్త్రజ్ఞులు కనిపెట్టగలిగిన అనేకానేక అద్భుత వైజ్ఞానిక వాస్తవాలు దానిలో స్పష్టంగా పేర్కొనబడి ఉన్నాయి.

ఖుర్ఆన్ లో ఎన్నో అపూర్వ మరియు అద్భుత అంశాలు 14 శతాబ్దాలకు పూర్వమే ఎలా ప్రస్తావించబడినాయి అనే ప్రశ్నకు దానిని అవతరింపజేసింది సృష్టికర్త కాకుండా ముమ్మాటికీ మరొకరు కాజాలరు అనేది అత్యంత వివేకాత్మకమైన మరియు హేతుబద్ధ జవాబు.

## 5. పాపాల మన్నింపు

సృష్టికర్త దయాదాక్షిణ్యాలు ఆశించడం మరియు ఆయన కఠినశిక్షలకు భయ పడటం – ఈ రెండింటి మధ్య సంతులనాన్ని కలిగి ఉండమని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది. నమ్రత, వినయవిధేయతలతో కూడిన సానుకూల జీవితం గడపడానికి ఈ రెండింటి మధ్య సంతులనం తప్పనిసరి.

మనం పవిత్ర స్థితిలో పుట్టినా పాపం చేసే స్వేచ్ఛ మనకు ఇవ్వబడింది. కాబట్టి మనం పరిపూర్ణులం కాలేమని మరియు తప్పులు చేస్తామనీ మనల్ని సృష్టించిన సృష్టికర్తకు బాగా తెలుసు. అయితే అలాంటి పాపాలు చేసినప్పుడు, మనమెలా ప్రవర్తిస్తామనేదే అసలు విషయం.

"అల్లాహ్ యొక్క దయ లభించదని నిరాశ చెందకండి.; మీ పాపాలన్నింటినీ ఆయన క్షమించగలడు." ఖుర్ఆన్ 39:53

సృష్టకర్త అపార కృపాశీలుడనీ మరియు త్రికరణశుద్ధిగా పశ్చాత్తాప పడుతూ క్షమాపణ అర్థించే ప్రజలను తప్పక మన్నిస్తాడనీ ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. చిత్తశుద్ధి, పశ్చాత్తాపం, అలాంటి పాపం మరలా చేయకూడదని దృఢంగా నిశ్చయించుకోవడం మరియు చెడు పనులకు దూరంగా ఉంటూ నిగ్రహం పాటించడం మొదలైనవి అలా క్షమాపణ అడగటంలో ఉండవలసిన ముఖ్యాంశాలు. అలా మనలో స్వయం వికాసం మరియు స్వయం శుద్ధి ప్రక్రియ నిరంతరం కొనసాగాలని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రక్రియ డైరక్టుగా వ్యక్తికి మరియు సృష్టికర్తకు మధ్య మాత్రమే జరగాలి. తాము చేసిన తప్పులు, పాపాల గురించి మతాచార్యులకు తెలుపవలసిన లేదా వారి ముందు ఒప్పుకోవసిన అవసరం ఎంత మాత్రం లేదు. ఇంకా, పాప ప్రక్షాళన కోసం దేవుడు స్వయంగా బలి అవడం లేదా మరెవరినైనా బలి ఇవ్వమని కోరడంలో అసత్యం తప్ప మరేమీ లేదు.

## 6. జవాబుదారీతనం మరియు అంతిమ న్యాయం

సృష్టికర్త అణువంత కూడా పక్షపాతం చూపని అత్యంత మహోన్నత న్యాయస్థుడనీ మరియు తీర్పుదినాన ప్రతి వ్యక్తీ స్వంత కర్మలకు అతడే బాధ్యుడిగా నిలబెట్టబడతాడనీ ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. మంచి- చెడుల మధ్య భేదం కనుక్కునే తెలివితేటలు మరియు రెండింటిలో ఒకదానిని ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఇవ్వబడటం వలన, ప్రతి ఒక్కరూ తమ తమ కర్మలకు స్వయంగా బాధ్యులవుతారు.

ప్రతి ఒక్కరికీ పుణ్యాలు ప్రసాదించబడే లేదా శిక్షించబడే ఒక అంతిమ తీర్పుదినం తప్పకుండా ఉండాలనేది తిరస్కరించలేని ఒక న్యాయమైన

డిమాండు. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే అవకాశం లేదు. ఒకవేళ అలాంటి తీర్పుదినం లేకపోతే, ఈ జీవితానికి అర్థం పర్థం లేకుండా పోతుంది.

మన బాధ్యతలను మనం ఎంత మంచిగా పూర్తి చేశాం మరియు మనకు ఇవ్వబడిన స్వేచ్ఛను ఎంత మంచిగా వాడుకున్నామనే వాటిపై అంతిమ విచారణ జరుగుతుందని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. మనం చేసే ప్రతి పనీ తెలుసుకునే మరియు చూసే మహత్తర శక్తి గల సర్వలోక జ్ఞానవంతుడు మరియు వివేకవంతుడు అయిన సృష్టికర్తచే ఆనాడు విచారించబడతాము. ఇలాంటి భావన సమాజాన్ని కలిసి మెలిసి జీవించేలా ప్రోత్సహిస్తుంది. అంతేగాక చిట్టచివరికి న్యాయానిదే పైచేయి అవుతుందనే సంతృప్తి ప్రజలలో కలిగిస్తుంది.

## 7. వ్యావహారిక మరియు సంతులిత జీవిత విధానం

దైవవిశ్వాసం మరియు ఆచరణల మధ్య సరైన సంతులనాన్ని ఇస్లాం ధర్మం నిర్దేశిస్తున్నది. స్థిరమైన జీవితం కోసం ఇవి రెండూ అవసరం. అన్నిరకాల పరిస్థితులలో మరియు సందర్భాలలో పనికి వచ్చే మార్గదర్శకత్వాన్ని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ప్రజల ఆధ్యాత్మిక, శారీరక, మానసిక మరియు సామాజిక అవసరాలు పూర్తి చేసే ప్రాక్టికల్ ఆరాధనా చర్యలతో కూడిన ఒక ప్రయోగాత్మక ధర్మం – ఇస్లాం ధర్మం.

**అనేక ప్రయోజనాలతో నిండియున్న కొన్ని ఆచరణాత్మక ఆరాధనా చర్యలు:**

- **రోజువారీ ఐదు పూటల నమాజు** – తన ప్రభువుతో నిరంతర సంబంధం కలిగి ఉండవలసిన ఆధ్యాత్మిక అవసరాన్ని పూర్తి చేయడం ద్వారా ఆత్మను సుసంపన్నం చేస్తుంది (ప్రత్యేకంగా నేటి బిజీ జీవితంలో); రుకూ (మోకాళ్ళపై చేతులు ఆన్చి ముందుకు వంగోటం) మరియు సజ్దాల (సాష్టాంగం) ద్వారా మనలో అణుకువ, నమ్రత, విధేయతలను నింపుతుంది; సామూహికంగా చేసే నమాజు దైవవిశ్వాసుల మధ్య కలిగే విభేదాలు, అహంకారం, జాతి

వివక్షలను తొలిగిస్తుంది; సృష్టికర్త ముందు క్రమం తప్పకుండా నిలబడటం వలన పాపాలు, తప్పులు చేయకుండా ఆపుతుంది.

- **విధిదానం (జకాత్)** – స్వార్థపరత్వం నుండి మనిషిని పరిశుద్ధం చేస్తుంది; నిరుపేదలపై సానుభూతి, దయ చూపేలా ప్రోత్సహిస్తుంది; సృష్టికర్త ప్రసాదించిన అనుగ్రహాలను జ్ఞాపకం చేస్తుంది; బీదరికం నిర్మూలనకు దోహదపడుతుంది; ధనవంతుల - పేదల మధ్య దూరాన్ని తగ్గిస్తుంది.
- **రమదాన్ నెల ఉపవాసాలు** – ఆధ్యాత్మిక స్వీయ శుద్ధీకరణ జరుగుతుంది, ఆత్మ నిగ్రహం మరియు ఆత్మవిశ్వాసాలు పెరుగుతాయి; వైజ్ఞానికపరంగా నిరూపించబడిన ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి; బీదసాదల కష్టాలపై సానుభూతి కలుగుతుంది మరియు వాటి అవగాహనకు అవకాశం ఉంది; సృష్టికర్తకు విధేయత చూపే అలవాటు అలవర్చుకునేలా ప్రజలకు శిక్షణ లభిస్తుంది.
- **హజ్ యాత్ర** – మక్కా వద్ద ప్రజలందరూ ఒకే విధమైన మామూలు తెల్లటి వస్త్రాలు చుట్టుకొని ఎలాంటి భేదభావాలు లేకుండా ఏకకాలంలో సామూహికంగా అనేక పుణ్యకార్యాలు చేయడమనేది జాతి, కులం, రంగు మరియు స్టేటస్ లకు అతీతంగా మానవులందరినీ సంఘటితం చేస్తుంది.

సమస్త మానవజాతి కోసం చిట్టచివరిగా ఇస్లాం ధర్మాన్ని మన సృష్టికర్త పంపినాడు. దీనిలోని ప్రతి ధర్మాజ్ఞ సరిగ్గా ఆచరిస్తే, అది వ్యక్తికీ మరియు సమాజానికీ తప్పక ప్రయోజనం చేకూరుస్తుంది. ఖుర్ఆన్ లో తెలుపబడిన కొన్ని మంచి అలవాట్లు – నిజాయితీగా జీవించడం, క్షమించడం, సత్యం పలకడం, భార్యతో మంచిగా ప్రవర్తించడం, సహనం చూపడం, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, మధ్యేమార్గాన్ని అనుసరించడం, చిత్తశుద్ధి కలిగి ఉండటం, తల్లిదండ్రులను, కుటుంబాన్ని మరియు పెద్దలను గౌరవించడం మొదలైనవి. ఈనాడు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక వ్యక్తిగత మరియు సామాజిక చీడలను

సమూలంగా నిర్మూలించే లేదా తగ్గించే ఇలాంటి అనేక మూలసూత్రాలు ఇస్లాం ధర్మంలో ఉన్నాయి.

## 8. సార్వజనికమైన మరియు కాలాతీతమైన దివ్యసందేశం

ఆదం సృష్టి నుండి అంతిమ తీర్పుదినం వరకు అన్ని కాలాలలో మొత్తం మానవజాతికి వర్తించే దివ్యసందేశం ఇస్లాం ధర్మంలో ఉన్నది. ఇన్ని యుగాలకు వర్తించినట్లే, అది ఈ యుగానికి కూడా వర్తిస్తుంది.

ఎందుకంటే ఇస్లాం ధర్మం మూలసిద్ధాంతాలు ప్రకృతి సహజమైనవి. ఉదాహరణకు - సృష్టికర్త ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి. ప్రజలు దైవవిశ్వాసం మరియు పుణ్యకార్యాల ద్వారా మాత్రమే ప్రభువు అనుగ్రహం పొందగలరు మరియు తమ మధ్య భేదాన్ని గుర్తించగలరు – అంతేగాని జాతి, సంపద, లింగ, కుల, స్టేటస్ లేదా సాంఘిక వర్గీకరణల ద్వారా కాదు.

## చివరి మాట

ఇస్లాం ధర్మం యొక్క కాలాతీతమైన అద్భుత దివ్యసందేశం మరియు నూహ్, అబ్రహాం, మోసెస్, జీసస్ మరియు ముహమ్మద్ ప్రవక్తలతో (అలైహిస్సలాం) సహా మొత్తం ప్రవక్తలందరి దివ్యసందేశం ఒక్కటే. వారందరూ "ఏకైక నిజ ప్రభువుకు మాత్రమే సమర్పించుకోండి" అంటే ముస్లింగా మారండి అని తమ ప్రజలను పిలిచారు. అరబీభాషలో ముస్లిం అంటే సమర్పించుకోవటం. ఇలా సృష్టికర్తకు సమర్పించు కోవడం ద్వారా సృష్టికర్త ఘనతను గుర్తిస్తూ మరియు చిత్తశుద్ధితో కేవలం ఆయనను మాత్రమే ఆరాధిస్తూ మానవజీవిత ఉద్దేశ్యాన్ని పూర్తి చేసి, ఇహపరలోకాలలో సాఫల్యం పొందే అవకాశం ఉంది. తద్వారా ఇస్లాం ధర్మంలోని లెక్కలేన్ని లాభాలు కూడా పొందవచ్చు.

# 3. ఇస్లాం గురించి .....

ఇస్లాం ధర్మం ప్రకృతి సహజ ధర్మం మరియు ఒక సంపూర్ణ జీవన విధానం. ఇది తమ సృష్టికర్తతో కలిగి ఉండవలసిన గట్టి సంబంధంపై సావధానత చూపాలని ప్రోత్సహిస్తున్నది. సర్వలోక సృష్టికర్త మార్గదర్శకత్వాన్ని అనుసరించి మంచి పనులు చేస్తూ, ఆయనకు చేరువ కావడం ద్వారా నిజమైన శాశ్వత సుఖసంతోషాలు మరియు శాంతి లభిస్తాయని ప్రజలకు బోధిస్తున్నది.

ప్రపంచ జనాభాలో ముస్లింలు దాదాపు ఐదవ వంతు ఉండి, ప్రపంచంలోని అతి పెద్ద ధర్మాలలో ఒకటిగా ఇస్లాం ధర్మానికి స్థానం కల్పించారు. సర్వలోక సృష్టికర్త అయిన ఏకైక ఆరాధ్యుడిని విశ్వసించడం మరియు ఆరాధించడమే మానవ జీవిత ఉద్దేశ్యం మరియు ఇస్లాం ధర్మం మూలస్థంభము.

"ఇస్లాం" అనే అరబీ పదం యొక్క భాషాపరమైన అర్థం "సమర్పణ, శాంతి" అంటే సర్వలోక సృష్టికర్త అయిన ఏకైక ఆరాధ్యుడికి మనస్ఫూర్తిగా, శాంతియుతంగా సమర్పించుకొనుట. అలాగే ముస్లిం అంటే జాతి, కుల, వర్గ, వర్ణ, లింగ, హెూదా, ఆస్తి అంతస్తుల భేదం లేకుండా స్వచ్ఛందంగా సర్వలోక సృష్టికర్త అయిన ఏకైక ఆరాధ్యుడికి సమర్పించుకున్నవారు.

ఇస్లాం ధర్మం యొక్క ఒక ప్రత్యేకత ఏమిటంటే, ఇతర ధర్మాల వలే ఇస్లాం ధర్మం పేరు ఎవరో ఒక వ్యక్తిని లేదా జాతిని అనుసరించి పెట్టబడలేదు.

## అర్కాన్ అల్ ఈమాన్ అంటే దైవవిశ్వాసం యొక్క ఆరు మూలస్థంభాలు

### 1. అల్లాహ్ పై విశ్వాసం

"అల్లాహ్" అనే పదం అరబీ భాషలో సర్వలోక సృష్టికర్త అయిన ఏకైక ఆరాధ్యుడి స్వంత పేరును సూచిస్తుంది. అల్లాహ్ కు విరోధులు లేరు, భాగస్వాములు లేరు, సమానులు లేరు, సంతానం లేదు, తల్లిదండ్రులు లేరు.

ఎవ్వరూ సాటి లేరు. ఆయనకు మరియు ఆయన సృష్టికి అస్సలు పోలిక లేదు. ఎందుకంటే ఆయన దైవత్వంలో మరియు పరిపూర్ణ దివ్యలక్షణాలలో ఎవ్వరికీ భాగస్వామ్యం లేదు.

ఆయన యొక్క కొన్ని దివ్యనామాలు మరియు దివ్యలక్షణాలు: సర్వలోక సృష్టికర్త, అత్యంత దయామయుడు, అపార కృపాశీలుడు, మహోన్నతుడు, అత్యంత శక్తిమంతుడు, అత్యంత న్యాయవంతుడు, అత్యంత వివేకవంతుడు, పాలకుడు, పోషకుడు, అన్నీ ఎరిగినవాడు.

ఆయనే అన్నింటి సృష్టికర్తా మరియు పోషకుడూను. మనకు లెక్కకు మించిన అనుగ్రహాలను ప్రసాదించినాడు. ఉదాహరణకు, వినే, చూచే, ఆలోచించే, నడిచే, మాట్లాడే మరియు సంతానోత్పత్తి చేసే శక్తిసామర్థ్యాలు. అందువలన మనం ఆయన మహోన్నత స్థానాన్ని గుర్తించాలి, ఒప్పుకోవాలి, కృతజ్ఞతలు తెలుపుకోవాలి మరియు ఆయన పంపిన మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ, కేవలం ఆయనను మాత్రమే ఆరాధించాలి.

అత్యంత శక్తిమంతుడు మరియు వివేకవంతుడి ద్వారా కాకుండా, అత్యంత క్లిష్టతరమైన ఈ సంతులిత విశాల విశ్వం ఉనికిలోనికి రావడం అసంభవమనే మాట హేతుబద్ధమైనది. కాబట్టి ఈ సృష్టి స్వయంగాఉనికి లోనికి వచ్చింది లేదా ఏదో హఠాత్పరిణామం లేక యాదృచ్ఛిక సంఘటన వలన ఉనికి లోనికి వచ్చిందని భావించడం ఎంత మాత్రమూ హేతుబద్ధమైన విషయం కాదు.

## 2. దైవదూతలపై విశ్వాసం

దైవదూతలు కాంతితో సృష్టించబడినారు. వారికి కొన్ని బాధ్యతలు అప్పజెప్పబడినాయి. దైవదూతలు ఎన్నడూ సర్వలోక సృష్టికర్తకు అవిధేయత చూపవు. వారిలో కొందరి గురించి మాత్రమే దివ్యసందేశం ద్వారా తెలియజేయబడింది – ఉదాహరణకు, దైవప్రవక్తలకు దివ్యసందేశాన్ని అందజేసే జిబ్రయీల్, ప్రజల ప్రాణం తీసే మరణ దైవదూత.

## 3. దైవగ్రంథాలపై విశ్వాసం

మానవాళికి మార్గదర్శకత్వం వహించేలా, మానవులపై కారుణ్యంగా అల్లాహ్ తన ప్రవక్తలపై దివ్యవాణిని అవతరింపజేసినాడు. ఆ దివ్యవాణులలో తౌరా, గోస్పెల్ దివ్యగ్రంథాలు మోసెస్ మరియు జీసస్ అలైహిస్సలాంలపై అవతరింపజేయబడినాయి. అలాగే ఖుర్ఆన్ దివ్యగ్రంథం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేయబడింది.

ఖుర్ఆన్ అల్లాహ్ వాక్కు మరియు సమస్త మానవుల కొరకు పంపబడిన అంతిమ సందేశం. అది సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ నుండే అవతరింపజేయబడిందని నిరూపించే అనేక స్పష్టమైన నిదర్శనాలు మరియు మహిమలు ఉన్నాయి. ఉదాహరణకు వాటిలో కొన్ని:

- అంతరాత్మలోని దైవవిశ్వాసాన్ని మేలుకొలిపే సులభమైన, స్వచ్ఛమైన సార్వజనిక సందేశాన్ని కలిగున్నది.
- సాహిత్యపరంగా సాటిలేని ప్రత్యేక శైలి కలిగి ఉన్నది. అది అరబీ భాషలో అత్యుత్తమ వాగ్ధాటి మరియు సాహిత్య సౌందర్యాన్ని కలిగి ఉన్న సాటిలేని గ్రంథమనే వాస్తవం విశ్వవ్యాప్తంగా గుర్తించబడింది – అయినా అది నిరక్షరాస్యులైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింప జేయబడిందనే వాస్తవం ఒక చారిత్రక నిదర్శనం.
- 1400 సంవత్సరాలకు పూర్వమే అవతరింపజేయబడిన అందులోని అనేక వైజ్ఞానిక వాస్తవాలను, ఈ మధ్యకాలంలోనే శాస్త్రజ్ఞులు నేటి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో కనిపెట్టగలిగారు.
- దానిలో ఎలాంటి పొరపాట్లు లేదా పరస్పర విరుద్ధమైన వచనాలు లేవు.
- కాలక్రమంలో అనేక మార్పులు చేర్పులకు గురైన, అసలు వచనాలను కోల్పోయిన ఇతర దివ్యగ్రంథాలకు వలే కాకుండా, దానిలోని ప్రతి అక్షరం

అరబీ భాషలో అవతరించినప్పటి నుండి ఎలాంటి మార్పులు చేర్పులకు గురి కాకుండా స్వచ్ఛమైన అసలు రూపంలోనే సజీవంగా ఉండేట్లు భద్రపరచబడింది.

అనేక అద్భుతమైన మరియు మహిమలతో నిండిన ఖుర్ఆన్ యొక్క ప్రత్యేకత గురించి అత్యంత హేతువాద వివరణ ఏమిటంటే అది కేవలం సర్వలోక సృష్టికర్త నుండి మాత్రమే పంపబడింది. ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ప్రామాణిక పలుకులు మరియు ఆచరణలు ఇస్లామీయ ధర్మజ్ఞానం యొక్క ప్రాథమిక మూలాలుగా గుర్తించబడినాయి.

## 4. దైవప్రవక్తలపై విశ్వాసం

అల్లాహ్ సందేశాన్ని ప్రజలకు అందజేసేందుకు ప్రతి జాతి కొరకు కనీసం ఒక ప్రవక్త చొప్పున అనేక వేల మంది ప్రవక్తలు పంపబడినారని ముస్లింల విశ్వాసం. ఈ ప్రవక్తలలో కొందరి పేర్లు ఆదం, నూహ్, అబ్రహాం, డేవిడ్, జోసెఫ్, మోసెస్, జీసస్ అలైహిస్సలాం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. ప్రజలను ఏకైక నిజ దైవమైన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని పిలవబడమే వారి లక్ష్యం. అంతేగాక వారు ఆచరాణ్మకంగా ఎలా అల్లాహ్ కు విధేయత చూపాలి అనే ఆచరించి చూపారు. ప్రజలకు ముక్తిమార్గం వైపు దారి చూపారు. సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ దైవత్వంలో వారు భాగస్వామ్యాన్ని పంచుకోలేదు. తమనే ప్రార్థించడాన్ని మరియు ఆరాధించడాన్ని లేదా తమ ద్వారానే ప్రభువును ప్రార్థించడాన్ని లేక ఆరాధించడాన్ని వారు పూర్తిగా నిషేధించారు. అలా చేయడాన్ని వారు కేవలం అల్లాహ్ మాత్రమే ఆరాధింప బడాలనే ఆయన హక్కును ఉల్లంఘించినట్లవుతుందని బోధించారు.

### ➢ ప్రవక్త జీసస్ అలైహిస్సలాం

అల్లాహ్ యొక్క ఆజ్ఞ ద్వారా తన తల్లి కన్య మేరీకు అద్భుతంగా జన్మించిన ప్రవక్త జీసస్ అలైహిస్సలాంను ముస్లింలు అల్లాహ్ యొక్క ఒక

గౌరవనీయ ప్రవక్తగా విశ్వసిస్తారు. అల్లాహ్ యొక్క అనుజ్ఞతో ఆయన అనేక మహిమలు చేసి చూపారు, ఉదాహరణకు రోగులను నయం చేయడం, అంధులకు చూపును ప్రసాదించడం మరియు ఉయ్యాలలోని దినాల పసిబిడ్డగా ప్రజలు తన తల్లిపై వేస్తున్న నిందలకు జవాబివ్వడం. ముస్లింలు ప్రవక్త జీసస్ అలైహిస్సలాంను గౌరవిస్తున్నా మరియు ప్రేమిస్తున్నా, ఆయనను మాత్రం పూజించరు, ఆరాధించరు. ఆయనను దేవుడి కుమారుడిగా లేదా త్రైత్వంలో ఒకనిగా లేదా దేవుడి సంపూర్ణ దివ్యలక్షణాలలో భాగస్వామిగా పరిగణించరు. ఖుర్ఆన్ లోని అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉన్నది:

"ఎవరినైనా కుమారునిగా చేసుకోవడం అల్లాహ్ స్థాయికి తగిన పని కాదు; ఆయన సర్వలోపాలకు అతీతుడు! ఆయన ఏదైనా చేయదల్చుకుంటే, దానిని కేవలం 'అయిపో' అని అంటాడు, అంతే అది అయిపోతుంది." ఖుర్ఆన్ 19:35

## ➢ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమస్త మానవాళి కోసం పంపబడిన అంతిమ ప్రవక్త. ఆయనపై అంతిమ దివ్యసందేశం ఖుర్ఆన్ అవతరించింది. దానిని ఎలా అనుసరించి జీవితం గడపాలో స్వయంగా ఆచరించి చూపారు. నిజాయితీ, న్యాయం, దయ, కారుణ్యం, సత్యత, ధైర్యసాహసాలకు ఆయన ఒక సంపూర్ణ ఉపమానం. ప్రవక్త జీసస్ అలైహిస్సలాంకు వలే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను కూడా ముస్లింలు ఆరాధించరు, ప్రార్థించరు, అల్లాహ్ దైవత్వంలో భాగస్వామిగా పరిగణించరు.

## 5. అంతిమ తీర్పుదినంపై విశ్వాసం

అంతిమ తీర్పుదినం తప్పనిసరిగా సంభవించబోతున్నది. ఆ మహా దినమున మనలోని ప్రతి ఒక్కరు మన సృష్టికర్త అయిన అల్లాహ్ ముందు నిలబెట్టబడతాము మరియు ఇహలోకపు మంచి చెడు పనుల గురించి

ప్రశ్నింపబడతాము. ఎంత చిన్నదైనా, పెద్దదైనా సరే దాని పరిమాణంతో నిమిత్తం లేకుండా మన ప్రతి పనీ లెక్కించబడుతుంది.

ఈ మహా దినాన, అత్యంత న్యాయవంతుడైన అల్లాహ్ ప్రతి విషయంపై న్యాయంగా తీర్పునిస్తాడు. ఎవ్వరికీ అన్యాయం జరగదు. ప్రతి ఒక్కరి హక్కులు వాపసు చేయబడతాయి. ఇహలోకంలో చేసుకున్న పాపపుణ్యాల ఆధారంగా శాశ్వత స్వర్గప్రవేశం లేదా నరకప్రవేశం తీర్మానించబడుతుంది. తద్వారా మానవులందరికీ న్యాయం జరుగుతుంది.

## 6. విధివ్రాతపై విశ్వాసం

భూత భవిష్య వర్తమాన కాలాలలో ఏమి జరుగునో అల్లాహ్ కు బాగా తెలుసు. ఆయనకు అన్నింటిపై పూర్తి ఆధిపత్యం ఉన్నది – ఆయనకు తెలియకుండా మరియు ఆయన అనుజ్ఞ, అనుమతి లేకుండా ఏదీ జరగదు.

మంచిచెడులలో ఒకదానిని ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఇవ్వ బడటం వలన తాము ఎంచుకున్న దానికి స్వయంగా తామే బాధ్యత వహించవలసి ఉంటుంది.

అల్లాహ్ జ్ఞానం మరియు అనుమతితో మాత్రమే ఏదైనా జరుగుతుందనే వాస్తవంతో మనకు ప్రసాదించబడిన స్వేచ్ఛ విభేదించదు. ప్రతిదానిపై అల్లాహ్ కు ఉన్న ఆధిపత్యం ప్రజల స్వేచ్ఛను అడ్డుకుంటుందని లేక పరిమితం చేస్తుందనీ కాదు. ప్రజలు తీసుకునే నిర్ణయాల గురించి ముందుగానే అల్లాహ్ కు తెలిసి ఉండటం అనేది వారలా నిర్ణయించుకునేలా బలవంతం చేయబడతారనీ కాదు. తన అనుమతితోనే జరుగుతున్న సంఘటనలలో ప్రతిదానికీ సృష్టికర్త సంతుష్టంగా ఉన్నాడనీ కాదు.

## ఇస్లామీయ ఆరాధనల మూలస్థంభాలు - ఐదు

అవి ఒక ముస్లిం జీవితానికి అసలైన పునాది వంటివి.

## 1. విశ్వాస సాక్ష్యప్రకటన

విశ్వాస సాక్ష్యప్రకటన – అష్ హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు, వ అష్ హదు అన్న ముహమ్మద్ రసూలుల్లాహ్ అంటే నేను సాక్ష్యమిస్తున్నాను అల్లాహ్ తప్ప ఆరాధనలకు అర్హుడైన మరో ఆరాధ్యుడు లేడని మరియు నేను సాక్ష్యమిస్తున్నాను ముహమ్మద్, అల్లాహ్ యొక్క ప్రవక్త అనీ.

దీనిని మనస్ఫూర్తిగా చిత్తశుద్ధి మరియు దృఢవిశ్వాసంతో పలికి, ఆచరణలతో ధృవీకరించాలి. ఈ విశ్వాస సాక్ష్యప్రకటన ద్వారా ఇతర ఆరాధ్యులు, దేవుళ్ళందరినీ ఆ వ్యక్తి పూర్తిగా తిరస్కరిస్తాడు. అంతేగాక కేవలం అల్లాహ్ మాత్రమే ఆరాధింపబడే అర్హతలు, యోగ్యతలు గలవాడని నొక్కి చెబుతూ, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అంతిమ ప్రవక్తగా స్వీకరించి, ముస్లింగా మారిపోతాడు.

## 2. రోజువారి తప్పనిసరి నమాజులు

ఒక ముస్లింకు మరియు వాని సృష్టికర్తకు మధ్య వ్యక్తిగత మరియు ఆధ్యాత్మిక పవిత్ర సంబంధాన్ని నమాజులు స్థాపిస్తాయి. సృష్టికర్తకు విధేయత చూపాలనే బాధ్యతను నిలకడగా మరియు ఆచరణాత్మకంగా జ్ఞాపకం చేసే ఒక రిమైండర్. ఐదు పూటలా నమాజు చేయవలసిన నిర్ణీత సమయాలు – ఉషోదయం, మధ్యాహ్నం, సాయంత్రం, సూర్యాస్తమయం అయిన వెంటనే మరియు రాత్రి పూట. ప్రతి నమాజు పూర్తి చేయడానికి కొన్ని నిమిషాల సమయమే పడుతుంది. అందులో నిలుచోవటం, వంగోటం, కూర్చోటం, సాష్టాంగపడటం వంటి వివిధ భంగిమలలో ఖుర్ఆన్ పఠించడం, వేడుకోవడం, అల్లాహ్ ను ప్రశంసించడం మొదలైనవి ఉన్నాయి. నమాజు చేసే ముందు శారీరక మరియు ఆధ్యాత్మిక పవిత్రత కోసం ముస్లింలు శుభ్రంగా తమ నోరు, ముక్కు, ముఖం, చెవులు, చేతులు, పాదాలు మొదలైన అవయవాలను నీళ్ళతో కడుగుతారు.

## 3. జకాతు – వార్షిక విధిదానం

నిర్ణీత పరిమితికి మించి అదనపు సంపద ఒక సంవత్సరం పాటు నిలువ చేసుకున్న ముస్లింలపై వార్షిక విధిదానం తప్పనిసరి. అలాంటి వారిపై ప్రతి సంవత్సరం తమ సంపదలో నుండి 2.5% తీసి, అర్హులైన బీదలకు, అక్కరగలవారికి లేదా అప్పులలో కూరుకుపోయిన ప్రజలకు దానం చేయాలి. అది వారి సంపదను పవిత్రం చేస్తుంది. దీని వలన ఇచ్చేవానికి మరియు పుచ్చుకునేవానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఏమిటంటే ధనవంతుల మరియు పేదల మధ్య దూరాన్ని తగ్గించి, ఆత్మీయతను పెంచుతుంది. అంతేగాక ప్రతి ఒక్కరి కనీస అవసరాలు పూర్తయ్యేలా చేస్తుంది.

## 4. రమదాన్ మాస ఉపవాసాలు

ప్రతి సంవత్సరం రమదాన్ మాసంలో ముస్లింలు ప్రాతఃకాలం నుండి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాల నుండి మరియు దాంపత్య సుఖం నుండి దూరంగా ఉండి అల్లాహ్ ఆజ్ఞను అనుసరిస్తూ ఉపవాసం పాటిస్తారు. అది మనల్ని ఆధ్యాత్మికంగా పరిశుద్ధ పరుస్తుంది. మనలో సహనం, ఓర్పులను మరియు స్వనిగ్రహాన్ని పెంచుతుంది. ఇంకా మన శరీరానికి అనేక ఆరోగ్యపరమైన లాభాలను కలుగజేస్తుంది.

## 5. హజ్ యాత్ర

ఆర్థికంగా మరియు శారీరకంగా తగిన స్థోమత కలిగి ఉన్న ముస్లింలు తమ జీవితంలో కనీసం ఒక్కసారి సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగరానికి వెళ్ళి, పవిత్ర హజ్ యాత్ర చేయవలసి ఉన్నది. అది ప్రతి సంవత్సరం ఇస్లామీయ క్యాలెండరులోని 12వ నెలలో జరుగుతుంది. జాతి, వర్గ, వర్ణ, ఆస్తి, అంతస్థు, హూదా, లింగ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ నిర్ణీత దినాలలో, నిర్ణీత ప్రదేశాలలో, నిర్ణీత పద్ధతి ప్రకారం ఏకైక నిజదేవుడైన అల్లాహ్ ను ఆరాధిస్తారు. హజ్ యాత్రికులలోని మగవారందరూ అంతస్థు, హూదా, ప్రాంతీయ సంస్కృతీ

సాంప్రదాయాలను విడిచిపెట్టి, ఒకేరకమైన రెండు తెల్లటి వస్త్రాలను ధరిస్తారు. ఆ విధంగా అల్లాహ్ వద్ద మానవులంతా సమానులేనని ఆచరణాత్మకంగా ప్రజలు మిలియన్లలో ఒకే రకమైన దుస్తులలో ఒక రోజంతా అరఫాత్ మైదానంలో ఆకాశం క్రింద నిలబడి మరీ చూపుతారు. అలాగే ఒక రాత్రంతా ఎలాంటి పైకప్పు లేని ముజ్దలిఫా మైదానంలో నేలపై నిద్రిస్తారు. ఈ పవిత్ర హజ్ యాత్రలో అనేక దశలు ఉన్నాయి – ఖుర్బానీ, ప్రయాణం, వేర్వేరు చోట్ల ప్రార్థించడం మొదలైనవి. అలాంటి అద్భుత అనుభవం వారి జీవిత దిశనే మార్చివేస్తుంది. అణుకువ, నమ్రత, మరింత సహనం మరియు ఓర్పు కలిగిన వ్యక్తిగా, కృతజ్ఞతలతో నిండిన వ్యక్తిగా మార్చివేస్తుంది.

## ఇస్లామీయ ఆరాధనల భావన

అల్లాహ్ సమ్మతించే, ఇష్టపడే ఏ పనైనా ఇస్లాంలో ఆరాధనగానే పరిగణింపబడుతుంది.

ఇస్లామీయ ఆరాధనల భావన కేవలం ఐదు ఇస్లామీయ మూలస్థంభాలకే పరిమితం కాలేదు. అల్లాహ్ సమ్మతించే, ఇష్టపడే ఏ పనినైనా సూచించే ఒక సమగ్రమైన పదమే 'ఆరాధన'. ఇస్లామీయ భావనలో ఆరాధన అనేది కేవలం ఐదు ఇస్లామీయ మూలస్థంభాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఆరాధన అనే సమగ్రమైన పదంలో అల్లాహ్ ఇష్టపడే ప్రతిదీ వస్తుంది. పరిశుద్ధ సంకల్పంతో చేయడం మరియు అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని అనుసరించి చేయడం ద్వారా మన దినచర్యలు కూడా ఆరాధనలుగా పరిగణింపబడే అవకాశం ఉన్నది. ఉదాహరణకు, చిరునవ్వు, ఇరుగు పొరుగు వారితో మంచిగా ప్రవర్తించడం, తన కుటుంబానికి సహాయపడటం, నిజాయితీ గా జీవించడం మరియు రోడ్డుపై నుండి ఆటంకాన్ని తొలగించడం మొదలైనవన్నీ.

ఒకరి ఆరాధనల అవసరం అల్లాహ్ కు లేదు కానీ, అల్లాహ్ యొక్క అవసరం మనకు ఉన్నది, మన ఆరాధనలు మన ప్రయోజనం కొరకే అనే విషయాన్ని మనం గుర్తించాలి.

## చివరి మాట

పైన పేర్కొనబడిన విశ్వాసం యొక్క మూలస్థంభాలు మరియు ఆరాధనలు కలిసి ఇస్లాం ధర్మం యొక్క ముఖ్య సారాంశం అవుతుంది. వాటిని ఆచరణలో పెడితే అది ప్రజలందరి ఆధ్యాత్మిక, శారీరక, మానసిక మరియు సాంఘిక అవసరాలను చక్కగా తీరుస్తాయి. అంతేగాక ఇస్లాం ఒక హేతబద్ధమైన మరియు ఆచరణాత్మకమైన జీవిత విధానం. ఇంకా, ఈ జీవిత విధానాన్ని మాత్రమే సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ సమ్మతిస్తాడు. శాశ్వతంగా స్వర్గానికి చేర్చే ఏకైక మార్గం ఇదే.

“ఏ పురుషుడూ గానీ లేదా స్త్రీ గానీ విశ్వాసులై, సత్కార్యాలు చేస్తే, అలాంటి వారిని మేము తప్పక మంచి జీవితం గడిపేలా చేస్తాము. మరియు వారికి వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమ ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాము.” ఖుర్ఆన్ 16:97

# 4. ఇస్లాం గురించి కొన్ని ప్రశ్నోత్తరాలు

## ➢ ఇస్లాం ధర్మం అంటే ఏమిటి మరియు ముస్లింలు అంటే ఎవరు?

ఇస్లాం ధర్మం ఒక సహజమైన మరియు సంపూర్ణమైన జీవన విధానం. సర్వలోక సృష్టికర్తతో మరియు ఆయన సృష్టితో తమ సంబంధం ఎలా ఉండాలనే ముఖ్యాంశంపై తగిన సావధానత చూపాలని మనల్ని ప్రోత్సహిస్తున్నది. సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ ఆమోదించిన మంచిపనులు చేయడంలోనే ఆత్మలకు నిజమైన సంతోషం మరియు శాంతి లభిస్తుందని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఆ మంచిపనులు స్వంతానికీ మరియు సమాజానికీ ప్రయోజన కరమైనవై ఉంటాయి.

ఇస్లాం ధర్మ సందేశం సార్వజనకమైనది: 'కేవలం ఏకైక నిజ ఆరాధ్యుడిని మాత్రమే విశ్వసించుట మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆయన యొక్క చిట్టచివరి ప్రవక్తగా స్వీకరించుట'. "ఇస్లాం" అనే పదానికి అర్థం ఏకైక నిజ ఆరాధ్యుడికి సమర్పించుకొనుట. జాతి, వర్ణ, కుల మత వర్గాలకు మరియు తెగలకు అతీతంగా అలా సమర్పించుకున్నవారినే ముస్లింలు అంటారు.

## ➢ అసలు జీవిత ఉద్దేశ్యం ఏమిటి?

ఒక గమ్యం లేకుండా తమ ఇష్టానుసారం ఎలా పడితే అలా జీవించేందుకు సృష్టికర్త మానవులను సృష్టించలేదు. ఖచ్చితంగా మన కొరకు ఒక ఉత్తమ లక్ష్యం ఉన్నది. అదేమిటంటే – ఏకైక ఆరాధ్యుడిని గుర్తించుట మరియు కేవలం ఆయనను మాత్రమే ఆరాధించుట. తద్వారా మన సృష్టికర్త మార్గదర్శకత్వంపై జీవించుట. ఈ మార్గదర్శకత్వం అన్నివిధాలా సాఫల్యవంతం మరియు శుభప్రదమైన జీవితాన్ని గడిపేలా మనకు దారి చూపుతుంది. అంతేగాక స్వర్గానికి చేరుస్తుంది మరియు నరకాగ్ని నుండి కాపాడుతుంది. ఇదే

మన కొరకు విశ్వాస పరీక్ష. అంటే మనకు ప్రసాదించబడిన తెలివితేటలు మరియు శక్తియుక్తులను ఉపయోగించి అల్లాహ్ యొక్క సూచనలు మరియు చిహ్నాల గురించి లోతుగా ఆలోచించుట మరియు ఆయనను గుర్తించుట, ఆయన మార్గదర్శకత్వాన్ని అనుసరించి జీవించుట.

మనల్ని పరీక్షించుట కొరకు ఆ ఏకైక ప్రభువు మనకు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించి, ఎవరు మనస్ఫూర్తిగా, తమ ఇష్టానుసారంతో ఆయన మార్గాన్ని అనుసరిస్తారో కనిపెడుతున్నాడు.

## ➢ అల్లాహ్ అంటే ఎవరు ?

ఏకైక నిజ ఆరాధ్యుడి స్వంత పేరే అల్లాహ్. అల్లాహ్ కు భాగస్వాములు లేరు, సాటి లేరు, తల్లిదండ్రులు లేరు. పిల్లలు లేరు. అల్లాహ్ యొక్క దివ్యలక్షణాలన్నీ పరిపూర్ణమైనవి, ఉదాహరణకు సర్వలోకాల సృష్టికర్త, ఏకైకుడ, అత్యంత కరుణామయుడు, అత్యంత శక్తిమంతుడు, అత్యంత న్యాయవంతుడు, అత్యంత వివేకవంతుడు మరియు ప్రతిదీ ఎరిగినవాడు. ఏ మానవుడికీ లేక వస్తువుకూ అల్లాహ్ దైవత్వంలో మరియు దివ్యలక్షణాలలో ఎలాంటి భాగస్వామ్యమూ లేదు. కాబట్టి, ఆరాధింపబడే అర్హతలు, యోగ్యతలు ప్రత్యేకంగా కేవలం ఆయనకు మాత్రమే చెందుతాయి.

## ➢ ముహమ్మద్ అంటే ఎవరు ?

ప్రవక్తల పరంపరలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చిట్టచివరి ప్రవక్త. ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని సకల మానవాళిని ఆహ్వానించుట కొరకు ఆయన పంపబడినారు. ఆయన ఒక అత్యుత్తమ తండ్రి, భర్త, బోధకుడు, నాయకుడు, న్యాయాధిపతి. పూర్తిస్థాయిలో నిజాయితీ, న్యాయం, కరుణ మరియు ధైర్యసాహసాలు కలిగిన ఒక అత్యుత్తమ మానవుడి ఉపమానం. ముస్లింలు ఆయనను ఎంతో గౌరవిస్తారే, ఆయనను ఆరాధించరు. అంతేకాదు, ముస్లింలు ఏ ప్రవక్తనూ ఆరాధించరు, మొరపెట్టుకోరు.

## ➢ ఇస్లాం ధర్మం యొక్క ప్రధాన మూలాధారాలు ఏవి?

ఖుర్ఆన్ - ఇస్లామీయ ధర్మజ్ఞానం మరియు ఇస్లామీయ బోధనా సూత్రాల యొక్క ప్రాథమిక మూలాధారం. సున్నత్ – ఇస్లామీయ ధర్మం యొక్క రెండవ మూలాధారం మరియు స్వంత సహచరుల ఉల్లేఖనల సాక్ష్యాధారాలతో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క వేలాది ఉపదేశాలు మరియు ఆచరణల సంకలనం.

అవన్నీ ఎంతో ప్రామాణికమైనవి కావటం వలన, ముస్లింలకు అవి ఖచ్చితమైన జీవన విధానం మరియు మార్గదర్శకత్వం చూపుతున్నాయి. మొత్తం ఇస్లామీయ బోధనలన్నీ ఈ రెండు మూలాధారాల నుండి తీసుకోబడిన సాక్ష్యాధారాలపైనే అధిక శాతం ఆధారపడి ఉన్నాయి.

## ➢ ఖుర్ఆన్ అంటే ఏమిటి ?

మానవాళి కోసం పంపబడిన అంతిమ దివ్యగ్రంథం ఖుర్ఆన్. అదొక గొప్ప మార్గదర్శక గ్రంథం. మంచి -చెడులను వేరు చేసే గీటురాయి. అల్లాహ్ వాక్కు. దైవదూత జిబ్రయీల్ ద్వారా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేయబడింది. దీని అవతరణతో అంతకు ముందు పంపబడిన తౌరా, గోస్పెల్ మొదలైన దైవవాణులన్నింటినీ రద్దు అయి పోయాయి. మన ఉనికి ఉద్దేశ్యం ఏమిటి, సరైన దైవభావన ఏది, సృష్టికర్త ఇష్టపడే మరియు అయిష్టపడే ఆచరణలు ఏవి, ప్రవక్తల వృత్తాంతాలు మరియు వాటి గుణపాఠాలు, స్వర్గనరకాలు మరియు అంతిమ తీర్పుదినం మొదలైన అనేక ముఖ్యాంశాల గురించి చక్కగా వివరిస్తున్నది మరియు స్పష్టం చేస్తున్నది.

ఖుర్ఆన్ యొక్క ఒక గొప్ప మహిమ ఏమిటంటే, అది అవతరించిన నాటి నుండి అంటే 1400 సంవత్సరాల నుండి ఒక్క అక్షరం మార్పూ లేకుండా భద్రంగా, స్వచ్ఛంగా అవతరించిన అసలు రూపంలో నేటికీ సురక్షితంగా ఉన్నది.

దీనిలో ఆనాటి ప్రజలు ఊహించను కూడా ఊహించలేని అనేక వైజ్ఞానిక మరియు చారిత్రక వాస్తవాలు పేర్కొనబడినాయి. వాటిని ఈమధ్యనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అంతేగాక ఖుర్ఆన్ గ్రంథం అనేక వైజ్ఞానిక మరియు చారిత్రక పరీక్షలలో తన ప్రామాణికతను ఋజువు చేసుకున్నది. తద్వారా అది సర్వలోక సృష్టికర్త పంపిన గ్రంథమని ఋజువు అవుతున్నది.

## ➢ ఇస్లాం ధర్మం యొక్క ప్రధాన ఆచరణలు ఏవి ?

ఇస్లాం ధర్మం యొక్క ప్రధాన ఆచరణలు, ఇస్లాం యొక్క ఐదు మూలస్థంభాలనే పేరుతో పేర్కొనబడినాయి.

**1వ మూలస్థంభం (మూలసిద్ధాంతం):** సాక్ష్యప్రకటన లేక విశ్వాస ప్రకటన - ఒక్క అల్లాహ్ తప్ప, ఆరాధింపబడే అర్హతలు గల మరో దేవుడెవ్వడూ లేడు మరియు ముహమ్మద్ ఆయన యొక్క అంతిమ సందేశహరుడు.

**2వ మూలస్థంభం:** నమాజులు. ప్రతిరోజు ఐదుసార్లు నిర్ణీత సమయాలలో నమాజు చేయవలసి ఉన్నది: ఉషోదయం, మధ్యాహ్నం, సాయంత్రం, సూర్యాస్తమయం తర్వాత మరియు రాత్రి సమయాన.

**3వ మూలస్థంభం:** నిర్ణీత మోతాదుతో దానధర్మం చేయుట. బీదసాదలకు తమ మిగులు సంపదలో నుండి ప్రతి సంవత్సరం దాదాపు 2.5% దానం చేయడం. ప్రాథమిక అవసరాలకు మించి మిగులు సంపద కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఇలా దానం చేయవలసి ఉన్నది.

**4వ మూలస్థంభం:** రమదాన్ నెలలో ఉపవాసం ఉండుట. ఈ నెల మొత్తం ముస్లింలు ఉపవాసం ఉంటారు. ప్రాత:కాలం (వేకువ ఝాము) నుండి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు మరియు దాంపత్య సుఖానికి దూరంగా ఉంటారు. అన్ని రకాల చెడు పనుల నుండి కూడా దూరంగా ఉంటారు.

**5వ మూలస్థంభం:** హజ్ యాత్ర. ఒకవేళ ముస్లిం వ్యక్తి వద్ద తగిన సదుపాయాలు, శారీరక మరియు ఆర్థిక స్తోమత ఉంటే, తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారి సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి వెళ్ళి, హజ్ యాత్ర చేయవలసి ఉన్నది. ఈ పవిత్ర యాత్ర నమాజులు, ప్రార్థనలు, దానధర్మాలు, ప్రయాణం మొదలైన వాటితో పాటు అణుకువ, నమ్రత, విధేయత మరియు అధ్యాత్మిక అనుభవాలతో కూడి, ముస్లిం సమాజంలో ఐకమత్యాన్ని మరియు సోదరభావాన్ని స్థాపిస్తున్నది.

## ➢ జీసస్ మరియు ఇతర ప్రవక్తల గురించి ముస్లింల విశ్వాసం ఏమిటి?

ప్రతి జాతి కొరకు కనీసం ఒకరి చొప్పున, వేల కొలది ప్రవక్తలను అల్లాహ్ ఒకే దివ్యసందేశంతో పంపినాడు: కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించండి మరియు ఆయనకు సాటి కల్పించకండి, భాగస్వాములను కల్పించకండి. వారిలో కొందరు ఆదం, నూహ్, జోసెఫ్, అబ్రహాం, యాకోబు, ఇసాకు, మోసెస్, జీసస్ అలైహిస్సలాం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. అల్లాహ్ పంపిన గొప్ప ప్రవక్తలలో జీసస్ అలైహిస్సలాం ఒకరు. ఆయన జననం ఒక అద్భుతం. కన్య మేరీకు స్త్రీపురుష కలయిక లేకుండానే జన్మించారు మరియు అనేక మహిమలు చేసి చూపారు – ఇదంతా కేవలం అల్లాహ్ అనుజ్ఞ ద్వారానే జరిగింది.

## ➢ కష్టాలు ఎందుకు వస్తాయి ?

అల్లాహ్ ప్రజలను వేర్వేరు విధాలలో రకరకాల ఆపదలకు గురి చేసి, పరీక్షిస్తాడు. వాటిలో కొన్ని ఆరోగ్యం, కుటుంబం, ప్రకృతి వైపరీత్యాలు, సంపద లేక ఇతర పద్ధతులు. ఆపద సమయాలలో సహనం, ఓర్పుతో వహించడం మరియు సుఖసంతోషాల సమయాలలో అల్లాహ్ కు కృతజ్ఞత చూపడం ద్వారా మనం అల్లాహ్ కు దగ్గర కాగలం మరియు శాశ్వత స్వర్గంలో స్థానం

సంపాదించగలం. ఆఫ్ కోర్స్, ఈ ప్రాపంచిక జీవితంలోని కష్టనష్టాలు, బాధలు తాత్కాలికమైనవే. స్వర్గ జీవితం మాత్రం శాశ్వతమైనది.

## ➢ మరణానంతరం ఏమి జరుగుతుంది ?

చావు అనేది ఈ ఇహలోకపు తాత్కాలిక జీవితం నుండి పరలోకపు శాశ్వత జీవితానికి చేర్చే వారధి. ఇహలోకంలో తాము చేసిన పాపపుణ్యాలకు బాధ్యత వహించడం కోసం అంతిమ తీర్పుదినం నాడు ప్రతి వ్యక్తీ మరలా లేపబడతాడు. ఆ మహా తీర్పుదినం నాడు ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. ఇహలోకంలో ఎవరైనా దౌర్జన్యానికి గురైతే, అక్కడ అతనికి పరిహారం లభిస్తుంది మరియు అల్లాహ్ అతనికి సరైన న్యాయం చేస్తాడు. ఆయన అన్నీ ఎరిగినవాడు మరియు అత్యంత న్యాయవంతుడు. ఒకవేళ ఎవరైనా ఇహలోకంలో అల్లాహ్ ను మాత్రమే ఆరాధిస్తూ, ఆయనకు విధేయత చూపుతూ మంచి, గౌరవప్రదమైన జీవితం గడిపితే, అల్లాహ్ అనుగ్రహం ద్వారా అలాంటి వారికి స్వర్గ ప్రవేశం ప్రసాదించబడుతుంది. ఒకవేళ ఎవరైనా అల్లాహ్ కు అవిధేయత చూపుతూ జీవిస్తే, అలాంటి వారి కోసం నరకం ఎదురు చూస్తున్నది.

ఒకవేళ మంచి పనులకు ప్రతిఫలం ప్రసాదించబడే మరియు చెడు పనులకు కఠిన శిక్షలు వేయబడే పరలోక జీవితమే లేకపోతే, అది సృష్టికర్త యొక్క సంపూర్ణ న్యాయానికి విరుద్ధం అవుతుంది మరియు జీవితంలో న్యాయవంతం కాజాలదు.

## ➢ ఇస్లాం ధర్మం ప్రకారం నీచాతి నీచమైన పాపం ఏది?

సర్వలోక సృష్టికర్తకు సాటి కల్పించడం లేదా ఆయనకు ఇతరులను భాగస్వాములు కల్పించడం అనేది ఇస్లాం ధర్మంలో నీచాతి నీచమైన పాపం. ఇందులో సృష్టికర్త యొక్క కొన్ని దివ్యలక్షణాలను ఇతర సృష్టితాలకు కట్టబెట్టడం, దేవుడికి కుమారుడు, తల్లి లేదా ఇతర బంధువులు ఉన్నారని

వాదించడం, ఆయనకు అవిధేయత చూపడం మరియు తిరస్కరించడం మొదలైనవి కూడా ఉన్నాయి.

## ➢ మహిళల గురించి ఇస్లాం ధర్మం ఏమంటున్నది ?

ఇస్లాం ధర్మంలో, ప్రతిఫలం పొందడంలో మరియు తమ ఆచరణలకు బాధ్యత వహించడంలో అల్లాహ్ ముందు స్త్రీపురుషులు ఉభయుల మధ్య ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా సరిసమానంగా చూడబడతారు. ఉభయులను సృష్టించింది అల్లాహ్ యే. ఆయనే వారిరువురిలో ప్రతి ఒక్కరికీ వారి శారీరక, మానసిక పరిస్థితులను అనుసరించి వేర్వేరు పాత్రలు మరియు బాధ్యతలు అప్పజెప్పినాడు. పురుషులు ఎలాంటి దౌర్జన్యం చేయకూడదని, హింసించరాదని ఆజ్ఞాపించి, స్త్రీలకు ఎంతో ఉన్నత గౌరవాభిమానాల స్థానాన్ని ప్రసాదించినాడు.

## ➢ ఇస్లాం ధర్మంలో ఆదిపాపమనే భావన ఉన్నదా?

"ఆదిపాపం" భావన ఇస్లాం ధర్మంలో అస్సలు లేదు. సృష్టికర్త అత్యంత న్యాయవంతుడు. కాబట్టి స్వయంగా చేయని పాపానికి ఏ ఒక్కరినీ ఆయన బాధ్యుడిగా చేయడు. అంటే ఎవరు చేసిన పాపకార్యాలకు వారు మాత్రమే బాధ్యులు గానీ మరొకరు కాదు.

## ➢ జిహాద్ అంటే ఏమిటి ?

జిహాద్ అంటే సమస్త లోకాల ప్రభువు అయిన అల్లాహ్ సంతుష్టపడే విధంగా ఆయన సత్యధర్మం కోసం ప్రయాస పడటం, శ్రమించడం మరియు త్యాగం చేయడం. భాషాపరంగా, జిహాద్ అంటే "ప్రయాస పడటం, శ్రమించడం, సన్మార్గంలో పోరాడటం". అంటే మంచి పనులు, దానధర్మాలు చేయడంలో ప్రయాస పడటం మరియు ఇస్లామీయ సైనికచర్యలలో పాలుపంచుకోవడం. మిలటరీ జిహాద్ అనేది సర్వసామాన్యంగా అందరికీ తెలిసిన జిహాద్ రూపం. వాస్తవానికి మిలటరీ జిహాద్ అంటే సమాజంలో హద్దుమీరి పోయిన అధర్మాన్ని

నిర్మూలించేందుకు, సామాజిక భద్రత కొరకు, దౌర్జన్యం హద్దులు దాటకుండా అడ్డుకట్ట వేసేందుకు మరియు న్యాయ స్థాపనకు అధర్మంపై, అరాచకంపై సర్వలోక సృష్టికర్త అనుమతించిన ధర్మయుద్ధం. అయితే చాలా మంది ముస్లిమేతరులు ఈ పదాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అలాగే కొందరు అజ్ఞాన ముస్లింలు కూడా దీని అసలు అర్థానికి భిన్నంగా ప్రవర్తిస్తూ, అమాయకులపై దాడి చేస్తున్నారు. అలాంటి చర్యలను ఇస్లాం ధర్మం తీవ్రంగా ఖండిస్తున్నది. ఖుర్ఆన్ లోని సూరా అల్ మాయిదహ్ లో "ఎవరైనా ఒక్క అమాయకుడిని చంపితే, అతను మొత్తం మానవాళిని చంపినట్లే" అని స్పష్టంగా ప్రకటించబడింది.

## ➢ టెర్రరిజాన్ని ఇస్లాం ధర్మం ఖండిస్తుందా?

యుద్ధంలో అమాయక సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఒక గర్హణీయమైన మరియు నీచమైన చర్య. దీనిని ఇస్లాం ధర్మం తీవ్రంగా నిషేధిస్తున్నది. అమాయక మానవుల సంగతి తర్వాత గానీ అసలు శత్రుభూభాగంలోని మొక్కలు, పశుపక్ష్యాదులను సైతం అనవసరంగా చంపకూడదని ముస్లింలను శాసిస్తున్నది. యుద్ధరంగంలో పాటించ వలసిన ఇస్లామీయ నైతిక విలువలకు ఇదొక మచ్చుతునక. అయితే ఇక్కడ టెర్రరిజానికీ మరియు దురాక్రమణ, దౌర్జన్యాన్ని ప్రతిఘటించే పోరాటానికీ మధ్య ఉన్న భేదాన్ని మనం గుర్తించాలి. ఇవి రెండూ పూర్తిగా రెండు భిన్న ధృవాలు.

## ➢ మతాలన్నీ సమానమేనా?

మంచి నడవడిక మరియు ఇతరులపై దయ చూపడం మొదలైన విషయాలలో దాదాపు అన్ని ముఖ్య మతాల బోధనలు ఒకేలా ఉన్నా, సర్వలోక సృష్టికర్త యొక్క ఏకత్వం మరియు పరిపూర్ణత్వం విషయంలో ఏ మాత్రం రాజీ పడకూడదనే ముఖ్యాంశంపై ఇస్లాం ధర్మం అదనంగా దృష్టి కేంద్రీకరిస్తున్నది. ఇతర ధర్మాల వలే కాకుండా, సృష్టితో పోల్చలేని సృష్టికర్త భావన పూర్తిగా

విభిన్నమైనది మరియు అద్వితీయమైనదని, సకల ప్రశంసలు మరియు ఆరాధనలు తిన్నగా కేవలం ఆయనకు మాత్రమే చెందుతాయని ఇస్లాం ధర్మం ప్రాథమికంగా బోధిస్తున్నది. ఇస్లాం ధర్మం సమగ్రమైనది, సంపూర్ణమైనది, చాలా సింపుల్ గా ఉన్నా అత్యంత గాఢమైనది. అవతరించిన నాటి నుండి ఒక్క అక్షరం మార్పు లేకుండా సురక్షింతగా కాపాడబడిన దివ్యగ్రంథం కలిగి ఉన్నది. ఏ దైవప్రవక్తనూ నిరాకరించదు. వారందరూ ఒకే సందేశాన్ని తీసుకు వచ్చారని ప్రకటిస్తున్నది.

## ➢ హలాల్ ఆహారం అంటే ఏమిటి ?

హలాల్ లేదా అనుమతించబడిన ఆహారం అంటే ముస్లింల కొరకు అల్లాహ్ అనుమతించిన ఆహార పదార్థాలు. ఇస్లాం ధర్మం సాధారణంగా, పంది మరియు మద్యం తప్ప దాదాపు అన్ని రకాల ఆహారపానీయాలను హలాల్ గానే పరిగణిస్తుంది. మాంసాన్నిచ్చే కోడి, గొర్రె, మేక, ఆవు, ఒంటె మొదలైన వాటిని జిబహ్ చేసేటప్పుడు, మానవత్వంతో వ్యవహరించాలి మరియు సరైన పద్ధతిని అనుసరించాలి. అలాగే అల్లాహ్ పేరు మీదనే ఖుర్బానీ చేయాలి మరియు ఖుర్బానీ పశువు బాధను తగ్గించేందుకు వీలయినంత ఎక్కువగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## ➢ ఎవరు ముస్లింగా మారవచ్చు ?

ముస్లింగా మారడమంటే సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క ఘనతను గుర్తించడం, ఆయనకు విధేయత చూపడం ద్వారా ఆయనతో దగ్గరి సంబంధాన్ని పెంపొందించుకోవడం మరియు కొనసాగించడం. ఇది ఇహపర లోకాల జీవితంలో సుఖసంతోషాలకు మరియు సంతుష్టానికి దారి చూపుతుంది.

అల్లాహ్ ప్రజల భూత, వర్తమాన పరిస్థితులకు సంబంధం లేకుండా మొత్తం మానవజాతి కొరకు ఇస్లాం ద్వారాలను తెరిచి ఉంచినాడు. కాబట్టి,

సింపుల్ గా ఇస్లాం ధర్మాన్ని విశ్వసించడం మరియు ఈ క్రింది విశ్వాస సాక్ష్యప్రకటనను ఉచ్ఛరించడం ద్వారాఎవరైనా ఎప్పుడైనా ముస్లింగా మారవచ్చు:

**‘అష్ హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్ హదు అన్న ముహమ్మద్ రసూలుల్లాహ్** (నేను సాక్ష్యమిస్తున్నాను అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడనీ మరియు నేను సాక్ష్యమిస్తున్నాను ముహమ్మద్ అల్లాహ్ యొక్క ప్రవక్త అనీ)’.

ముస్లింగా మారిన తర్వాత, అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని పూర్తిగా అనుసరిస్తూ, అల్లాహ్ పై భయభక్తులు చూపుతూ ఉద్దేశ్యపూర్వకమైన మరియు సంపూర్ణమైన జీవితాన్ని గడపాలి మరియు ఆ దైవభక్తి ఆధారంగా పరలోకంలో అల్లాహ్ మీకు స్వర్గంలో మంచి స్థానం ప్రసాదించే అవకాశం ఉన్నది.

# 5. నాస్తికత్వం: ఇస్లాం దృష్టిలో

"ఇదే సత్యమని స్పష్టమయ్యే వరకు, మేము వారికి మా సంకేతాలను వారి చుట్టూ ఉన్న ఖగోళంలోమరియు స్వయంగా వారిలోనూ చూపుతాము." ఖుర్ఆన్ 41:53

ఇస్లామీయ దృష్టిలో ఎందుకు సర్వలోక సృష్టికర్త, ప్రభువు అయిన అల్లాహ్ ను విశ్వసించాలనే ముఖ్యాంశాన్ని ఈ కరపత్రం చర్చిస్తున్నది. తన ఉనికిని నిరూపించే చిహ్నాలను ఆయన ఎలా మనకు అందుబాటులో ఉంచినాడో వివరిస్తున్నది – తన సహజ సృష్టిలోని చిహ్నాలు మరియు తన దైవవాణి లోని చిహ్నాలు. ఇంకా నాస్తికులు తరుచుగా అడిగే సాధారణ ప్రశ్నలకు జవాబిస్తున్నది.

తన అద్భుత చిహ్నాల ద్వారా తనను గుర్తించమని సృష్టికర్త మనల్ని ఆహ్వానిస్తున్నాడు. అలా తన ఉనికిని కనుగొనేందుకు ఆ యా చిహ్నాలపై దృష్టి సారించే మరియు నిశితంగా పరిశీలించే బాధ్యతను ఆయన మనపైనే ఉంచినాడు. కొందరు ప్రజలు వాటిని సులభంగా గ్రహిస్తారు మరియు తమ చుట్టుప్రక్కల ఉన్న ఆ అద్భుత చిహ్నాలన్నింటిలో ఆయన ఉనికిని గుర్తిస్తారు. మరికొందరు వాటిని ఏదో యాధృచ్ఛికంగా జరిగిన సంఘటనలని మరియు అర్థం పర్థం లేనివని తేలిగ్గా కొట్టిపారేస్తారు. విశ్వాసం వైపు మరలే భావాన్ని అల్లాహ్ ప్రతి వ్యక్తిలో అంతర్లీనంగా పుట్టుకతోనే ఉంచినాడు. అయితే కొందరు దానిని అనుసరించి ముస్లింలుగా జీవిస్తారు మరికొందరు దానిని అణచివేసి, అవిశ్వాసంలో తమ జీవితాన్ని కొనసాగిస్తారు.

ముఖ్యంగా, ఎవరైతే నిష్కపటంగా ఉంటారో మరియు తన మార్గదర్శకత్వాన్ని అనుసరించేందుకు సిద్ధమవుతారో, అలాంటి వారికి అల్లాహ్ ఇస్లాం మార్గాన్ని చూపుతాడు. మరోమాటలో చెప్పాలంటే, ఎవరైతే అల్లాహ్ పై విశ్వాసం చూపటానికి తయారుగా ఉండరో, అలాంటి వారికి అల్లాహ్

మార్గదర్శతక్వం వహించడు. ఖుర్ఆన్ లోని అల్లాహ్ వచనాలు, "తన వైపు మరలే వారికి మాత్రమే అల్లాహ్ మార్గదర్శకత్వం వహిస్తాడు." ఖుర్ఆన్ 13:27

దీని కోసం సదుద్దేశపూర్వకమైన మరియు నిష్పాక్షికమైన దృక్పథం అవసరం. ఇది కొందరిని ప్రతిఘటించేలా చేస్తున్నది మరియు మరికొందరిని అణుకువతో, నమ్రతతో విధేయులుగా చేస్తున్నది. కానీ, అతడి అసలైన నిష్కాపట్యత మరియు సంసిద్ధత లేకుండే ఎంత మంచి సందేశమైనా అతడిని విశ్వాసిగా మార్చలేదు. వాస్తవానికి, అహంకారంతో మరియు గర్వంతో అల్లాహ్ యొక్క చిహ్నాలపై దృష్టి సారిస్తారో, అలాంటి వారు తమ అవిశ్వాసాన్ని సమర్ధించుకునే సాకులు మాత్రమే కనుగొంటారని అల్లాహ్ హెచ్చరించాడు.

కాబట్టి, ఎవరైతే నిష్కపటంగా, నిష్పక్షపాతంగా మరియు నిజంగా సత్యాన్వేషణ చేస్తారో, వారు దీని నుండి లాభం పొందుతారు మరియు సృష్టికర్త గురించి అతడు సరిగ్గా అర్థం చేసుకునేలా ఈ సరికొత్త దృక్పథం సహాయ పడుతుంది.

ఇస్లాం మరియు క్రైస్తవ ధర్మాల మధ్య కొన్ని స్పష్టమైన విభేదాలు ఉన్నాయి. కాబట్టి, క్రైస్తవ మతం పై ప్రచారంలో ఉన్న అనేక విమర్శలను సింపుల్ గా ఇస్లాంపై అప్లయి చేయవద్దు.

## ఎందుకు విశ్వాసించాలి ?

సృష్టికర్తను ఎందుకు విశ్వసించాలి అనే ప్రశ్నకు క్రింద మూడు హేతుబద్ధమైన కారణాలు పేర్కొనబడినాయి.

### 1. విశ్వం యొక్క ఆరంభం

సృష్టికర్త ఉనికిని స్పష్టంగా తెలిపే సృష్టి ఆరంభం గురించి అర్థం చేసుకోవడంపై దృష్టి సారించడం వైపు మొదటి సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది.

ఉదాహరణకు ఎడారిలో నడుస్తుండగా, ఒక చేతి గడియారం అక్కడ పడి ఉండటాన్ని మీరు గుర్తించారని భావించుదాం. చేతి గడియారంలో గాజు కవరు, ప్లాస్టిక్ మరియు ఇనుము ఉంటాయనేది మనకు తెలుసు. సన్నటి ఇసుక నుండి గాజు తయారు అవుతుంది, ఆయిల్ నుండి ప్లాస్టిక్ తయారవుతుంది మరియు భూమి నుండి ఇనుము సంగ్రహించబడుతుంది – ఈ భాగాలన్నీ ఎడారిలో లభిస్తాయి. మరి, అలాంటప్పుడు, గడియారం తనకు తానుగా తయారై పోతుందా? సూర్యుడు ప్రకాశించుట, గాలి వీచుట, పిడుగులు పడుట, ఆయిల్ భూమి ఉపరితలం పైకి వచ్చి, సన్నటి ఇసుక మరియు ఇనుముతో కలిసి అనేక మిలియన్ల సంవత్సరాల వరకు ఉండిపోగా, యాధృచ్ఛికంగా లేక సహజసిద్ధంగా అది గడియారంలా తయారు కావడమనేది సంభవమేనా ?

"వారు శూన్యం నుండి సృష్టించబడినారా లేక స్వయంగా తమను తాము సృష్టించుకున్నారా?" ఖుర్ఆన్ 52:35-6

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఈ విశ్వం పరిమితమైనది మరియు దానికి ఒక ఆరంభం ఉన్నది. అసలు ఈ విశ్వం ఎక్కడి నుండి వచ్చింది? మానవజాతి అనుభవం మరియు సింపుల్ లాజిక్ మనకు చెబుతున్నదేమిటంటే ఆరంభం ఉన్నదేదైనా సరే, అది శూన్యం నుండి సృష్టించబడదు. అంతేగాక, ఏదీ తనను తానుగా సృష్టించుకోజాలదు. కాబట్టి, అత్యంత హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, మహోన్నతుడైన ఒక సృష్టికర్త ఈ విశ్వాన్ని సృష్టించాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు మరియు వివేకవంతుడూను. ఎందుకంటే ఆయన మొత్తం విశ్వాన్ని ఏ చిన్న లోపమూ లేకుండా చాలా అద్భుతంగా సృష్టించాడు మరియు విశ్వం అనుసరించవలసిన వైజ్ఞానిక చట్టాల్ని కూడా. ఆ సృష్టికర్త కాలాతీతుడు మరియు స్థలాతీతుడు. ఎందుకంటే, కాలం, స్థలం మరియు పదార్థం అనేవి విశ్వ సృష్టి సమయంలో సృష్టిచబడినాయి. సృష్టికర్త ఈ సృష్టి లక్షణాలకు అతీతుడు. అవి సర్వలోక

సృష్టికర్త యొక్క ప్రాథమిక దైవభావన ఔన్నత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ విశ్వం పరిమితమైనది మరియు దానికొక ఆరంభం ఉన్నదని తెలిపే నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో ఇది పూర్తిగా ఏకీభవిస్తున్నది. ఈ లక్షణాలన్నీ సర్వలోక సృష్టికర్త యొక్క ప్రాథమిక దైవభావన అవగాహనను తెలుపుతున్నాయి.

కొందరు ఇలా ప్రశ్నించవచ్చు, "అల్లాహ్ ను ఎవరు సృష్టించారు?" సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్, తన సృష్టి కంటే భిన్నమైన వాడు. సృష్టిని సృష్టికర్తతో అస్సలు పోల్చలేము. ఆయన నిత్యుడు, ఆద్యంత రహితుడు. ఆయనకు ఆరంభం లేదు – అంతమూ లేదు. ఎల్లప్పుడూ ఉంటాడు. కాబట్టి, అల్లాహ్ ను సృష్టించింది ఎవరు అనేది ఒక అవివేకమైన, అసంబద్ధమైన మరియు బుద్ధిహీనమైన ప్రశ్న తప్ప మరేమీ కాదు.

## 2. విశ్వం యొక్క పరిపూర్ణత

ఎంతో వివేకవంతుడైన సృష్టికర్త ఉనికిని చాటే మన క్లిష్టతరమైన విశ్వం యొక్క పరిపూర్ణ సంతులనం మరియు క్రమం పై దృష్టి సారించడం వైపు రెండో సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది. ఇంత బ్రహ్మాండమైన, క్లిష్టతరమైన ఈ విశాల విశ్వం యాధృచ్ఛికంగా, ఎలాంటి పర్యవేక్షణ లేకుండా తనకు తానుగా ఏర్పడిందా ?

సూర్యుడికి నిర్ణీత దూరంలో ఉంచబడిన భూమండం, భూమి పై పొర మందం, భూమి తన చుట్టూ తాను పరిభ్రమించే వేగం, వాతావరణంలోని ఆక్సిజన్ శాతం, భూమి ఒక నిర్ణీత కోణంలో ఒరిగి ఉండటం మొదలైన విశ్వంలోని అనేక ప్రత్యేకతలు సమస్త జీవరాశుల మనుగడకు అనుకూలంగా ఈ విశ్వం మొత్తం ఒక అద్భుత పథకం ద్వారా డిజైన్ చేయబడిందని స్పష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణీత కొలతలలో ఏ మాత్రం హెచ్చుతగ్గులున్నా, భూమండలంపై జీవరాశుల ఉనికి కనబడేది కాదు.

ఖచ్చితమైన సమయాన్ని చూపేలా గడియారాన్ని తయారు చేసే ఒక వివేకవంతుడైన తయారీదారుడు ఉన్నట్లే, ఖచ్చితంగా నిర్ణీత సమయం ప్రకారం సూర్యుడి చుట్టూ తిరిగే నియంత్రణతో, భూమిని తయారు చేసిన మహావివేకవంతుడైన ఒక తయారీదారుడూ తప్పక ఉన్నాడు. దీనికి భిన్నంగా ఈ భూమి తనకు తానుగా ఉనికిలోనికి రావడమనేది సంభవమేనా?

విశ్వం పాటిస్తున్న క్రమశిక్షణ, ఖచ్చితమైన విశ్వచట్టాలు, మనలోని మరియు మొత్తం విశ్వంలోని వ్యవస్థ మొదలైన వాటిని నిశితంగా పరిశీలించి, దానికి ఒక అద్భుత ఆర్గనైజర్ అంటే నిర్వహణకర్త తప్పకుండా ఉంటాడని భావించడం వివేకవంతంగా లేదా ? ఇలాంటి లోపరహితమైన సృష్టి క్రమశిక్షణను రూపొందించి, నియంత్రిస్తున్న సర్వలోక సృష్టికర్త ఉనికిని ఈ 'నిర్వహణకర్త' పాత్ర స్పష్టంగా ఋజువు చేస్తున్నది.

శాస్త్రీయ పరిశోధన మరియు పర్యాలోచనలను ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తుందనే వాస్తవాన్ని ఇక్కడ మనం తప్పకుండా జ్ఞాపకం చేసుకోవాలి. తన సృష్టిలో సృష్టికర్త సృష్టించిన అనేక అద్భుత విషయాలను అర్థం చేసుకునేందుకు, ఆయన అసమాన శక్తిసామర్థ్యాలను మరియు వివేకాన్ని మెచ్చుకునేందుకు విజ్ఞానశాస్త్రం ఎంతో తోడ్పడుతుంది. విజ్ఞానశాస్త్రం కొత్త విషయాలు కనిపెడుతూ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ఇతర ప్రక్రియల వలే సహజ ప్రపంచంలోని వాటర్ సైకిల్ లేక గ్రావిటీ వంటి విషయాలు సృష్టికర్త మరియు అద్భుత నిర్వాహణకర్త యొక్క చిహ్నాలని మనం గుర్తిస్తున్నాము. అంటే అవి సృష్టికర్త ఉనికిని బలపరుస్తున్నాయే గానీ ఆయన ఉనికిని ఖండించడం లేదు.

## 3. అల్లాహ్ తరుఫు నుండి పంపబడే దివ్యసందేశం (వహీ)

తన ఉనికిని సూచించే నిదర్శనంగా మానవజాతి వద్దకు అల్లాహ్ పంపిన అసలు దివ్యసందేశంపై దృష్టి సారించడం వైపు మూడో సాక్ష్యాధారం మార్గదర్శకత్వం వహిస్తున్నది.

ఇస్లాం ధర్మం యొక్క మూలగ్రంథమైన ఖుర్ఆన్ యొక్క ఒక ముఖ్యోద్దేశం – ప్రజలను సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క సృష్టిపై దృష్టి సారించడం మరియు ఆయనను విశ్వసించడంలో భాగంగా దానిని ప్రశంసించడం. విశ్వంలోని మరియు మనలోని అపూర్వ డిజైన్ ను మరియు సంక్లిష్టతలను సావధానంగా పరిశీంచమనీ మొత్తం ఖుర్ఆన్ లో అనేకచోట్ల సృష్టికర్త ఆహ్వానిస్తున్నాడు. మంచి డిజైన్, ఉద్దేశం మరియు వివేకంతో తయారు చేయబడిన ఉత్పత్తి అనే విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఆ నిశిత పరిశీలన చాలు. ఉదాహరణకు, ఖుర్ఆన్ లోని వచనం:

"నిశ్చయంగా, భూమ్యాకాశాల సృష్టిలోనూ, రేయింబవళ్ళ మార్పులోనూ, ప్రజలకు ఉపయోగకరమైన వాటిని మోస్తూ సముద్రంలో పయనించే ఓడలలోనూ మరియు అల్లాహ్ ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి దాని ద్వారా నిర్జీవమైన భూమికి ప్రాణం పోసి అందులో వివిధ రకాల జీవరాశులు వర్ధిల్లేలా జేయటంలోనూ, గాలులు మరియు మేఘాలు భూమ్యాకాశాల మధ్య నియమబద్ధంగా చేసే సంచారాల మార్పులలోనూ బుద్ధిమంతులకు ఎన్నో సంకేతాలున్నాయి". ఖుర్ఆన్ 2:164

ఇస్లాం మూలాధారమైన దివ్య ఖుర్ఆన్ గ్రంథం, అల్లాహ్ యొక్క దివ్యవచనమని నిరూపించే అనేక స్పష్టమైన సూచనలు ఖుర్ఆన్ లో ఉన్నాయి. ఈ వాదనను బలపరిచే కొన్ని సాక్ష్యాధారాలు క్లుప్తంగా ఇక్కడ ప్రస్తావించబడినాయి. ఖుర్ఆన్ :

1. లోపాలకు, పొరపాట్లకు, పరస్పర విరుద్ధ వాదనలకు అతీతం.
2. ప్రజలపై లోతైన ప్రభావం చూపుతుంది మరియు వారిలోని అసలు చైతన్యాన్ని మేల్కొపుతుంది.
3. తరతరాలుగా లక్షల కొద్దీ ప్రజలు దానిని పూర్తిగా కంఠస్థం చేస్తున్నారు.

- ఖుర్ఆన్ అవతరించి 1400 సంవత్సరాలు దాటిపోయాయి. ఆ కాలంలోని ప్రజలకు అస్సలు తెలియని మరియు ఈ మధ్యనే సైన్సు ద్వారా కనిపెట్టబడిన అనేక వైజ్ఞానిక అంశాలు ఇందులో పేర్కొనబడినాయి. ఉదాహరణకు: జీవరాశులన్నింటి మూలం నీరు (ఖుర్ఆన్ 21:30); వ్యాపిస్తున్న విశ్వం (ఖుర్ఆన్ 51:47); సూర్యుడు మరియు చంద్రుడి స్వంత కక్ష్యలు (ఖుర్ఆన్ 21:33).
- ఖుర్ఆన్ లో అనేక చారిత్రక వాస్తవ సంఘటనలు పేర్కొనబడినాయి. ఆనాటి కాలంలోని ప్రజలకు వాటి గురించి తెలియదు. అంతేగాక అనేక భవిష్యవాణులు కూడా ప్రస్తావించబడినాయి. వాటిలో కొన్ని నిజంగా జరిగిపోయాయి, మరికొన్ని జరగబోతున్నాయి.
- వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, క్రమక్రమంగా 23 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో అవతరించినా, ఎలాంటి లోపాలు మరియు పరస్పర విరుద్ధ వచనాలు లేకుండా ఖుర్ఆన్ దోషరహితంగా ఉన్నది.
- కాలక్రమంలో కనుమరుగు అయి పోయిన ఇతర ధర్మాల అసలు మూలగ్రంథాలకు భిన్నంగా, అవతరించిన అరబీ భాషలో అసలు ఖుర్ఆన్ లోని ప్రతి అక్షరం సురక్షితంగా భద్రపరచబడింది.
- ఖుర్ఆన్ లో మానవుడి వివేకాన్ని మరియు స్వాభావిక అంతర్గత దైవవిశ్వాసాన్ని మేలుకొల్పే సరళమైన మరియు స్వచ్ఛమైన సార్వజనిక దివ్యసందేశం ఉన్నది.
- ఖుర్ఆన్ గ్రంథం అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించింది. ఆయన నిరక్షరాస్యులైనా, దాని భాష అత్యుత్తమమైన వాగ్ధాటి, వక్తృత్వం మరియు భాషాపరమైన సాహిత్య సౌందర్యాలతో అరబీ భాషలో సాటిలేని తనదైన ప్రత్యేక శైలి కలిగి ఉన్నట్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడినది.

ఖుర్ఆన్ యొక్క అనేక అపూర్వ మరియు అద్భుత అంశాలలో అత్యంత హేతువాద విషయం ఏమిటంటే అది మనందరి సృష్టికర్త అయిన అల్లాహ్ నుండి తిన్నగా పంపబడింది.

## సృష్టికర్తకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు

### "సృష్టికర్త మనల్ని ఎందుకు సృష్టించాడు ?"

మన అవయవాలైన కళ్ళు, చెవులు, మెదడు మరియు గుండె మొదలైన వాటన్నింటికీ ఒక్కో ఉద్దేశ్యం ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మరి అలాంటప్పుడు మొత్తం అవయవాలతో కూడిన మన శరీరానికీ ఏదైనా ఉద్దేశ్యం, ప్రయోజనం ఉందా ? అత్యంత వివేకవంతుడైన అల్లాహ్ మనల్ని ఎలాంటి లక్ష్యం లేకుండా అటూ ఇటూ తిరగటానికి లేదా మన సహజ అవసరాలు మరియు చిన్న చిన్న కోరికలు తీర్చుకోవటానికి సృష్టించలేదు. ఈ ప్రాపంచిక జీవితం ఒక పరీక్ష అని సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ స్పష్టంగా తెలిపినాడు. ఎవరు సృష్టికర్తను గుర్తించి, ఆయనకు విధేయతాపూర్వకంగా సమర్పించుకుని, ఆయన మార్గదర్శకత్వాన్నే అనుసరించడాన్ని ఎంచుకుంటారో బహిర్గతమయ్యేలా ప్రతి వ్యక్తీ ఇక్కడ పరీక్షించబడతాడు. ఖుర్ఆన్ లోని అల్లాహ్ వచనాలు:

నిశ్చయంగా మేము మానవుణ్ణి ఒక మిశ్రమ వీర్య బిందువుతో సృష్టించాము. అతనిని పరీక్షించటానికి అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము. నిశ్చయంగా మేము అతనికి మార్గం చూపాము. ఇక అతను కృతజ్ఞుడు కావచ్చు లేదా కృతఘ్నుడు కావచ్చు. **ఖుర్ఆన్ 76:2-3**

చాలామంది అసలు ఇబ్బంది ఏమిటంటే, సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ ను విశ్వసించడంలో వాస్తవానికి వారికే సమస్యా లేదు కానీ, దానిని ఆచరణలో పెట్టడంలో వెనకాడుతున్నారు. అంటే 'చేసే ప్రతి పనికీ స్వయంగా బాధ్యత వహించవలసి ఉన్నది, జవాబు ఇవ్వవలసి ఉన్నది' అనే కఠోర సత్యం

తమ కోరికలను అనుసరించి విచ్చలవిడి జీవితం గడపకుండా నివారిస్తున్నది. కాబట్టి, అల్లాహ్ కు విధేయత చూపుతూ, ఆయన ఇష్టానుసారం అణుకువతో జీవించాలే గానీ మన స్వంత కోరికలు, అహంకారం, గర్వం మొదలైన వాటితో కాదనేది ఈ ప్రాపంచిక జీవిత పరీక్షలోని ముఖ్యాంశం.

**"దేవుడికి మనల్ని పరీక్షించవలసిన ఆవశ్యకత ఏముంది?"**

సృష్టికర్త ఏ అక్కరా లేనివాడు – తన అవసరాల కోసం దేనినైనా సృష్టించే ఆవశ్యకత ఆయనకు లేదు మరియు ఎవరినీ పరీక్షించవలసిన అవసరం ఆయనకు లేదు. మనం ఆయనను విశ్వసిస్తే ఆయనకేమీ ప్రయోజనం కలుగదు మరియు మనం విశ్వసించక పోవటం వలన ఆయనకేమీ నష్టం జరుగదు. అంటే మన విశ్వాసావిశ్వాసాలు ఆయనపై ఎలాంటి ప్రభావం చూపవు. అయితే, తన అపరిమితమైన వివేకంలోని చిన్న భాగంగా ఆయన ఈ సర్వలోకాలను సృష్టించాడు మరియు ఆయనను గుర్తించే అవకాశాన్ని ప్రసాదించినాడు. నిశ్చయంగా ఆయనకు భవిష్యత్తులో జరగబోయే ప్రతిదీ తెలుసు – అసలు విషయం ఏమిటంటే, ఈ ప్రాపంచిక జీవితాన్ని గడపడంలో, జీవితాన్ని అనుభవించటంలో మన స్వంత ఇష్టాన్ని అనుసరిస్తూ సరైన మార్గాన్ని ఎంచుకోవాలని.

**"మన కోసం అసలు ఛాయిస్ అంటూ ఉందా?"**

సృష్టికర్తకు మన ఛాయిస్ తెలుసు అనే వాస్తవం మన స్వేచ్ఛను ఏమాత్రం తగ్గించదు. ప్రజలను తనను విశ్వసించాలని సృష్టికర్త కోరుకుంటున్నా, ఆయన ఎవరినీ బలవంతం చేయడు. సృష్టంతటిపై తిరుగులేని ఆధిపత్యం కలిగి ఉండటం వలన ఒకవేళ ఆయన తలుచుకుంటే, మొత్తం మానవజాతిని సన్మార్గంపై నడిపించేవాడు. కానీ, తన అద్భుత వివేకానికి నిదర్శనంగా మనల్ని మంచి చెడులలో ఒక దారిని స్వయంగా ఎంచుకునే సమర్ధతతో సృష్టించి, అలా మనం ఎంచుకున్న ఛాయిస్ కు మనల్నే బాధ్యులుగా చేసినాడు. సృష్టిలో

సంభవించేందుకు తను అనుమతించిన ఘటనలన్నింటికీ ఆయన సంతోష పడవలసిన అవసరం లేదు.

### “ఎందుకు సృష్టికర్త స్వయంగా పరిచయం చేసుకుంటున్నాడు?”

సృష్టికర్త యొక్క అపరిమితమైన వివేకానికి ఒక సూచనగా, తన అద్భుత చిహ్నాల ద్వారా తన ఉనికిని ప్రజలకు తెలియజేయాలనే మార్గాన్ని ఆయన స్వయంగా ఎంచుకున్నాడు. ఇది ఈ ప్రాపంచిక జీవితపు పరీక్షలోని ఒక భాగం. ప్రసాదించబడిన తెలివితేటలు మరియు శక్తియుక్తులు వినియోగించి ఆయనను గుర్తించాలనే బాధ్యతను ఆయన మనపైనే ఉంచినాడు. అంటే ఎవరైతే చిత్తశుద్ధితో, అణుకువతో మరియు దీర్ఘాలోచనలతో ప్రయత్నిస్తారో, వారు ఆయనను తప్పకుండా గుర్తిస్తారు మరియు ఆయనపై విశ్వాసాన్ని ప్రకటిస్తారు.

### “ప్రపంచంలో బాధలు ఎందుకు ఉన్నాయి?”

వాస్తవం ఏమిటంటే వేర్వేరు ప్రజలు వేర్వేరు పద్ధతులలో రకరకాల పరీక్షల ద్వారా పరీక్షించబడటం అనేది సృష్టికర్త ఉనికిని కొట్టి పారేయనూ లేదు, అత్యంత శక్తిమంతుడైన ప్రభువును నిరాకరించడమూ లేదు. కానీ, సృష్టికర్త అనుమతించిన మంచి – చెడులు ఈ భూమండలంపై మన కొరకు పరీక్షలు. ఏమి మనకు జరిగే దానిని మనం నియంత్రించలేము కానీ, దానికి మన యొక్క ప్రతిస్పందనపై ఆయన తీర్పునిస్తాడు. ఈ ప్రపంచం అనిశ్చితమైనది, అస్థిరమైనది మరియు తాత్కాలికమైనది. ఈ తాత్కాలిక జీవితంలో మనకు జరిగే అన్యాయం మరియు దురదృష్టానికి ప్రతిగా శాశ్వత పరలోకంలో మనకు పూర్తి న్యాయం జరగబోతున్నది.

### “దేవుడు ఎందుకు ప్రజలను శిక్షిస్తాడు?”

న్యాయ స్థాపనకు అవసరమయ్యే శిక్షణను ఎవ్వరూ తిరస్కరించరు. మన జీవిత విధానాన్ని ఎంచుకునే స్వేచ్ఛను సృష్టికర్త మనకు ఇచ్చినాడు మరియు దానికి మనల్నే బాధ్యుల్ని చేసినాడు. చిత్తశుద్ధితో సృష్టికర్తకు

విధేయత చూపడంలో శ్రమించేవారికి ఆయన కరుణాకటాక్షాలు లభిస్తాయి మరియు స్వర్గంలో ప్రవేశిస్తారు. కానీ, తమ అసలు జీవిత ఉద్దేశ్యాన్ని నిర్లక్ష్యం చేసి జీవిస్తూ, సృష్టికర్తను తిరస్కరించి, తమ జీవన విధానాన్ని ఎంచుకున్న వారి కొరకు ఆయన వారినే బాధ్యులుగా చేసినాడు. సృష్టికర్తను ఎవ్వరూ నిందించలేరు. ఆయన ప్రజలను శిక్షించేందుకు సృష్టించలేదు. అయితే, వారి కోసం సులభతరం చేయాలని, వారిపై దయ కురిపించాలని ఆయన సంకల్పించాడు. మన ఛాయిస్ సృష్టికర్తకు ముందుగానే తెలుసు అనే విషయం మన ఆచరణలలోని స్వేచ్ఛను ఏమాత్రం తగ్గించదు మరియు బాధ్యతల నుండి మనల్ని తప్పించలేదు.

ఇస్లాం ధర్మం ఒక ఆచరణాత్మక, ప్రయోగాత్మక ధర్మం. అల్లాహ్ యొక్క కరుణపై ఆశ పడటం మరియు అల్లాహ్ యొక్క శిక్షలకు భయపడటం – ఈ రెండింటి మధ్య సంతులనంతో జీవించాలని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది. సకారాత్మకమైన మరియు అణుకువ, వినయవిధేయతలతో కూడిన జీవితం గడిపేందుకు ఈ రెండింటి అవసరం ఎంతో ఉన్నది. అల్లాహ్ అనంత కరుణామయుడు. కానీ, ఆయన అత్యంత న్యాయవంతుడు కూడాను. ఒకవేళ అంతిమ తీర్పుదినమే లేకపోతే, అది అల్లాహ్ యొక్క సంపూర్ణ న్యాయానికి విరుద్ధం అవుతుంది మరియు జీవితం న్యాయవిరుద్ధం అవుపోతుంది.

## చివరి మాట

80 ఏళ్ళు లేదా దానికి దరిదాపుల వయస్సు వచ్చే వరకు మాత్రమే మనం ఇక్కడ ఉన్నామా? లేక ఇంకో జీవితం అంటూ ఉందా? మనం చివరికి ఏ జీవిత లక్ష్యమూ లేకుండా జీవించే కోతుల అడ్వాన్సుడు రూపాంతరాలా? మనం కేవలం భౌతిక అవసరాలున్న జీవపదార్థాలేనా లేక మనకు ఆధ్యాత్మిక అవసరాలు కూడా ఉన్నాయా?

దేవుడు గురించి ఏ నిర్ణయానికీ రాని అసలు సిసలైన, శుద్ధమైన, నిష్కళంకమైన మరియు స్వచ్ఛమైన మనస్సు కలిగిన వారి కొరకు మా సలహా ఏమిటంటే సర్వలోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ తో ఇలా మొరపెట్టుకోండి: "ఓ అల్లాహ్! ఒకవేళ నీ ఉనికి నిజమైతే, దయచేసి నాకు మార్గదర్శకత్వం వహించు." దాని అద్భుత ఫలితాలు మిమ్ముల్ని ఆశ్చర్య పరుస్తాయి !

# 6. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం )

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అంటే ఎవరు?

"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమమైన ఆదర్శం ఉంది. అల్లాహ్ పట్ల మరియు అంతిమదినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కోసం." ఖుర్ఆన్ 33:21

కేవలం సర్వలోక సృష్టికర్త (అరబీ భాషలో 'అల్లాహ్') ను మాత్రమే ఆరాధించమని మరియు ఆయనకు మాత్రమే విధేయత చూపమని ప్రజలను ఆహ్వానించేందుకు పంపబడిన ప్రవక్తల పరంపరలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చిట్టచివరి ప్రవక్త అని ముస్లింలు విశ్వసిస్తారు. అలా పంపబడిన ప్రవక్తలలో కొందరి పేర్లు – ఆదము, నోవా, అబ్రహాము, ఇష్మాయీలు, ఇస్హాకు, జాకోబు, జోసెఫ్, మోసెస్, డేవిడ్, సోలోమాన్ మరియు జీసస్ (వారందరిపై శాంతి కురుయుగాక).

తోరా దివ్యగ్రంథంతో ప్రవక్త మోసెస్ అలైహిస్సలాం పంపబడినట్లుగానే గోస్పెల్ దివ్యగ్రంథంతో జీసస్ అలైహిస్సలాం పంపబడినారు. (ముస్లింలు ఈ రెండింటి అసలు, అవతరించిన, స్వచ్ఛమైన దివ్యగ్రంథాలను పూర్తిగా విశ్వసిస్తారు, కానీ వాటి స్థానంలో ప్రస్తుతం వాడుకలో ఉన్న కలుషిత ప్రతులను కాదు). అలాగే ఖుర్ఆన్ దివ్యగ్రంథంతో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహ్ వసల్లం పంపబడినారని మరియు దానిని నిజజీవితంలో ఎలా ఆచరించాలో ఆయన బోధించారని ముస్లింలు మనస్ఫూర్తిగా విశ్వసిస్తారు.

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వభావం గురించి ఆయన భార్య ఆయెషా రదియల్లాహు అన్హాను ప్రశ్నించగా, 'నడుస్తున్న ఖుర్ఆన్' అని ఆమె జవాబిచ్చినారు. అంటే ఆయన ఖుర్ఆన్ దివ్యబోధనలను తన రోజువారీ జీవితంలో ఖచ్చితంగా ఆచరించి చూపినారు. ఆయన ఖుర్ఆన్

ఆయతులను దివ్యాచరణలలోనికి ఎలా అనువదించారనే కొన్ని నిదర్శనాలను మనం ఇక్కడ పరిశీలిద్దాం.

## మెర్సీ మిషన్

"(ఓ ముహమ్మద్) మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము." ఖుర్ఆన్ 21:107

ప్రజలను నమాజు, ఉపవాసం, దానధర్మాలు మొదలైన వాటి వైపు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆహ్వానించడంతో పాటు, అల్లాహ్ పై విశ్వాసం అనేది ఇతరులతో ఎలా మెలగాలనే విషయాన్ని కూడా ప్రభావితం చేయాలని బోధించారు. ఇంకా ఆయనిలా ఉపదేశించారు: "*మీలో ఎవరైతే ఉత్తమ గుణగణాలు కలిగి ఉంటారో, అలాంటి వారే మీలో ఉత్తములు.*"

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క అనేక బోధనలు దైవవిశ్వాసం మరియు ఆచరణల మధ్య ఉండవలసిన సంబంధం గురించి నొక్కి వక్కాణించాయి, ఉదాహరణకు: "*ఎవరైతే అల్లాహ్ పై మరియు అంతిమ దినంపై విశ్వాసం ఉంచుతారో, వారు తన ఇరుగు పొరుగు వారిని బాధ పెట్టకూడదు, ఎవరైతే అల్లాహ్ పై మరియు అంతిమ దినంపై విశ్వాసం ఉంచుతారో, వారు తమ అతిథిని మర్యాదగా చూసుకోవాలి మరియు ఎవరైతే అల్లాహ్ పై మరియు అంతిమ దినంపై విశ్వాసం ఉంచుతారో, వారు పలికితే మంచి మాటలే పలకాలి లేదా నిశ్శబ్దంగా ఉండాలి.*"

పరస్పరం గౌరవాభిమానాలతో మరియు కారుణ్యంతో మెలగాలని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలకు బోధించారు: "*ఇతరులపై కారుణ్యం చూపని వాడిపై, కారుణ్యం చూపబడదు.*"

మరోచోట, అవిశ్వాసులను శపించమని కొందరు ప్రజలు కోరగా, వారికి ఆయనిలా జవాబిచ్చారు: "*నేను ఒకరిని శపించడానికి పంపబడలేదు, వారిపై దయ చూపడానికి మాత్రమే పంపబడినాను.*"

## క్షమాగుణం

"వారిని క్షమించాలి మరియు మన్నింపు వైఖరిని అవలంబించాలి. అల్లాహ్ మిమ్మల్ని క్షమిచాలని మీరు అభిలషించరా? అల్లాహ్ మాత్రం అమితంగా క్షమించేవాడూ, కరుణామయుడూను." (ఖుర్ఆన్ 24:22)

ప్రజలందరిలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత ఎక్కువగా క్షమించేవారు మరియు దయాదాక్షిణ్యాలు చూపేవారు. ఒకవేళ ఎవరైనా ఆయనను దూషిస్తే, ఆయన వారిని క్షమించేసేవారు. ఎదుటి వ్యక్తి ఎంత ఆగ్రహంతో ఉంటే ఆయన అంత కంటే ఎక్కువ ప్రశాంతంగా అతనితో ప్రవర్తించేవారు. ముఖ్యంగా ఆయనదే పైచేయి అయినప్పుడు మరియు ప్రతీకారం తీర్చుకునే శక్తి, అవకాశం కలిగి ఉన్నప్పుడు కూడా ఆయన తన విరోధులతో అత్యంత సౌమ్యంగా మరియు మృదువుగా, అత్యంత కనికరంతో వ్యవహించేవారు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంటేనే పూర్తి క్షమాగుణం మరియు ఆయనపై ఎంత పెద్ద దౌర్జన్యం జరిగినా, దాడి జరిగినా అది ఆయన క్షమాగుణం కంటే తక్కువ స్థాయిలోనే ఉండేది. ఖుర్ఆన్ లోని క్రింది వచనాలలో తెలిపినట్లుగా, ఇతరులను క్షమించడంలో ఆయనకు ఆయనే సాటి: "(ఓ ముహమ్మద్), మన్నింపు వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధిస్తూ ఉండు. మూర్ఖులను పట్టించుకోకు." (ఖుర్ఆన్ 7:199)

## సమానత్వం

"నిశ్చయంగా ఎక్కువ భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువ ఆదరణీయుడు." ఖుర్ఆన్ 49:13

అల్లాహ్ దృష్టిలో మానవులందరూ సమానులేనని, క్రింది ఉపదేశాలలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించారు:

*"మానవజాతి మొత్తం ఆదం నుండి వచ్చింది మరియు ఆదం మట్టి నుండి. ఒక అరబ్బుపై ఒక అరబ్బేతరునికి, ఒక నల్లవానిపై ఒక తెల్లవానికి ఎలాంటి ఆధిక్యత లేదు – దైవభీతి స్థాయిలో తప్ప."*

*"మీ రూపురేఖలు మరియు మీ సంపద చూసి అల్లాహ్ తీర్పు నివ్వడు, కానీ ఆయన మీ హృదయాలను చూస్తాడు మరియు మీ ఆచరణలను చూస్తాడు."*

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరులలో ఒకతను మరొక వ్యక్తితో "నల్లటి ఆడదాని కొడుకు!" అంటూ అసహ్యకరంగా మాట్లాడగా, వెంటనే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కోపంగా అతనితో ఇలా అన్నారు, *"అతని తల్లి నలుపు రంగు కారణం వలన అతనిని నిందిస్తున్నావా? ఇస్లాం ధర్మానికి ముందటి పూర్వకాలపు అజ్ఞానకాలపు ఛాయలు నీలో ఇంకా మిగిలి ఉన్నాయి."*

## సహనం, ఓర్పు

"మంచీ – చెడూ సమానం కాజాలవు. కాబట్టి చెడును మంచి ద్వారా తొలగించు. ఆ తర్వాత నీకూ – తనకూ మధ్య బద్ధవిరోధం ఉన్నతను సైతం నీకు ప్రాణస్నేహితుడై పోతాడు." ఖుర్ఆన్ 41:34

*"నీకు అపకారం తలపెట్టిన వారికి బదులుగా నీవు అపకారం చేయకూడదు, కానీ వారిని క్షమించి, దయతో ప్రవర్తించు."* ఇలానే ఆయన తనపై వ్యక్తిగతంగా జరిగిన దాడులకు మరియు దూషణలకు స్పందించారు.

తనకు కష్టం కలిగించిన వారితో ప్రతీకారం తీర్చుకునే అవకాశం లభించినా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అలా చేయకుండా వారిని క్షమించి, దయతో వ్యవహరించారనే అనేక ఉదాహరణలు ఇస్లామీయ చరిత్రలో మనకు లభిస్తాయి.

ఆపదలు, దుర్దశ, దౌర్భాగ్య స్థితిలో సహనం, ఓర్పు వహించాలని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలకు బోధించారు: “*తన బలంతో ఇతరులపై ఆధిక్యత సంపాదించేవాడు బలమైనవాడు కాదు, కానీ కోపంలో తనను తాను నిగ్రహించుకోగలిగే వాడే బలమైనవాడు..*”

సహనంతో, ఓర్పుతో శాంతంగా ఉండటమంటే ముస్లింలు ఉదాసీనులుగా మారాలని మరియు ఎవరైనా తనపై దాడి చేస్తే ఆత్మరక్షణ చేసుకోకూడదని కాదు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, “*శత్రువుతో పోరాడాలని కోరుకోవద్దు, కానీ ఒకవేళ అలా పోరాడవలసి వస్తే, సహనంతో పోరాడు (i.e. అంటే శత్రువును ఎదుర్కొనే టప్పుడు స్థిరంగా, నిలకడగా పోరాడు).*”

## సౌమ్యత, మృదుత్వం, హుందాతనం

“అల్లాహ్ దయ వలననే నీవు వారి పట్ల మృదుమనస్కుడవయ్యావు. ఒకవేళ నీవే గనుక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయి ఉంటే, వారంతా నీ దగ్గర నుంచి వెళ్ళి పోయేవారు.” ఖుర్ఆన్ 3:159

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద దాదాపు పది సంవత్సరాల పాటు సేవకుడిగా పనిచేసిన ఒక సహచరుడు, ఆయన ఎల్లప్పుడు సౌమ్యంగా ప్రవర్తించేవారని సాక్ష్యం ఇచ్చారు. “నేను ఏదైనా పని చేసినప్పుడు, నేను ఆ పని చేసిన విధానాన్ని ఆయన ఎన్నడూ ప్రశ్నించలేదు; మరియు నేను ఏదైనా పని చేయలేక పోయినప్పుడు, ఆయన ఎన్నడూ ఎందుకు చేయలేదని ప్రశ్నించలేదు. ప్రజలందరితో ఆయన స్నేహపూర్వకంగా మెలిగేవారు.”

ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భార్య ఆయేషా రదియల్లాహు అన్హాను అవమాన పరచగా, ఆమెకు చాలా కోపం వచ్చింది. అది చూసి, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెకిలా సలహా

ఇచ్చారు: *"సౌమ్యంగా మరియు ప్రశాంతంగా ఉండు, ఓ ఆయెషా! వ్యవహారాలన్నింటిలో సౌమ్యంగా ప్రవర్తించడాన్ని అల్లాహ్ ఇష్టపడతాడు."*

ఇంకా ఆయనిలా ఉపదేశించారు: *"హుందాతనాన్ని, సౌమ్యాన్ని చూపండి! ఎందుకంటే దేనితోనైనా హుందాతనం, సౌమ్యం చేరితే, అది దాని అందాన్ని మరింత పెంచుతుంది. మరియు ఒకవేళ దేనిలో నుండైనా వాటిని తొలగిస్తే, అది లోపభూయిష్టంగా తయారవుతుంది."*

## అణుకువ, నమ్రత, వినయవిధేయతలు

"అనంత కరుణామయుని దాసులు ఎవరంటే, వారు నేలపై వినమ్రులై నడుస్తారు. మూర్ఖులు వారితో మాట్లాడినప్పుడు, వారితో 'మీకు సలాం' అంటూ సాగిపోతారు." ఖుర్ఆన్ 25:63

తన గౌరవార్థం ప్రజలు లేచి నిలబడటాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నివారించేవారు. సమూహంలో ఎక్కడ స్థానం లభిస్తే అక్కడే కూర్చునేవారు. అంతేగానీ, తన కోసం ప్రత్యేక ఎత్తైన స్థానం కావాలని ఎన్నడూ కోరలేదు. ఎన్నడూ తన సహచరులకు భిన్నంగా కనబడేలా ఆయన దుస్తులు ధరించలేదు మరియు వారి కంటే ఉన్నత స్థాయిలో ఉన్నట్లు ప్రదర్శించేందుకు కూడా ప్రయత్నించలేదు. బీదసాదలతో మరియు అక్కరగలవారితో ఇట్టే కలిసి పోయేవారు; ముసలివాళ్ళ వద్ద కూర్చునేవారు మరియు వితంతువులకు సహాయం అందించేవారు. ఆయన ప్రజలలో ఉన్నప్పుడు, ఆయన అంటే ఎవరో తెలియని క్రొత్తవారు ఆయనకు, మిగిలిన ప్రజలకు మధ్య ఎలాంటి భేదం గుర్తించలేక పోయేవారు.

సహచరులను సంబోధిస్తూ, ఆయనిలా పలికారు: "మీరు వినయవిధేయతలతో, నమ్రత, అణుకువలతో ఉండాలని అల్లాహ్ నాకు తెలియజేసినాడు. ఒకరిపై మరొకరు ప్రగల్భాలు, గొప్పలు చెప్పకోకూడదు, ఒకరిపై మరొకరు దౌర్జన్యం చేయకూడదు."

ఆయన ఎంత ఎక్కువ అణుకువతో ఉండేవారంటే, ఎవరైనా తనను ఆరాధిస్తారేమోనని ఆయన చాలా భయపడేవారు ఎందుకంటే ఆరాధనలు కేవలం సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ కు మాత్రమే చెందుతాయి. ఆయనిలా పలికేవారు:

"క్రైస్తవులు మర్యమ్ కుమారుడైన జీసస్ ను ప్రశంసించుటలో మితిమీరి పోయినట్లు, మీరు నన్ను ప్రశంసించుటలో హద్దులు మీరి పోకండి. నేను కేవలం అల్లాహ్ యొక్క దాసుడిని మాత్రమే; కాబట్టి నన్ను అల్లాహ్ యొక్క దాసుడు మరియు అల్లాహ్ యొక్క ప్రవక్త అని పిలవండి."

## ఉత్తమ భర్త

"మరియు వారితో ఉత్తమరీతిలో కాపురం చేయండి." ఖుర్ఆన్ 4:19

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియ భార్య ఆయెషా రదియల్లాహు అన్హా తన భర్త గురించి ఇలా పలికినారు: "ఆయన ఎల్లప్పుడూ ఇంటి పనిలో సహాయపడేవారు మరియు తన దుస్తులు తనే మడత పెట్టుకునేవారు, తన పాదరక్షలు తనే రిపేరు చేసుకునేవారు మరియు తనే నేల శుభ్రపరిచేవారు. ఇంకా పాలు పితికేవారు, తన పశువుల బాగోగులు చూసేవారు మరియు వాటికి మేత వేసేవారు. మరియు ఇంటి పనులలో పాలుపంచుకునేవారు."

స్వయంగా తను ఉత్తమ భర్తగా ప్రవర్తించడమే కాకుండా, తనను అనుసరించమని తన సహచరులకు కూడా ఆయన బోధించేవారు: "ఎవరైతే ఉత్తమ నైతిక ప్రవర్తన కలిగి ఉంటారో, అలాంటి వారే దైవవిశ్వాసంలో ఎక్కువ పరిపూర్ణులు. వారిలో కూడా ఎవరైతే తమ భార్యలతో ఉత్తమంగా ప్రవర్తిస్తారో, అలాంటి వారు మరింత ఎక్కువ ఉత్తములు."

## ఆదర్శవంతుడు, రోల్ మోడల్

“నిశ్చయంగా నీవు (ఓ ముహమ్మద్) నైతిక ప్రవర్తన యొక్క అత్యుత్తమ ప్రమాణం.” ఖుర్ఆన్ 68:4

తన జీవితంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎలా జీవించారనే దానికి పైప్రస్తావనలు కొన్ని మచ్చుతునకలు మాత్రమే. సాటి లేని ఆయన దయాదాక్షిణ్యాల, ఉత్తమ నైతిక ప్రవర్తనల ఉదాహరణలు ఇస్లాం గురించి మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిని మరియు నిరంతరం వక్రీకరించేవారిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు తిన్నగా దాని అసలు మూలాల వద్దకు వెళ్ళి పరిశోధించడమనేది చాలా ముఖ్యమైన విషయం, ఆ మూలాలు: ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు. అంతేగాని కొందరు ముస్లింల తప్పుడు చేష్టలను ఆధారంగా చేసుకుని ఇస్లాం ధర్మం గురించి తీర్మానించుకోకూడదు.

## కొందరు ముస్లిమేతరుల వ్యాఖ్యానాలు

భారతదేశ స్వాతంత్ర ఉద్యమం యొక్క రాజకీయ మరియు అధ్యాత్మిక నాయకుడైన మహాత్మా గాంధీ ఇలా వ్యాఖ్యానించారు: “ప్రవక్త యొక్క దృఢమైన నిరాడంబరత మరియు పరిపూర్ణమైన ఆత్మ ప్రక్షాళన, ఇచ్చిన హామీలను మరిచి పోని సూక్ష్మబుద్ధి, తన సహచరుల మరియు మిత్రుల కోసం ప్రత్యేక శ్రద్ధ, ధైర్యసాహసాలు, నిర్భయం మరియు వీరత్వం, అల్లాహ్ పై మరియు తన దౌత్యలక్ష్యంపై ఆయన యొక్క స్వచ్ఛమైన, సంపూర్ణమైన మరియు దృఢమైన విశ్వాసం – ఇవే గానీ ఖడ్గం కాదు ప్రతి దాన్నీ వారి ముందుకు మోసుకు వచ్చింది మరియు ప్రతి ఆటంకాన్నీ, అవరోధాన్నీ అధిగమించింది మరియు జయించిందీను.”

జార్జ్ బెర్నార్డ్ షా, బ్రిటీష్ నాటక రచయిత ఇలా ప్రకటించినాడు: "ఈనాటి ప్రపంచానికి ముహమ్మద్ మెదడు వంటి మెదడు కలిగి ఉన్న మానవుడి అవసరం అత్యంత అధికంగా ఉన్నది; మధ్యయుగ కాలపు ప్రజలు తమ అజ్ఞానం, దురభిప్రాయం మరియు పక్షపాతం వలన ఆయన గురించి చాలా చెడుగా చిత్రీకరించారు. ఎందుకంటే వారు ఆయనను క్రైస్తవ మత విరోధిగా భావించేవారు. కానీ, ఆ మహాపురుషుడి వృత్తాంతాన్ని చూసిన తర్వాత, నేను దానిని ఆశ్చర్యకరమైనదిగా, ఉల్లాసకరమైనదిగా మరియు అద్భుతమైనదిగా గుర్తించి, ఆయన ఎన్నడూ క్రైస్తవ మత విరోధి కాదనీ, ఆయన తప్పనిసరిగా మానవజాతి ఉద్ధారకుడు మరియు రక్షకుడు అనే పేర్లతో పిలవబడాలనే నిర్ధారణకు వచ్చాను. నా అభిప్రాయం ప్రకారం, ఈనాటి ప్రపంచంపై ఆయనకు గనుక మరొక్కసారి ఆధిపత్యం ఇస్తే, మన సమస్యలన్నింటినీ ఆయన చక్కగా పరిష్కరించి వేస్తాడు, ప్రపంచం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శాంతీ, సంతోషాలను స్థాపిస్తాడు."

# 7. జీసస్ (అలైహిస్సలాం) : అల్లాహ్ యొక్క ప్రవక్త

## జీసస్ (అలైహిస్సలాం)ను ముస్లింలు ఎంతో ప్రేమిస్తారు

జీసస్ (అలైహిస్సలా) ఒక సుప్రసిద్ధ మహాప్రవక్త. ప్రపంచ వ్యాప్తంగా అనేక బిలియన్ల ప్రజలు ఆయనను ప్రేమిస్తారు మరియు గౌరవిస్తారు. అయినా ఈ బ్రహ్మాండమైన వ్యక్తిత్వం యొక్క స్థితి చుట్టూ ఎంతో అస్పష్టత వ్యాపించి ఉన్నది. ముస్లింలు మరియు క్రైస్తవులు ఆయనను చాలా ఎక్కువగా గౌరవిస్తారు, కానీ వారుభయులు ఆయన గురించి పరస్పరం విరుద్ధ అభిప్రాయాలు కలిగి ఉన్నారు.

ఈ వ్యాసం యొక్క ముఖ్య లక్ష్యం – జీసస్ (అలైహిస్సలాం) చుట్టూ ప్రజలలో వ్యాపించి ఉన్న వేర్వేరు అభిప్రాయాలలోని సత్యాసత్యాలను స్పష్టం చేయడం: జీసస్ స్వయంగా దేవుడా లేక దేవుడు  పంపినవాడా? అసలు చారిత్రక వాస్తవ జీసస్ (అలైహిస్సలాం) ఎవరు?

## "జీసస్ యే దేవుడు"

"జీసస్ యే దేవుడని" లేక త్రైత్వంలో ఒకడని కొందరు క్రైస్తవులు వాదిస్తున్నారు – అంటే ఆయన భూమిపై దిగివచ్చిన దేవుడి అవతారం మరియు దేవుడు స్వయంగా మానవుడి రూపంలో అవతరించాడని వాదిస్తున్నారు. కానీ, బైబిల్ బోధనల ప్రకారం, జీసస్ ఈ భూమిపై జన్మించారు, భుజించారు, నిద్రించారు, ప్రార్థించారు మరియు పరిమిత జ్ఞానం మాత్రమే కలిగి ఉండినారు – ఈ గుణగణాలు, లక్షణాలన్నీ దేవుడి మహోన్నత స్థాయికి తగినవి కావు. సర్వలోక సృష్టకర్త పరిపూర్ణత్వ దివ్యలక్షణాలను కలిగి ఉండగా మానవుడు దానికి విరుద్ధంగా పరిమిత లక్షణాలు కలిగి ఉన్నాడు. మరి, ఏకకాలం పూర్తి విరుద్ధమైన ఈ రెండు స్థితులలో ఏదైనా ఉండగలదా?

సర్వలోక సృష్టికర్త అయిన దేవుడు ఎల్లప్పుడూ సంపూర్ణుడిగానే ఉంటాడని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. దేవుడు మానవుడిగా మారాడని విశ్వసించడమంటే (కొంతకాలం) ఆయన అసంపూర్ణుడిగా ఉంటాడని లేదా ఉన్నాడని వాదించడమే! ఏ క్రైస్తవుడైనా ఒక్కసారి స్వయంగా ఇలా ప్రశ్నించుకోవాలి – ఒకప్పుడు బలహీనమైన నిస్సహాయ స్థితిలోని ఒక పసిబిడ్డగా, అన్నపానీయాలు, నిద్రాహారాలు లేకుండా బ్రతకలేని స్థితిలో జీవించిన మానవుడు మరియు పాతనిబంధనలలో పేర్కొనబడిన అద్వితీయుడైన దేవుడూ ఒక్కడేనా? అస్సలు కాదు.

"ఒకవేళ దేవుడు ఏదైనా చేయగల ఘనుడైతే, ఒక మానవుడిగా ఎందుకు మారలేడు?" అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. అసలు నిర్వచనం ప్రకారం, దేవుడు తన అద్వితీయ స్థాయికి తగని పనులు చేయడు. తనను దేవుడి స్థానం నుండి క్రిందికి దిగజార్చే ఏ పనీ ఆయన చేయడు. ఒకవేళ దేవుడే మానవుడిగా మారి మానవ లక్షణాలు అలవర్చుకున్నాడని అంటే, ఆయన ఎంత మాత్రమూ దేవుడు కాజాలడు.

కొందరు ఏదో విధంగా జీసస్ దేవుడు అనే అభిప్రాయం వచ్చేలా కనబడే బైబిల్ లోని కొన్ని అస్పష్టమైన వచనాలను పొరపాటుగా వాడుతున్నారు. కానీ ఒకవేళ మనం బైబిల్ లోని కొన్ని స్పష్టమైన డైరక్టు వచనాలు పరిశీలిస్తే, జీసస్ (అలైహిస్సలాం) ఒక అద్భుతమైన మహాప్రవక్త తప్ప మరేమీ కాదని తెలిపే వచనాలు మాటిమాటికీ కనబడతాయి. సర్వలోక సృష్టికర్త అయిన ప్రభువు పేరు, తను వేరు అని జీసస్ పలికిన పలుకులు మరియు ఆయన ప్రవర్తనలు బైబిల్ లో ఎన్నో చోట్ల ప్రస్తావించబడినాయి. ఉదాహరణకు :

- జీసస్ "నేలపై సాగిలపడినాడు మరియు ప్రార్థించినాడు." (మత్తయి సువార్త 26:39) ఒకవేళ జీసస్ యే గనుక దేవుడు అయినట్లయితే, దేవుడు నేలపై సాగిలపడతాడా మరియు ప్రార్థిస్తాడా? ఆయన ఎవరిని ప్రార్థించాడు?

- జీసస్ ఒక ప్రవక్త అని బైబిల్ పేర్కొంటున్నది (మత్తయి సువార్త 21:10-11), కాబట్టి జీసస్ ఎలా ఏకకాలంలో దేవుడు మరియు దేవుడి ప్రవక్త అవగలడు?
- జీసస్ ఇలా పలికినాడు, "నేను వెళ్ళి మీ యొద్దకు వచ్చెదనని చెప్పిన మాట మీరు వింటిరి కదా. తండ్రి నా కంటే గొప్పవాడు." (యోహాను సువార్త 14:28)
- జీసస్ ఇలా పలికినాడు "నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మరియు మీ దేవుడునైన వాని యొద్దకు ఎక్కిపోవుచున్నాను."(యోహాను సువార్త 20:17) ఒకవేళ జీసస్ యే గనుక దేవుడు అయితే, ఆయన ఎందుకు ఇలా పలికినాడు, "నా దేవుడును మరియు మీ దేవుడునైన వాని యొద్దకు ఎక్కి పోవుచున్నాను," మరియు ఆయన ఎవరి వద్దకు ఎక్కి పోయినది?

ఒకవేళ జీసస్ యే గనుక దేవుడు అయితే, తననే ఆరాధించమని ఆయన ప్రజలకు ఆదేశించేవాడు, మరియు ఈ ఆదేశం తెలిపే స్పష్టమైన వచనాలు బైబిల్ లో ఉండేవి; కానీ, ఆయన దీనికి విరుద్ధంగా పలికినాడు మరియు తనను అస్సలు ఆరాధించకూడదని నివారించినాడు: "వారు నన్ను ఆరాధించడం వ్యర్థం." (మత్తయి 15:9)

### "దేవుడి కుమారుడు"

జీసస్ దేవుడి కుమారుడు అని కొందరు క్రైస్తవులు వాదిస్తుంటారు. దీని అసలు అర్థం ఏమిటి? నిశ్చయంగా శారీరక మరియు శాబ్దిక కుమారుడిని కలిగి ఉన్నాడని చెప్పటం దేవుడి విషయంలో అస్సలు తగదు. మానవులకు మానవ సంతానం కలుగుతుంది. పిల్లులకు పిల్లికూనలు పుడతారు. మరియు దేవుడికి కుమారుడు ఉండటమంటే అర్థం ఏమిటి?

ఆరంభపు బైబిల్ భాషలలో "దేవుడి కుమారుడు" అనే పదాలు శబ్దపరమైన అర్థంలో కాకుండా, "ధర్మపరాయణుడని" సూచించేందుకు లాంఛనప్రాయంగా వాడబడినాయనే అసలు విషయాన్ని మనం గుర్తిస్తాము. బైబిల్ లో కేవలం జీసస్ కొరకు మాత్రమే కాకుండా డేవిడు, సోలోమాను మరియు ఇజ్రాయీలు మొదలైన ప్రవక్తల కొరకు కూడా దేవుడి కుమారుడు అనే పదాలు వాడబడినాయి: "...ఇశ్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్ఠ పుత్రుడు" (నిర్గమకాండం 4:22). వాస్తవానికి ఎవరైనా ధర్మపరాయణుడైతే, అతడు దేవుని కుమారుడని పిలవబడేవాడు: "దేవుని ఆత్మ చేత ఎందరు నడిపింపబడుదురో, వారందరు దేవుని కుమారులై యుందురు." (రోమా 8:14)

"ఎవరినైనా కుమారునిగా చేసుకోవటం అల్లాహ్ కు తగిన పని కాదు. ఆయన సర్వలోపాలకు అతీతుడు. ఆయన ఏదైనా చేయదల్చుకుంటే, దానిని కేవలం: "అయిపో!" అంటాడు, అంతే అది అయిపోతుంది." ఖుర్ఆన్ 19:35

## "తండ్రి మరియు ప్రభువు"

అదే విధంగా, 'తండ్రి' అనే పదం సర్వలోక సృష్టికర్త అయిన దేవుడిని సూచించేందుకు వాడబడినప్పుడల్లా, దానిని శబ్దపరమైన అర్థంలో తీసుకో కూడదు. ఎందుకంటే, దేవుడు సృష్టికర్త, పోషకుడు మరియు మానవులందరి మహోన్నత ప్రభువు అనే అర్థంలోనే తీసుకోవాలి. 'తండ్రి' అనే పదం యొక్క అర్థం లాంఛనప్రాయంగా ఇలాగే వాడబడటాన్ని నిరూపించే అనేక వచనాలు బైబిల్ లో ఉన్నాయి. ఉదాహరణకు: "అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే" (ఎఫెసీయులకు 4:6)

అంతేగాక, కొన్నిసార్లు, జీసస్ ను ఆయన సహచరులు 'ప్రభువు' అని సంబోధించిన సందర్భాలు బైబిల్ లో ఉన్నాయి. అసలు బైబిల్ భాషలలో ఈ పదం దేవుడి కోసమే కాకుండా ఉత్తమ పురుషుల కోసం కూడా వాడబడింది. ఉదాహరణకు, గ్రీకు భాషలోని పాతనిబంధనలో, కైరియోస్ అనే పదం

'ప్రభువు' కోసమే కాకుండా ద్రాక్షతోట యజమాని కోసం కూడా వాడబడింది (మత్తయి సువార్త 20:8), మరియు అవిధేయుడైన సేవకుడిని కొట్టిన యజమాని (లూకా సువార్త 20.42-47).

బైబిల్ లో మరికొన్ని చోట్ల, జీసస్ ను దేవుడి దాసుడని ఆయన సహచరులు పేర్కొన్నారు: "దేవుడు తన సేవకుడైన యేసును మహిమ పరచియున్నాడు." (అపోస్తలుల కార్యములు 3:13). మరి దీని ద్వారా 'జీసస్ ను సంబోధిస్తూ ప్రభువు అనే పదం పలకబడినప్పుడల్లా, అది గౌరవసూచకంగా మాత్రమే వాడబడింది. అంతేగాని ఆయన యొక్క దైవత్వాన్ని సూచిస్తూ కాదు' అనే విషయం స్పష్టం అవుతున్నది.

అస్పష్టంగా మరియు అసంతృప్తిగా ఉన్న దేవుడి స్వభావం మరియు జీసస్ స్వభావాలలోని చిక్కులను, సంక్లిష్టతలను వివరించే ప్రయత్నం ఇక్కడ చేయబడింది. ఏదేమైనా, ఆలోచించవలసిన అసలు విషయం ఏమిటంటే: వాటిని మనం అర్థం చేసుకోలేనంత కష్టతరంగా దేవుడు ఎందుకు చేస్తాడు? ఈ క్లిష్టతరమైన చిక్కులతో నిండిన అప్రామాణిక బోధనలను దైవభావన గురించి ఇస్లాం ధర్మంలో తెలుబడిన సులభమైన, స్పష్టమైన మరియు ఎలాంటి కల్పితాలు లేని స్వచ్ఛమైన ప్రామాణిక బోధనలతో ఎలా పోల్చగలం?

## జీసస్ : అల్లాహ్ యొక్క ప్రవక్త

యూదులు జీసస్ అలైహిస్సలాంను మెస్సయ్యహ్ గా అంగీకరించరు. కానీ క్రైస్తవంలో దీనికి పూర్తి భిన్నంగా జీసస్ ను దేవుడిగా లేక దేవుడి కుమారుడిగా పూజిస్తున్నారు. ఇస్లాం ధర్మం మధ్యేమార్గాన్ని అనుసరిస్తున్నది మరియు అల్లాహ్ యొక్క ఒక మహాప్రవక్తగా మరియు సందేశహరుడిగా, మెస్సయ్యగా జీసస్ అలైహిస్సలాంను గుర్తిస్తున్నది. ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే, ముస్లింలు ఆయనను ఆరాధించరు. ఎందుకంటే

సకల ఆరాధనలు కేవలం అల్లాహ్ కు మాత్రమే చెందును. అల్లాహ్ యే జీసస్ ను మరియు సృష్టిలోని ప్రతిదాన్నీ సృష్టించినాడు.

“(జీసస్) ఇలా అన్నాడు, ‘నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడిని. ఆయన నాకు దివ్యగ్రంథాన్నిచ్చి, నన్ను ప్రవక్తగా నియమించాడు’”ఖుర్ఆన్ 19:30

## మహాద్భుత జననం

ఖుర్ఆన్ ప్రకారం, దైవదూత జిబ్రయీల్ మానవుడి రూపంలో పవిత్ర కన్య మర్యమ్ వద్దకు వచ్చి, అల్లాహ్ యొక్క ఆజ్ఞ ద్వారా తండ్రి అవసరం లేకుండానే అంటే స్త్రీపురుష కలయిక లేకుండానే అద్భుతంగా ఆమెకు ఒక కుమారుడు జన్మిస్తాడనే శుభవార్తను ఇచ్చినాడు.

“(దేవదూత) ఇలా జవాబిచ్చాడు, ‘నిశ్చయంగా నేను నీ ప్రభువు యొక్క సందేశహరుడను మాత్రమే. నీకు ఒక సుశీలుడైన కుమారుని (సందేశాన్ని)ని ఇవ్వటానికి పంపబడ్డాను. ఆమె ఇలా ప్రశ్నించింది, ‘నాకు కుమారుడు ఎలా కలుగుతాడు, నన్ను ఏ మానవుడూ ముట్టుకోలేదే! మరియు నేను చెడు నడవడిక గలదానిని కూడా కాను!’ అతను అన్నాడు, ‘అలాగే అవుతుంది! నీ ప్రభువు అంటున్నాడు: “అది నాకు చాలా సులభం! మేము అతనిని మా నుండి ప్రజలకు మరియు కారుణ్యంగా పంపుతున్నాము. మరియు (నీ ప్రభువు) ఆజ్ఞ నెరవేరి తీరుతుంది.” ఖుర్ఆన్ 19:19-21

స్త్రీపురుష కలయిక లేకుండానే జన్మించడాన్ని సాక్ష్యంగా చూపుతూ కొందరు జీసస్ కూడా దేవుడని వాదిస్తున్నారు. అయితే, తండ్రి అవసరం లేకుండా అంటే స్త్రీపురుష కలయిక లేకుండా ఉనికిలోనికి వచ్చినవారిలో జీసస్ మొదటివారు కాదు. జీసస్ కంటే ముందు ఉనికి లోనికి వచ్చిన ఆదిమానవుడు ఆదం అలైహిస్సలాంకు తల్లీ, తండ్రీ ఇద్దరూ లేరు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ప్రకటన ఇలా ఉన్నది:

“నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో ‘ఈసా ఉపమానం, ఆదం ఉపమానం వంటిదే. ఆయన (ఆదంను) మట్టితో సృజించి: ‘అయిపో’ అని అన్నాడు, అంతే అతను అయిపోయాడు. ఈ సత్యం నీ ప్రభువు తరుఫు నుండి వచ్చింది. కావున నీవు శంకించే వారిలో చేరిన వాడవు కావద్దు.”ఖుర్ఆన్ 3:59-60

ఒకవేళ తండ్రి లేకుండా జన్మించారని జీసస్ ను ఆరాధించాలనుకుంటే, అలా ఆరాధింపబడే హక్కును ఆయన కంటే ఎక్కువగా ఆదము కలిగి ఉన్నారు ఎందుకంటే ఆదము తల్లీ, తండ్రీ లేకుండా సృష్టించబడినారు.

## జీసస్ (అలైహిస్సలాం) మహిమలు

స్త్రీపురుష కలయిక అవసరం లేకుండానే జన్మించిన జీసస్ అలైహిస్సలాం జననం ఒక గొప్ప మహిమ. అంతేగాక ఆయన తన జీవిత కాలంలో అల్లాహ్ అనుజ్ఞతో అనేక గొప్ప మహిమలు చేసి చూపారు. తన తల్లి శీలాన్ని శంకించిన ప్రజలకు ఉయ్యాలలో దినాల పసిబిడ్డగా ఉన్నప్పుడే, అల్లాహ్ అనుజ్ఞతో స్వయంగా జవాబిచ్చారు. ఇంకా, జీసస్ అలైహిస్సలాం మృతులను సజీవులుగా చేసారు, కుష్ఠురోగుల రోగాన్ని దూరం చేసారు, అంధులకు కంటిచూపు ప్రసాదించారు – ఇదంతా ఆయన కేవలం అల్లాహ్ అనుజ్ఞతోనే చేసేవారు.

జీసస్ అలైహిస్సలాం మహిమలు చూపినంత మాత్రాన ఆయన స్థానం అల్లాహ్ యొక్క విధేయుడైన దాసుడి కంటే మరెంత మాత్రమూ ఎక్కువ కాలేదు. ఇది ఒక వాస్తవమైన విషయం. నిజానికి, అనేకమంది సందేశహరులు మహిమలు చేసి చూపారు, ఉదాహరణకు, నూహ్, మోసెస్ అలైహిస్సలాం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. ఈ మహిమలన్నీ సందేశహరుడి ప్రామాణికతను ప్రజలు గుర్తించేందుకు కేవలం అల్లాహ్ యొక్క అనుజ్ఞతో సంభవించేవి.

## జీసస్ అలైహిస్సలాం యొక్క అసలు సందేశం

పాతనిబంధనలలోని అబ్రహాం, నూహ్ మరియు జోనాహ్ అలైహిస్సలాం మొదలైన ప్రవక్తలు ఎన్నడూ దేవుడు త్రైత్వంలో భాగమని బోధించలేదు మరియు జీసస్ అలైహిస్సలాం తమ సంరక్షకుడని నమ్మలేదు. వారి సందేశం చాలా సింపుల్ గా ఉండేది: దేవుడు ఏకైకుడు మరియు కేవలం ఆయన మాత్రమే మీ సకల ఆరాధనలు పొందేందుకు అర్హడు మరియు యోగ్యుడు. అనేక వేల సంవత్సరాల పాటు తను ఏకైకుడని, కేవలం తనను మాత్రమే ఆరాధించాలనే దివ్యసందేశంతో ప్రవక్తలను పంపి, తర్వాత హఠాత్తుగా జీసస్ కూడా దేవుడనే విశ్వాసాన్ని నాటేందుకు తన ఏకత్వ స్థాయి నుండి క్రిందికి దిగి, తాను త్రైత్వంలో భాగమంటూ సర్వలోక సృష్టికర్త తన దివ్యసందేశాన్ని మార్చాడనటం హేతుబద్ధంగా ఉన్నదా?

అసలు వాస్తవం ఏమిటంటే, జీసస్ అలైహిస్సలాం కూడా పాతనిబంధనలలోని అసలు దివ్యసందేశాన్నే బోధించారు. బైబిల్ లోని ఈ భాగం నిజంగా ఆ మూలసందేశాన్నే ధృవీకరిస్తున్నది. "శాస్త్రులలో ఒకడు వచ్చి, వారు తర్కించుట విని, ఆయన వారికి బాగుగా ఉత్తమిచ్చెదనని గ్రహించి - "ఆజ్ఞలన్నింటిలో ప్రధానమైనదేది?" అని ఆయన నడిగెను. అందుకు యేసు – 'ప్రధానమైనది ఏదనగా – ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయుడైన ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ'" (మార్కు సువార్త 12:28-29) కాబట్టి, దేవుడు అద్వితీయుడు అనేది జీసస్ అలైహిస్సలాం బోధనల ప్రకారం అత్యంత ప్రధానమైన మరియు ముఖ్యమైన కమాండ్మెంటు. ఒకవేళ జీసస్ యే స్వయంగా దేవుడైతే, ఆయనిలా పలికి ఉండేవారు, 'నేనే దేవుడిని, నన్నే ఆరాధించండి.' మరి ఆయనలా చెప్పకుండా, పాతనిబంధనలలోని సందేశాన్నే మరలా రిపీట్ చేస్తూ, 'దేవుడు ఏకైకుడని' ఎందుకు పున: నిర్ధారించారు?

ఇది అద్వితీయ ప్రభువును మాత్రమే విశ్వసించాలని బోధించిన ఇతర ప్రవక్తల దివ్యసందేశాన్ని మరలా నిర్ధారించేందుకు జీసస్ అలైహిస్సలాం ఇశ్రాయేలు సంతతి వైపుకు పంపబడినారనే ఇస్లాంలో బోధించబడిన జీసస్ అలైహిస్సలాం యొక్క మిషన్ తో ఏకీభవిస్తున్నది.

"మరియు, ఈసా స్పష్టమైన (మా) సూచనలు తీసుకుని వచ్చినప్పుడు ఇలా అన్నాడు: 'వాస్తవంగా నేను మీ వద్దకు వివేకాన్ని తీసుకువచ్చాను. మరియు మీరు విభేదాలకు లోనైన కొన్ని విషయాల వాస్తవాన్ని మీకు స్పష్టంగా వివరించటానికి వచ్చాను. కావున మీరు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. మరియు నన్ను అనుసరించండి. నిశ్చయంగా, అల్లాహ్ యే నా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను. కావున మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గం.' ఖుర్ఆన్ 43:63-64

అల్లాహ్ యొక్క ఒక విధేయుడైన, గౌరవనీయుడైన సందేశహరుడిగా జీసస్ అలైహిస్సాం, అల్లాహ్ ఆజ్ఞలకు మనస్ఫూర్తిగా సమర్పించుకున్నారు. కాబట్టి, ఆయన కూడా ముస్లిం యే. ఎందుకంటే, ఎవరైతే సర్వలోక సృష్టికర్త, ప్రభువైన అల్లాహ్ అభీష్టానికి మరియు ఆజ్ఞలకు మనస్ఫూర్తిగా సమర్పించు కుంటారో, వారిని ముస్లింలు అంటారు.

## ఇస్లాం ధర్మంలో జీసస్ అలైహిస్సలాం

ఇస్లాం ధర్మంలో జీసస్ అలైహిస్సలాం 'కేవలం అద్వితీయుడైన ప్రభువునే ఆరాధించమని' ఇశ్రాయేలు సంతతివారిని ఆహ్వానించేందుకు పంపబడిన ఒక గొప్ప ప్రవక్త. ఇది బైబిల్ లో నిరూపించబడింది మరియు ఖుర్ఆన్ లో నిర్ధారించబడింది. అసలు జీసస్ ఎవరు అనే సత్యాన్ని జీసస్ అలైహిస్సలాం గురించిన ఇస్లామీయ విశ్వాసం స్పష్టంగా వివరిస్తూ, అదే సమయంలో సర్వలోక సృష్టికర్త, ఆయన యొక్క సంపూర్ణమైన ఘనత, ఏకైకత

మరియు పరిపూర్ణతల గురించిన స్వచ్ఛమైన విశ్వాసాన్ని కూడా పునరుద్ధరిస్తున్నది.

మీరొక అడుగు ముందుకు వేసి, ఇస్లాం గురించి మరింత పరిశోధించాలని మేము ఆహ్వానిస్తున్నాము. ఇస్లాం ధర్మం అంటే కేవలం మరో ధర్మం కాదు. అది నూహ్, అబ్రహాం, మోసెస్, జీసస్ మరియు ముహమ్మద్ అలైహిస్సలాంలు బోధించిన అదే దివ్యసందేశం. ఇస్లాం అనే అరబీ పదానికి అర్థం 'సర్వలోక సృష్టికర్తకు సమర్పించుకొనుట'. ఇదొక ప్రకృతి సహజమైన మరియు సంపూర్ణమైన జీవన విధానం. తమ ప్రభువుతో మరియు ఆయన యొక్క సృష్టితో మానవుడు కలిగి ఉండవలసిన గట్టి సంబంధంపై తగిన శ్రద్ధ చూపాలని ప్రోత్సహిస్తున్నది. సర్వలోక సృష్టికర్త అత్యంత న్యాయం చేసేవాడు మరియు అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, పాపవిమోచన కోసం స్వయంగా బలిచ్చుకోవలసిన అవసరం ఆయనకు ఎంత మాత్రమూ లేదు మరియు ఎవ్వరూ ఆదిపాపంతో జన్మించరని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఇంకా ప్రతి ఒక్కరినీ వారి వారి స్వంత ఆచరణల ఆధారంగా మాత్రమే సృష్టికర్త విచారిస్తాడు మరియు ప్రతి ఒక్కరూ తమ తమ స్వంత ఆచరణలకు మాత్రమే బాధ్యులని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది.

సృష్టికర్త పంపిన ప్రవక్తలందరినీ ప్రేమించాలని మరియు గౌరవించాలని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. కానీ, ప్రేమించుట మరియు గౌరవించుట అంటే వారిని ఆరాధించమని కాదు. ఎందుకంటే, ఆరాధింపబడే అర్హత, యోగ్యత కేవలం సృష్టికర్తకు మాత్రమే ఉన్నది, సృష్టించబడిన వాటికి కాదు. జీసస్ ను అల్లాహ్ యొక్క ప్రవక్తగా గుర్తించుట మరియు ముస్లింగా మారుట అనేది మీ క్రైస్తవ ధర్మాన్ని వదిలిపెట్టడం లేదా త్యజించడంగా భావించవద్దు. వాస్తవానికి అది జీసస్ అలైహిస్సలాం యొక్క అసలు స్వచ్ఛమైన బోధనల వైపుకు మరలటంగా భావించాలి.

# 8. ఖుర్ఆన్

## మానవజాతికి మార్గదర్శకత్వం వహించే అంతిమ దివ్యసందేశం

### ఖుర్ఆన్ అంటే ఏమిటి ?

**ఖుర్ఆన్ అంటే సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క వాక్కు.** అల్లాహ్ దీనిని దైవదూత జిబ్రయీల్ అలైహిస్సలాం ద్వారా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరింపజేసినాడు.

"ఈ గ్రంథావతరణ సర్వాధిక్యుడైన, వివేకవంతుడైన అల్లాహ్ తరుఫున జరిగింది." ఖుర్ఆన్ 39:1

### మానవజాతి కొరకు మార్గదర్శకత్వం

"మానవాళి కొరకు ఒక మార్గదర్శకత్వం ... తప్పు ఒప్పులను, మంచి చెడులను ఖచ్చితంగా వేరు చేసే అద్భుత గీటురాయి." ఖుర్ఆన్ 2:185. ఒకవేళ ఇదే లేకపోతే మానవుడు పూర్తిగా నష్టపోయి ఉండేవాడు.

### అంతిమ దివ్యసందేశం

ఇప్పటి వరకు పంపబడిన దివ్యసందేశాలలో ఇంకా అసలు రూపంలో మిగిలి ఉండి, నేటి ప్రాచీన గ్రంథాల ఆధునిక ప్రతులలో పేర్కొనబడుతున్న కొన్ని వాస్తవ అంశాలను ధృవీకరిస్తూ, వాటిలోని కల్పితాలను మరియు మార్పులు చేర్పులను ఖండిస్తూ మరియు సరిదిద్దుతూ, మహోన్నతుడైన అల్లాహ్ పంపిన అంతిమ దివ్యసందేశమే ఖుర్ఆన్.

"ఓ గ్రంథవహులారా! మేము అవతరింపజేసిన దానిని విశ్వసించండి. అది మీ వద్ద నున్న దానిని ధృవీకరిస్తుంది...." ఖుర్ఆన్ 4:47

## ఖుర్ఆన్ ఎలా అవతరించింది ?

ఖుర్ఆన్ దివ్యగ్రంథం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించింది. నేటికీ స్వచ్ఛంగా, ఎలాంటి మార్పులు చేర్పులకు గురి కాకుండా అవతరించబడిన అరబీభాషలో సురక్షితంగా ఉన్నది. అయితే, ప్రపంచంలోని అనేక ముఖ్య భాషలలో ఖుర్ఆన్ భావానువాదాలు లభిస్తున్నాయి.

ఖుర్ఆన్ ఒకేసారి ఒక పూర్తి గ్రంథం రూపంలో అవతరించలేదు. అది 23 సంవత్సరాల కాలంలో అంచెలంచెలుగా అవతరించింది.

ఈ కారణం వలన, ఖుర్ఆన్ ను సరిగ్గా అర్థం చేసుకునేందుకు దాని దివ్యవచనాలు ఏ యే సందర్భాలలో అవతరించాయో తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. ఒకవేళ అలా తెలుసుకోకపోతే, వాటిని తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉన్నది.

అది మహోన్నతుడైన అల్లాహ్ తరుఫు నుండే అవతరించిందని నేనెలా తెలుసుకోగలను?

## ఒరిజినల్ ఖుర్ఆన్ యొక్క సంరక్షణ

ఖుర్ఆన్ మాత్రమే శతాబ్దాలకు తరబడి వాడుకలో ఉన్నది. అయినా అది ఒక్క అక్షరం మార్పు లేకుండా అవతరించిన అరబీ భాషలో దాని అసలు రూపంలోనే సురక్షితంగా ఉన్నది. 1400 సంవత్సరాలకు పూర్వం అవతరించబడినప్పటి నుండి దానిలో ఏమీ కలుపబడలేదు, తొలగించబడలేదు లేదా మార్చబడలేదు.

“మేమే ఈ ఖుర్ఆన్ ను అవతరింపజేసాము. మరి మేమే దీనిని రక్షిస్తాము.” ఖుర్ఆన్ 15:09

అక్షరం మార్పు లేకుండా వ్రాతపూర్వకంగా భద్రపరచబడటమే గాక, స్త్రీపురుషుల మరియు పిల్లల హృదయాలలో కూడా ఖుర్ఆన్ గ్రంథం పదిలంగా

భద్రపరచబడింది. ఈనాడు ఖుర్ఆన్ గ్రంథాన్ని పూర్తిగా కంఠస్థం చేసిన ప్రజలు మిలియన్ల కొద్దీ ఉన్నారు.

## వైజ్ఞానిక అద్భుతాలు

ఖుర్ఆన్ గ్రంథ ఆధునిక వైజ్ఞానిక శాస్త్రంతో ఎంత మాత్రమూ విభేదించడం లేదు. దానిని సమర్ధిస్తున్నది. ఖుర్ఆన్ గ్రంథం యొక్క ఒక ప్రత్యేకత ఏమిటంటే అందులో ప్రకృతి సహజ ప్రక్రియలను స్పష్టంగా విశదీకరించే అనేక వచనాలు ఉన్నాయి, ఉదాహరణకు – పిండోత్పత్తి, అంతరిక్ష శాస్త్రం, ఖగోళ శాస్త్రం, భూగర్భ శాస్త్రం, సాగరశాస్త్రం మొదలైనవి. ఖుర్ఆన్ లో 7వ శతాబ్దంలో పేర్కొనబడిన వైజ్ఞానిక అంశాలు అసాధారణమైన నిర్దిష్టత్వంతో ఖచ్చితంగా ఉండటాన్ని నేటి శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

"త్వరలోనే మేము వారికి మా సూచనలను జగతిలోనూ చూపిస్తాము, స్వయంగా వారిలోనూ చూపిస్తాము. తుదకు సత్యమిదే అనే విషయం వారికి తేటతెల్లమవుతుంది." ఖుర్ఆన్ 41:53

వాస్తవానికి, ఖుర్ఆన్ లో పేర్కొనబడిన అనేక వైజ్ఞానిక అద్భుతాలను శాస్త్రజ్ఞులు ఆధునికి టెక్నలాజికల్ పరికరాల సహాయంతో ఈ మధ్యనే కనుగొన్నారు. ఉదాహరణకు:

- ఖుర్ఆన్ లో పిండోత్పత్తి గురించి స్పష్టంగా, విపులంగా విశదీకరించబడింది. వీటి గురించి ఈ మధ్య కాలం వరకు శాస్త్రజ్ఞులకు తెలియదు.
- ఖగోళ వస్తువులన్నీ (నక్షత్రాలు, గ్రహాలు, చంద్రుడు … మొదలైనవి) దుమ్ము, దూళితో నిండి మబ్బుల నుండి ఏర్పడినాయని ఖుర్ఆన్ లో పేర్కొనబడింది. ఈ వాస్తవం గురించి గతంలో ప్రజలకు తెలియదు. కానీ, ఈనాడు ఇది ఆధునిక విశ్వసృష్టిశాస్త్రంలోని ఒక నిర్వివాద నియమం.

- రెండు సముద్రాల నీళ్ళు కలిసినప్పుడు తమ స్వంత ఉష్ణోగ్రత, సాంద్రత మరియు లవణీయతలలో ఎలాంటి మార్పు లేకుండా యదాతథంగా కొనసాగేలా వాటి మధ్య అడ్డుపొరలు ఉంటాయని ఆధునిక వైజ్ఞానిక శాస్త్రం కనుగొన్నది.

సృష్టికర్త యొక్క ఈ అద్భుత చిహ్నాలు 1400 సంవత్సరాలకు పూర్వమే ఖుర్ఆన్ లో స్పష్టంగా పేర్కొనబడినాయి.

## అద్వితీయత, అపూర్వత, ఏకైకత

ఖుర్ఆన్ అవతరించినప్పటి నుండి నేటి వరకు, దానిలోని ఏదైనా ఒక అధ్యాయం వంటి అధ్యాయాన్ని దాని సాహిత్య సౌందర్యం, వాగ్ధాటి, వివేకం, శోభ, భవిష్యవాణులు మరియు ఇతర పరిపూర్ణ లక్షణాలతో ఎవ్వరూ రచించ లేక పోయారు.

"మేము మా దాసునిపై అవతరింపజేసిన దాని విషయంలో ఒకవేళ మీకేదన్నా అనుమానం ఉంటే, అటువంటిదే ఒక్క సూరానైనా తీసుకురండి. మీరు సత్యవంతులే అయితే అల్లాహ్ ను తప్ప మీ సహాయకులందరినీ పిలుచుకోండి." ఖుర్ఆన్ 2:23

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను తిరస్కరించిన మక్కా ప్రజలు అరబీ భాషలో ఎంతో గొప్ప పాండిత్యం కలిగి ఉన్నా ఈ సవాలును ఎదుర్కొనలేక పోయారు. ఈ సవాలు నేటికీ అలాగే తిరుగులేని సవాలుగా నిలబడి ఉన్నది.

## ఖుర్ఆన్ లో పరస్పర విరుద్ధ వాదనలు లేవు

ప్రజలు వ్రాస్తున్నప్పుడు స్పెల్లింగ్ తప్పులు మరియు గ్రామర్ లో తప్పులు, వచనాలను పరస్పర విరుద్ధ అర్థాలు వచ్చేట్లు వ్రాయడం, వాస్తవ

ఘటనలను తప్పుగా నమోదు చేయడం, కొంత సమాచారాన్ని వదిలి వేయడం మొదలైన అనేక రకాల తప్పులు చేసే ఆస్కారం ఉన్నది.

"ఒకవేళ ఇది గనుక అల్లాహ్ తరుఫు నుండి గాక ఇంకొకరి తరుఫు నుంచి వచ్చి ఉంటే, అందులో వారికి ఎంతో వైరుధ్యం కనబడేది." ఖుర్ఆన్ 4:82

కానీ ఖుర్ఆన్ గ్రంథంలో అలాంటి తప్పులేమీ లేవు. అంతేగాక ఖుర్ఆన్ లో ప్రస్తావించబడిన వాటిలో ఏదీ వర్ష జలము, పిండోత్పత్తి, భూగర్భశాస్త్రం, విశ్వనిర్మాణశాస్త్రం, చారిత్రక వాస్తవాలు మరియు ఘటనలు, భవిష్యవాణులు మొదలైన వైజ్ఞానిక వివరణలకు విరుద్ధంగా లేదు.

## దానిని రచించడం ముహమ్మద్ కు అసాధ్యం?

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చరిత్రలో నిరక్షరాస్యులుగా పేర్కొనబడినారు; ఆయనకు చదవడం మరియు వ్రాయడం రాదు. వైజ్ఞానిక మరియు చారిత్రక అంశాలు లేదా అరబీ సాహిత్యంలో సాటిలేని అద్భుత గ్రంథంగా దీనిని రచించే స్థాయికి చేర్చే విధంగా ఏ అంశాలలోనూ ఆయన విద్యాభ్యాసం చేయలేదు. ఇంకా, ఖుర్ఆన్ లో పేర్కొనబడిన చారిత్రక సంఘటనలు మరియు నాగరికతలు ఏ మానవుడూ రచించలేనంత ఖచ్చితంగా ఉన్నాయి.

"ఈ ఖుర్ఆన్ ను అల్లాహ్ కాకుండా ఇతరులెవ్వరూ ఎన్నటికీ తయారు చేయలేరు" ఖుర్ఆన్ 10:37

## దివ్యసందేశం యొక్క అసలు ఉద్దేశ్యం మరియు లక్ష్యం

## ఏకైక నిజఆరాధ్యుడిని విశ్వసించడం

"మీ అందరి ఆరాధ్యదైవం ఒకే ఆరాధ్య దైవం. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు." ఖుర్ఆన్ 2:163

మొత్తం ఖుర్ఆన్ లో మాటిమాటికీ ప్రస్తావించబడిన ముఖ్య విషయం ఏమిటంటే ఏకైకుడు, అద్వితీయుడు, సర్వలోక సృష్టికర్త, ప్రభువు అయిన అల్లాహ్ ను మాత్రమే విశ్వసించమనే దివ్యసందేశం. తనకు ఎవ్వరూ భాగస్వాములు మరియు సంతానం లేరని, ఎవ్వరూ సాటి లేరని, తాను తప్ప ఆరాధింపబడే అర్హత, యోగ్యత గలవారెవ్వరూ లేరని ఆయన మనకు తెలిపినాడు. సర్వలోక సృష్టికర్తతో పోల్చదగినదేదీ లేదు. ఆయన సృష్టిలోనిదేదీ ఆయనను పోలి లేదు. మానవ లక్షణాలు మరియు ప్రతిబంధకాలను అల్లాహ్ కు అంటగట్టే భావనను ఖుర్ఆన్ పూర్తిగా తిరస్కరిస్తున్నది.

## అసత్యదైవాలన్నింటినీ తిరస్కరించుట

"అల్లాహ్ నే ఆరాధించండి మరియు ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి" ఖుర్ఆన్ 4:36

కేవలం అల్లాహ్ మాత్రమే సకల ఆరాధనలకు అర్హుడు కావటం వలన, అసత్య దేవతలు మరియు దేవుళ్ళు తప్పనిసరిగా తిరస్కరించబడాలి. దివ్యలక్షణాలను ఎవరికైనా లేక దేనికైనా అంటగట్టే తలంపును ఖుర్ఆన్ కూడా పూర్తిగా తిరస్కరిస్తున్నది.

## పూర్వకాలపు వృత్తాంతాల ప్రస్తావన

ప్రయోజనకరమైన గుణపాఠాలు, ఉపదేశాలతో ప్రవక్త ఆదము, నూహ్, అబ్రహాము, జీసస్ మరియు మోసెస్ (అందరికీ అల్లాహ్ మరింత శాంతిని ప్రసాదించుగాక) మొదలైన పూర్వప్రవక్తల గాథలతో పాటు అనేక వాస్తవ వృత్తాంతాలు ఖుర్ఆన్ లో ఉన్నాయి. ఈ వృత్తాంతాల గురించి అల్లాహ్ పలుకులు ఇలా ఉన్నాయి,

"నిశ్చయంగా వీరి గాథలలో వివేకవంతుల కొరకు గుణపాఠం ఉంది." ఖుర్ఆన్ 12:111

## అంతిమ తీర్పుదినం గురించి జ్ఞాపకం చేస్తున్నది

ప్రతి ఒక్కరూ చావు రుచి చూడవలసిందేనని మరియు వారు మాట్లాడే మాటలకు మరియు చేసే పనులకు వారే బాధ్యత వహించవలసి ఉందని ఈ పవిత్ర గ్రంథం మనకు గుర్తు చేస్తున్నది:

"మేము తీర్పుదినాన న్యాయంగా తూచే త్రాసులను నెలకొల్పుతాము. మరి ఏ ప్రాణికీ రవ్వంత అన్యాయం కూడా జరుగదు. ..." ఖుర్ఆన్ 21:47

## మానవ జీవిత లక్ష్యాన్ని సాధించడం :

ముఖ్యంగా, మానవ జీవిత అసలు ఉద్దేశ్యం కేవలం సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించడమని మరియు ఆయన నిర్దేశించినట్లుగా జీవించడమని ఖుర్ఆన్ గ్రంథం బోధిస్తున్నది. ఇస్లాం ధర్మంలో, ఆరాధన అనేది ఒక సమగ్రహమైన పదం – దీనిలో అల్లాహ్ ఇష్టపడే, మెచ్చుకునే (రహస్యమైన మరియు బహిరంగమైన) అన్ని ఆలోచనలు, పలుకులు మరియు ఆచరణలు ఇమిడి ఉన్నాయి. కాబట్టి, అల్లాహ్ ఆజ్ఞలు ఆచరించడం ద్వారా ఒక ముస్లిం అల్లాహ్ ను ఆరాధిస్తున్నాడు మరియు తన జీవిత ఉద్దేశ్యాన్ని పూర్తి చేస్తున్నాడు. ఖుర్ఆన్ లో ఆరాధనల గురించి పేర్కొనబడిన కొన్ని ఉదాహరణలు:

## నమాజు (సలాహ్):

"ఓ విశ్వాసులారా ! రుకూ, సజ్దాలు చేస్తూ ఉండండి. మీ ప్రభువును ఆరాధిస్తూ ఉండండి. మంచి పనులు చేస్తూ ఉండండి. తద్వారా మీరు సఫలీకృతులవుతారు." ఖుర్ఆన్ 22:77

## దానధర్మాలు :

"... (దైవమార్గంలో) ఖర్చు చేస్తూ ఉండండి. ఇది స్వయంగా మీకే శ్రేయస్కరం. ఎవరైతే తమ ఆత్మ లోభత్వం నుండి రక్షించబడ్డారో, వారే సాఫల్య భాగ్యం పొందినవారు." ఖుర్ఆన్ 64:16

## నిజాయితీ:

"సత్యాన్ని అసత్యంతో కలిపి కలగా పులగం చేయకండి. తెలిసి కూడా సత్యాన్ని కప్పి పుచ్చకండి." ఖుర్ఆన్ 2:42

## నిరాడంబరం, నమ్రత, సచ్ఛీలత:

"విశ్వాస పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, వారు తమ మర్మస్థానాలను కాపాడుకోవాలనీ, అది వారి కొరకు పవిత్రమైనదని వారితో చెప్పు. వారు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు. విశ్వాస మహిళలు కూడా తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మస్థానాలను రక్షించుకోవాలనీ, బహిర్గతమై ఉన్నది తప్ప, తమ అలంకరణలను బహిర్గతం చేయరాదనీ, తమ వక్షస్థలాలపై పరదా వేసుకోవాలని తమ భర్త లేక తండ్రి లేక తమ మామగారు లేక తమ కొడుకులు లేక తమ భర్త కొడుకులు లేక తమ సోదరులు లేక తమ సోదరుల కుమారులు లేదా తమ అక్కచెల్లెళ్ళ కుమారులు లేక తమతో కలిసి మెలిసి ఉండే మహిళలు లేక తమ బానిసలు లేక ఇతరత్రా ఉద్దేశాలు లేకుండా తమకు లోబడి ఉన్న పురుష సేవకులు లేక స్త్రీల గుప్త విషయాల గురించి ఇంకా తెలియని బాలురు – వీళ్ళ ఎదుట తప్ప ఇతరుల ఎదుట తమ అలంకరణలను కనబడనివ్వకూడదనీ, దాగి వున్న తమ అలంకరణ ఇతరులకు తెలిసి పోయేలా తమ కాళ్ళను నేలపై కొడుతూ నడవరాదని వారితో చెప్పు." ఖుర్ఆన 24:30-31

## కృతజ్ఞతా భావం:

"అల్లాహ్ మిమ్ముల్ని మీ మాతృగర్భాల నుండి మీకేమీ తెలీని స్థితిలో బయటికి తీశాడు. మీ కొరకు చెవులను, కళ్ళను, హృదయాలను తయారు చేసింది ఆయనే – మీరు కృతజ్ఞులుగా వ్యవహరిస్తారని." ఖుర్ఆన్ 16:78

**న్యాయం:**

"ఓ విశ్వసించిన వారలారా! మీరు న్యాయం విషయంలో గట్టిగా నిలబడండి. అల్లాహ్ ప్రసన్నత నిమిత్తం సాక్ష్యులుగా ఉండండి – అది మీ స్వయానికి, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు వ్యతిరేకంగా పరిణమించినా సరే. ధనికుడయినా, పేదవాడయినా సరే...." ఖర్ఆన్ 4:135

**సహనం, ఓర్పు:**

"నీవు సహనంతో మసలుకో. నిశ్చయంగా సద్వర్తనుల పుణ్యఫలాన్ని అల్లాహ్ వృథా కానివ్వడు." ఖుర్ఆన్ 11:115

**మంచితనం :**

"విశ్వసించి, మంచి పనులు చేసిన వారికి గొప్ప మన్నింపుతో పాటు గొప్ప ప్రతిఫలం కూడా ఉందని అల్లాహ్ వాగ్దానం చేశాడు." ఖుర్ఆన్ 5:9

చివరి మాటగా, ఎలా ఏకైక నిజదైవాన్ని ఆరాధించాలో ఖుర్ఆన్ మానవజాతికి బోధిస్తున్నది. తద్వారా వారు తమ జీవిత అసలు ఉద్దేశ్యాన్ని గుర్తించి, దానిని మంచిగా పూర్తి చేయగలరు మరియు ఇహపర లోకాలలో సాఫల్యం పొందవచ్చు.

"(ఓ ముహమ్మద్) జనుల కోసం మేము ఈ గ్రంథాన్ని సత్యబద్ధంగా నీ వద్దకు పంపాము. కాబట్టి, ఎవరైనా దారికి వస్తే, అతను తన స్వయానికే మేలు చేసుకున్నాడు. మరెవరైనా దారి తప్పితే, ఆ పెడదారి అతని మీదే పడుతుంది. నీవు వారికి బాధ్యుడు కావు." ఖుర్ఆన్ 39:41. మరి ఇప్పటికైనా ఈ దివ్య ఖుర్ఆన్ ను కనీసం ఒక్కసారైనా చదవాలని మీకు అనిపించడం లేదా ?

# 9. ఇస్లాం ధర్మంలో ప్రవక్తత్వం

సర్వలోకాలను మరియు వాటిలోని ప్రతిదాన్నీ సృష్టించిన అల్లాహ్ మానవులను ఒక ఉత్తమ ఉద్దేశ్యంతో సృష్టించినాడు: అదేమిటంటే 'కేవలం ఆయనను మాత్రమే ఆరాధించాలి మరియు ఆయన యొక్క దివ్య బోధనలు మరియు మార్గదర్శకత్వాన్ని అనుసరించి సద్గుణాలతో కూడిన నైతిక జీవితం గడపాలి'. మరి, మానవులు ఆయన నుండి స్పష్టమైన మార్గదర్శకత్వం పొంద కుండా దీనిని పూర్తి చేయలేరు కదా! అంతేగాక, అత్యంత దయామయుడు మరియు న్యాయవంతుడైన అల్లాహ్ ఏ లక్ష్యం లేకుండా భూమిపై ఎలా పడితే అలా జీవించమని మనల్ని వదిలివేయలేదు. అందుకనే అల్లాహ్ మన జీవిత ఉద్దేశ్యాన్ని మనకు తెలిపేందుకు సమాజంలో నుండి కొందరు పుణ్య పురుషులను ఎంచకుని, వారిపై తన దైవవాణి అవతరింపజేసినాడు. దానిని స్వయంగా ఆచరించి మానవాళికి చూపమని వారిని ఆదేశించాడు. ఆ పుణ్యపురుషులనే ప్రవక్తలు అంటారు, వారిలో కొందరి పేర్లు – ఆదమ్, నూహ్, అబ్రహామ్, మోసెస్, జీసస్ అలైహిస్సలాం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

## ప్రవక్తల ప్రత్యేక లక్షణాలు

ప్రవక్తలందరు కొన్ని కామన్ లక్షణాలు కలిగి ఉండేవారు. వాటి ద్వారా వారి కాలంలోని మానవులలో ప్రవక్తలు అసాధారణమైన వారిగా గుర్తించబడినారు.

## ప్రవక్తలకు దివ్యవాణి పంపబడేది

సామాన్య మానవుడికి మరియు ప్రవక్తకు మధ్య గల ముఖ్యమైన భేదం ఏమిటంటే ప్రవక్తపై అల్లాహ్ నుండి దివ్యసందేశం అవతరిస్తుంది.

## ప్రవక్తలు ఉత్తమ లక్షణాలు కలిగి ఉండేవారు

ప్రవక్తలు సంపద, హోదా, అధికారం మొదలైన వ్యక్తిగత ప్రయోజనాలు పొందాలని ఎంతమాత్రమూ ప్రయత్నించేవారు కాదు. కేవలం అల్లాహ్ ఆమోదం మరియు ప్రసన్నత పొందాలని మాత్రమే చూసేవారు.

స్వభావం మరియు సద్గుణాలలో ప్రవక్తలను వారి ప్రజలు ఉత్తములుగా గుర్తించేవారు. వారు ఉత్తమ నైతిక ప్రవర్తన కలిగి ఉండి, ఎల్లప్పుడూ తమ పలుకులలో మరియు ఆచరణలలో సత్యవంతులుగా ఉండేవారు. అందువలన, ఇతర ధర్మాల ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్నట్లుగా ప్రవక్తలు కూడా ఘోరపాపాలకు పాల్బడవచ్చనే అసత్య వాదనను ముస్లింలు పూర్తిగా తిరస్కరిస్తారు.

## ప్రవక్తలు కొన్ని మహిమలు మరియు అద్భుతాలు ప్రదర్శించారు

అనేక మంది ప్రవక్తలు వారి ప్రజలు నైపుణ్యం పొందిన రంగంలోనే మహిమలు, అద్భుతాలు ప్రదర్శించారు. ఉదాహరణకు, ప్రవక్త మోసెస్ అలైహిస్సలాం కాలపు ప్రజలు మ్యాజిక్ అంటే ఇంద్రజాలంలో ప్రసిద్ధి చెందారు. కాబట్టి, అల్లాహ్ ఆజ్ఞతో ప్రవక్త మోసెస్ అలైహిస్సలాం ప్రదర్శించిన ఇంద్రజాల అద్భుతాలను ఆ తాంత్రికులు చేయలేక పోయారు. ప్రవక్త జీసస్ అలైహిస్సలాం మెడిసిన్ లో తన ప్రజలందరినీ మించి పోయారు. తద్వారా, తన ప్రజలలోని సుప్రసిద్ధ వైద్యులు చికిత్స చేయలేని వ్యాధులను కూడా ఆయన అల్లాహ్ ఆజ్ఞతో అద్భుతంగా నయం చేయగలిగినారు. అలాగే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలు అరబీ కవిత్వంలో ప్రసిద్ధి చెందినారు. కాబట్టి ఏ కవీ పోటి పడలేనంత అత్యుత్తమ సాహిత్యంతో ఆయనపై ఖుర్ఆన్ దివ్యగ్రంథం అవతరించింది. ఇంకా, అనేక మంది ప్రవక్తలు జరగబోయే సంఘటనల గురించి సత్యమైన భవిష్యవాణులు వినిపించారు. ఈ మహిమలు, అద్భుతాలన్నీ అల్లాహ్ అనుజ్ఞతో మాత్రమే జరిగాయి. తద్వారా వారు కూడా మానవులే గానీ వారికి దైవత్వంలో ఎలాంటి భాగస్వామ్యం లేదని నిరూపించబడింది.

## ప్రవక్తలు దేవుళ్ళు కాదు, వారికి దైవత్వంలో ఎలాంటి భాగస్వామ్యం లేదు.

ప్రవక్తలను వారి ప్రజలలో నుండి స్వయంగా అల్లాహ్ ఎంచుకున్నాడు. వారిలో ఎలాంటి దైవత్వమూ లేదు. వారిలో ఆరాధింపబడటానికి కావలసిన అర్హతలు, యోగ్యతలు లేవు. ఇలా ప్రకటించమని అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఆదేశించబడింది, "నేను కూడా మీవంటి మానవుడిని మాత్రమే. మీ ప్రభువు ఏకైకుడని నాకు దివ్యవాణి ద్వారా తెలుపబడింది." ఖుర్ఆన్ 18:110

ప్రవక్తలు దేవుళ్ళు కారని, వారు కూడా ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ నే ఆరాధించేవారని మరియు అల్లాహ్ కే సాష్టాంగపడేవారని పాతనిబంధనలు మరియు కొత్తనిబంధనలు రెండింటి ద్వారా బైబిల్ లో స్పష్టంగా పేర్కొనబడింది.

"మరియు ఆయన (జీసస్) కొంచెం ముందుకు పోయి, సాగిలపడి, ప్రార్థించెను ..." మత్తయి సువార్త 26:39

"అపుడు వారు (మోసె, అహరోహనులు) సాగిలపడి, సమస్త శరీరాత్మలకు దేవుడమైన దేవా, యీ యొక్కడు పాపము చేసినందున సమస్త సమాజము మీద నీవు కోపపడుదువా? అని వేడుకొనిరి" సంఖ్యాకాండము 16:22

"అబ్రాము సాగిలబడియుండగా, దేవుడతనితో మాట్లాడి ...." ఆదికాండం 17:3

## ప్రవక్తలు ఆవశ్యకమైన అర్హతలు కలిగి ఉండేవారు

వారికి అప్పజెప్పబడిన మిషన్ ను విజయవంతంగా పూర్తిచేసేందుకు అల్లాహ్ ప్రవక్తలందరికీ నిలకడ, ధైర్యసాహసాలు, నాయకత్వం, సహనం మరియు వివేకం మొదలైన కొన్ని ప్రత్యేక లక్షణాలు ప్రసాదించాడు.

### కొన్ని ఉదాహరణలు :

- కేవలం కొద్దిమంది మాత్రమే తన పిలుపు స్వీకరించినా, అధైర్యపడకుండా నిరంతరం తన ప్రజలను అల్లాహ్ వైపు పిలిచిన నూహ్ అలైహిస్సలాం యొక్క చలించని నిలకడతనం.
- అసత్య విశ్వాసాల విషయంలో పిన్నవయసులోనే ఒంటరిగా తన మొత్తం సమాజాన్ని ఎదుర్కొన్న ఇబ్రాహీమ్ అలైహిస్సలాం యొక్క గొప్ప ధైర్యసాహసాలు.
- తన కాలపు అత్యంత దౌర్జన్యపరుడు, క్రూరుడైన ఫిరౌను చక్రవర్తి బారి నుండి ప్రజలను కాపాడిన మూసా అలైహిస్సలాం యొక్క సాటిలేని నాయకత్వం.
- తన ప్రజలు పెట్టిన కష్టాలను మరియు హింసలను ఎంతో ఓర్పుతో సహించిన జీసస్ అలైహిస్సలాం యొక్క గొప్ప సహనశక్తి.
- ఎల్లప్పుడూ పరస్పర యుద్ధాల సుదీర్ఘ చరిత్ర కలిగి ఉండిన అరేబియా ద్వీపకల్పంలోని అనేక ప్రత్యర్థి తెగలను విజయవంతంగా ఒకే త్రాటిపై తీసుకు వచ్చి, ఒక ప్రశాంత సమాజాన్ని స్థాపించిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క గొప్ప వివేకం.

### ప్రవక్తల సందేశం

"వాస్తవానికి మేము ప్రతి సమాజం వారి వద్దకు ఒక ప్రవక్తను పంపాము (ఆయన ఇలా ప్రకటించాడు): 'మీరు అల్లాహ్ ను మాత్రమే ఆరాధించండి మరియు మిథ్యాదైవాల ఆరాధనను త్యజించండి.' ఖుర్ఆన్ 16:36

మొత్తం ప్రవక్తలందరినీ ఏకైక నిజ ఆరాధ్యుడైన అల్లాహ్ యే పంపడం వలన, వారందరూ ఒకే సందేశాన్ని అందజేసారు. ఇంకా, జీవిత ఉద్దేశ్యాన్ని తమ ప్రజలకు జ్ఞాపకం చేసే ఒకే మిషన్ కొరకు పనిచేసినారు.

**వారి ఆ దివ్యసందేశం మరియు మిషన్ ఏమిటంటే :**

- నిజమైన దైవభావన గురించి స్పష్టం చేయడం మరియు అసత్య విశ్వాసాలను తిరస్కరించడం.
- నిజమైన జీవిత ఉద్దేశ్యాన్ని బోధించడం.
- అల్లాహ్ ను ఎలా ఆరాధించాలో స్వయంగా ఆచరించి చూపడం.
- ప్రజలకు సుద్గుణ మరియు దుర్గుణ అంటే మంచి - చెడు స్వభావం గురించి అల్లాహ్ యొక్క నిర్వచనాన్ని అందజేయడం మరియు దాని గురించి ప్రజలకు ఉత్తమ సలహాలు ఇవ్వడం.
- అల్లాహ్ కు విధేయత చూపడం వలన లభించే మంచి ప్రతిఫలం (స్వర్గం) గురించి వివరించడం మరియు అల్లాహ్ కు అవిధేయత చూపడం వలన ఎదుర్కోబోయే కఠిన శిక్షల (నరకం) గురించి హెచ్చరించడం.
- ఆత్మ, దైవదూతలు మరియు దయ్యాలు, పరలోక జీవితం మరియు విధివ్రాత మొదలైన విషయాలలోని అపార్థాలను దూరం చేయడం.

"మరియు మేము ప్రతి ప్రవక్తను అతని జాతి వారి భాషలోనే పంపాము. అతను వారికి స్పష్టంగా బోధించటానికి ..." ఖుర్ఆన్ 14:4

మొత్తం ప్రవక్తలందరు అసలు దైవభావన గురించి స్పష్టం చేయడంపైనే ముఖ్యంగా దృష్టి కేంద్రీకరించేవారు: ఎవ్వరూ ఆయనకు సాటి లేరు, భాగస్వాములు లేరు, సమానులు లేరు. అరాధనలన్నీ కేవలం ఆయనకు మాత్రమే చెందుతాయి. ప్రవక్తలు ఈ సందేశాన్నే అందజేసారనే ఉపమానాలు ఖుర్ఆన్ లో ఎన్నో ఉన్నాయి:

ప్రవక్త నూహ్ అలైహిస్సలాం ఇలా పిలిచారు,

"ఓ నా ప్రజలారా! అల్లాహ్ నే ఆరాధించండి! ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యదైవం లేడు." [ఖుర్ఆన్ 7:59]

ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాం ఇలా పిలిచారు,

"మీరు అల్లాహ్ ను వదలి, మీకెలాంటి లాభం గానీ నష్టం గానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తారా?" [ఖుర్ఆన్ 21:66]

ప్రవక్త మూసా అలైహిస్సలాం ఇలా పిలిచారు,

"ఏమీ! నేను అల్లాహ్ ను వదలి మరొక ఆరాధ్య దైవాన్ని మీ కొరకు అన్వేషించాలా ? వాస్తవానికి ఆయనే సర్వలోకాల వారిపై మీకు ఘనతను ప్రసాదించాడు" [ఖుర్ఆన్ 7:140]

ప్రవక్త జీసస్ అలైహిస్సలాం ఇలా పిలిచారు,

"నిశ్చయంగా అల్లాహ్ నా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను. కావును మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గం." [ఖుర్ఆన్ 3:51]

అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికినారు,

"నిశ్చయంగా మీ ఆరాధ్యుడు ఆ ఏకైక దైవం (అల్లాహ్) మాత్రమే నని నాపై దివ్యవాణి అవతరింపజేయబడింది. కాబట్టి తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి. మరియు ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ భాగస్వాములుగా కల్పించుకోరాదు." [ఖుర్ఆన్ 18:110]

ఇదే సందేశం తరతరాలుగా ఇవ్వబడింది. మరియు సృష్టికర్త పై సరైన దైవవిశ్వాసం కలిగి ఉండవలసిన ప్రాధాన్యత గురించి నొక్కి చెప్పబడింది.

## అల్లాహ్ ప్రతి జాతి కొరకు ఒక ప్రవక్తను పంపినాడు

"మరియు ప్రతి సమాజానికి ఒక ప్రవక్త (పంపబడ్డాడు)." ఖుర్ఆన్ 10:47

అల్లాహ్ మానవజాతిపై దయజూపుతూ వారి మార్గదర్శకత్వం కోసం నియమిత కాలములలో వేల కొలది ప్రవక్తలను, అంటే ప్రతి జాతి కొరకు కనీసం ఒక ప్రవక్తను పంపినాడని ముస్లింలు నమ్ముతారు. కాలక్రమంలో ప్రజలు ప్రవక్తల సందేశాన్ని పోగొట్టుకున్నారు, కలుషితం చేసినారు, మర్చిపోయారు, నిర్లక్ష్యం చేసారు, తిరస్కరించారు. ఇలాంటి కొన్ని కారణాల వలన అల్లాహ్ సందేశాన్ని మరలా అందజేయడానికి మరో కొత్త ప్రవక్తను పంపవలసి వచ్చేది.

అల్లాహ్ పంపిన ప్రతి ప్రవక్తను ముస్లింలు విశ్వసిస్తారు మరియు గౌరవిస్తారు. అలాగే, ప్రవక్తలపై అవతరింపజేయబడిన అసలు దివ్యగ్రంథా లన్నింటినీ ముస్లింలు విశ్వసిస్తారు. కానీ, నేడు ఖుర్ఆన్ తప్ప, ఈ దివ్యగ్రంథాలేవీ వాటి అసలు అవతరించిన రూపంలో మార్పులు చేర్పులు లేకుండా స్వచ్ఛంగా మిగిలి లేవు.

"ఆయన సత్యమైన ఈ దివ్యగ్రంథాన్ని నీపై అవతరింపజేసాడు. ఇది పూర్వం అవతరింపజేయబడిన గ్రంథాలలోని (మిగిలి ఉన్న) సత్యాన్ని ధృవీకరిస్తుంది. ఇంకా ఆయనే తౌరాత్ మరియు ఇంజీలును అవతరింపజేసాడు" ఖుర్ఆన్ 3:3

## ఎందుకు మనలోని ప్రతి ఒక్కరూ తిన్నగా సృష్టికర్త నుండి దివ్యవాణి అందుకోలేరు?

అల్లాహ్ మనల్ని సృష్టించాడు. మనస్పూర్తిగా ఆయన చూపిన సన్మార్గాన్ని ఎవరు అనుసరిస్తారో మరియు ఎవరు తిరస్కరిస్తారో పరీక్షించేందుకు మానవులకు తగినంత స్వేచ్ఛను మరియు వివేకాన్ని ప్రసాదించాడు. ఒకవేళ ప్రతి ఒక్కరూ తిన్నగా దివ్యసందేశం అందుకుంటే, జీవితం ఒక నిజమైన విశ్వాస పరీక్షగా మారదు. ఒకరి విశ్వాసం యొక్క నిజమైన పరీక్ష ఏమిటంటే, తమ వివేకాన్ని మరియు హేతువాదాన్ని (లాజిక్) ఉపయోగించి, అల్లాహ్ యొక్క చిహ్నాల గురించి ఆలోచించడం మరియు వాటిని గుర్తించడం. అంతేగానీ తిన్నగా అల్లాహ్ తో మాట్లాడటం కాదు. అలా అల్లాహ్ తో

మాట్లాడి, విశ్వసించడంలో ఎలాంటి శ్రమ ఉండదు మరియు అది దైవవిశ్వాసాన్ని అర్థం పర్థం లేకుండా చేస్తుంది.

ప్రవక్తలు తిన్నగా అల్లాహ్ నుండే దివ్యసందేశాన్ని అందుకున్నా, ప్రాపంచిక జీవిత పరీక్షల నుండి వారికి మినహాయింపు లభించలేదు. ఎందుకంటే ప్రవక్తత్వం తనతో పాటు ఎన్నో కష్టాలను మరియు తీవ్ర విమర్శలను తెచ్చి, వారి జీవితాల్ని కఠిన పరీక్షలకు గురి చేసింది.

## అంతిమ ప్రవక్త

నిర్ణీత సమాజాల కొరకు ప్రవక్తలు పంపబడినారు. ప్రజలు కాలక్రమంలో ఆ ప్రవక్తలు అందజేసిన దివ్యసందేశాన్ని పోగొట్టుకున్నారు లేదా కలుషితం చేసివేసారు. కానీ, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణీత సమాజాల కోసం పంపబడలేదు. ఆయన మొత్తం మానవజాతి కోసం పంపబడినారు. ఆయన అందజేసిన దివ్యసందేశం ఖుర్ఆన్ మరియు సున్నతుల రూపంలో పదిలంగా భద్రం పరచబడింది మరియు సులభంగా అందరికీ అందుబాటులో ఉన్నది. అందువలన మరో ప్రవక్త పంపబడవలసిన అవసరం లేదు.

- ఖుర్ఆన్ అంటే అల్లాహ్ వాక్కు. ఎలాంటి మార్పులు చేర్పులకు, లోపాలకు, పరస్పర వైరుధ్యాలకు అతీతంగా ఉన్నది. అది “మానవుల కొరకు మార్గదర్శకత్వం వహించే … (తప్పు ఒప్పులను) వేరు చేసే” దివ్యగ్రంథం. ఖుర్ఆన్ 2:185
- సున్నతులు అంటే ఆయన సహచరులు మరియు వారి శిష్యులు ప్రామాణికంగా నమోదు చేసిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఉపదేశాలు మరియు ఆచరణలు. ప్రామాణికంగా నమోదు చేయబడిన ఈ వేల కొలది సున్నతుల వలన ప్రతి ఒక్కరూ ప్రవక్త

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను సరిగ్గా అనుసరించడం సులభమైంది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన దివ్యసందేశం పూర్వ ప్రవక్తల దివ్యసందేశాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నది మరియు వాటిని పున: ధృవీకరిస్తున్నది.

వర్తమాన మరియు భవిష్య తరాలతో సహా ఆయన కాలం నుండి చిట్టచివరి దినం వరకు మొత్తం మానవాళి కొరకు పంపబడిన అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. నిజాయితీ, న్యాయం, కరుణ, దయ, సత్యత మరియు ధైర్యసాహసాలకు ఆయన సాటిలేని పరిపూర్ణ ఉపమానం. పూర్వ ప్రవక్తల వలే, ఆయనలో కూడా ఎలాంటి చెడు స్వభావం లేదు మరియు కేవలం అల్లాహ్ కోసమే ఆయన చిత్తశుద్ధితో శ్రమించినారు.

చివరిగా "వాస్తవానికి అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది. వారి కొరకు ఎవరైతే అల్లాహ్ మరియు అంతిమదినాన్ని ఆశిస్తారో మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తారో." ఖుర్ఆన్ 33:21

అల్లాహ్ యొక్క దివ్యసందేశాన్ని ప్రజలకు అందజేసేందుకు మరియు వారెలా సన్మార్గంపై జీవించాలో బోధించేందుకు తన కారుణ్యానికి ఒక మచ్చు తునకగా అల్లాహ్ ప్రవక్తలను పంపినాడు. ప్రవక్తలు వారి ప్రజలలో ఉత్తమ గుణగణాలు కలిగి ఉండేవారు. ప్రజలు వారిని అనుసరించేవారు మరియు వారికి విధేయత చూపేవారు. ప్రవక్తను అనుసరించడం అంటే అల్లాహ్ కు విధేయత చూపినట్లే. అలాగే తిరస్కరించడమంటే అల్లాహ్ కు అవిధేయత చూపినట్లవుతుంది. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త మరియు సందేశహరుడు. ఆయనను పంపడంతో అల్లాహ్ మార్గదర్శకత్వం పరిపూర్ణమై పోయింది, అల్లాహ్ కు మరియు అంతిమ ప్రవక్తకు విధేయత చూపడం ద్వారా నరకాగ్ని నుండి విముక్తి లభిస్తుంది.

# 10. ఇస్లాం ధర్మం యొక్క ఐదు మూలస్థంభాలు

పటిష్టంగా, కలకాలం బలంగా నిలబడి ఉండాలంటే ప్రతి మంచి కట్టడం దృఢమైన పునాదిపై నిర్మించబడవలసి ఉంటుంది. కాబట్టి ఇస్లాం ధర్మం యొక్క దృఢమైన పునాది దాని ఐదు మూలసిద్ధాంతాలపై నిర్మించబడింది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించినట్లు అది ఇస్లామీయ బోధనల మూలాధారంగా మారింది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు:

ఇస్లాం ధర్మ పునాది ఐదింటిపై నిర్మించబడింది:

1. సాక్ష్య ప్రకటన (షహాదహ్);
2. నిర్ణీత సమయంలో నమాజు చేయుట (సలాహ్);
3. విధిదానం చెల్లించుట (జకాతు చెల్లించుట);
4. రమదాన్ నెలలో ఉపవాసం పాటించుట (సామ్);
5. మక్కా యాత్ర చేయుట (హజ్).

ఈ ఐదు మూలస్థంభాలు ఒక ముస్లిం జీవితం యొక్క పునాది రాళ్ళ వంటివి.

## 1. సాక్ష్య ప్రకటన – షహాదహ్

అష్ హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్ హదు అన్న ముహమ్మద్ రసూలుల్లాహ్ అంటే నేను సాక్ష్యమిస్తున్నాను అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని మరియు నేను సాక్ష్యమిస్తున్నాను ముహమ్మద్ అల్లాహ్ యొక్క ప్రవక్త అనీ. దీనినే షహాదహ్ అంటే సాక్ష్యప్రకటన లేక విశ్వాస ప్రకటన అంటారు. ఇది మనస్ఫూర్తిగా చిత్తశుద్ధి మరియు దృఢనిశ్చయంతో స్వచ్ఛందంగా ఉచ్ఛరించ బడాలి.

**సాక్ష్యప్రకటనలోని మొదటి భాగం క్రింది విషయాల గురించి స్పష్టం చేస్తున్నది:**

- ఎవ్వరూ లేక ఏదీ ఆరాధింపబడే హక్కులు కలిగి లేదు. కేవలం ఒక్క అల్లాహ్ మాత్రమే ఆరాధింపబడే హక్కులు కలిగి ఉన్నాడు. అల్లాహ్ అనే అరబీ పదం సర్వమానవాళి మరియు సర్వలోకాల ఏకైక ఆరాధ్యుడిని సూచిస్తున్నది.
- కేవలం అల్లాహ్ మాత్రమే సర్వలోకాల సృష్టికర్త మరియు పోషకుడు. కేవలం ఆయన మాత్రమే సకల లోకాలపై సర్వాధికారాలు కలిగి ఉన్న సర్వశక్తిమంతుడు.
- కేవలం అల్లాహ్ మాత్రమే సంపూర్ణమైన దివ్యలక్షణాలు కలిగి ఉన్నాడు. కేవలం ఆయన మాత్రమే అన్నిరకాల లోపాలు మరియు కొరతలకు అతీతుడు.
- అల్లాహ్ కు ఎలాంటి భాగస్వాములు లేరు, ఎవ్వరూ సాటి లేరు, తల్లిదండ్రులు లేరు మరియు సంతానం లేదు.

సాక్ష్యప్రకటనలోని రెండో భాగం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క దాసుడు మరియు అంతిమ ప్రవక్త, సందేశహరుడు అని తెలుపుతున్నది. కేవలం అల్లాహ్ కు మాత్రమే విధేయత చూపమని మరియు ఆరాధించమని ప్రజలను ఆహ్వానించేందుకు పంపబడిన ప్రవక్తల పరంపరలో ఆయన అంతిమ ప్రవక్త. ఆ ప్రవక్తల పరంపరలోని కొందరు ప్రవక్తల పేర్లు – ఆదం, నూహ్, అబ్రహామ్, ఇస్మాయీల్, ఇస్హాక్, జాకోబు, జోసెఫ్, మోసెస్, డేవిడ్, సోలోమాన్ మరియు జీసస్ అలైహిస్సలాం.

ప్రజలకు అల్లాహ్ యొక్క దివ్యసందేశం బోధించేందుకు మరియు ప్రజలందరికీ ఒక ఆచరణాత్మకమైన ఉపమానాన్ని చూపేందుకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు ఖుర్ఆన్ గ్రంథం పంపబడింది.

### సాక్ష్యప్రకటన చేయడం వలన కలిగే కొన్ని ప్రయోజనాలు:

- సర్వలోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ అభీష్టానికి పూర్తిగా సమర్పించుకోవడం మరియు అల్లాహ్ యొక్క నిజమైన దాసుడిగా మారడం
- అత్యంత ఉన్నత స్థాయిలో ఆత్మగౌరవం మరియు ఆత్మవిశ్వాసం పొందినా అణుకువతో మరియు మధ్యేమార్గంలో జీవించడం.
- దృఢసంకల్పం, సహనం మరియు పట్టుదల మొదలైన మంచి గుణాలు అలవర్చుకునేలా ప్రోత్సహిస్తూ, మనిషిలో ధైర్యసాహసాలు నింపి అతడిని ఒక బాధ్యతాపరుడిగా, సజ్జనుడిగా మార్చుతుంది.
- అల్లాహ్ యొక్క ఆదేశాలను నిర్లక్ష్యం చేయకుండా, వాటికి విధేయత చూపేలా ప్రోత్సహిస్తుంది.

## 2. నమాజు – సలాహ్

"నిశ్చయంగా, నేనే అల్లాహ్ ను! నేను తప్ప, ఆరాధింపబడే అర్హుతలు గలవారెవ్వరూ లేరు. కాబట్టి నన్నే ఆరాధించండి. నన్ను జ్ఞాపకం చేసుకునేందుకు నమాజు చేయండి." ఖుర్ఆన్ 20:14

ఒక ముస్లిం జీవితంలో రోజువారీ ఐదు పూటల నమాజులు చాలా ముఖ్యమైన ఆరాధనలు; ప్రాత:కాలం, మధ్యాహ్నం, సాయంత్రం, సూర్యాస్తమయం మరియు రాత్రి సమయాలలో నమాజు చేయవలసి ఉన్నది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు: *"నమాజు (ఇస్లామీయ) ధర్మం యొక్క మూలస్థంభం. ఎవరైతే దానిని స్థాపిస్తారో, వారు ధర్మాన్ని స్థాపిస్తారు. మరియు ఎవరైతే దానిని వదిలి వేస్తారో, వారు ధర్మాన్ని వదిలి వేసినట్లే (నిర్లక్ష్యం చేసినట్లే)."*

విశ్వాసం, ప్రేమ, ఆశ మరియు గౌరవాభిమానాల ఆధారంగా ముస్లింకు మరియు అతడి సృష్టికర్తకు మధ్య నమాజు ఒక వ్యక్తిగత మరియు అధ్యాత్మిక సంబంధాన్ని స్థాపిస్తుంది. పూర్తి ఏకాగ్రత,అణుకువ, వినమ్రత మరియు

చిత్తశుద్ధితో సరిగ్గా నమాజు చేసినట్లయితే, అది ఆ వ్యక్తిపై అద్భుతమైన శాశ్వత ప్రభావం చూపుతుంది. అతడి హృదయంలో సంతృప్తి మరియు శాంతి నింపుతుంది, అల్లాహ్ సమీపానికి చేర్చుతుంది.

నమాజు అనేది ఒక ముస్లిం జీవితం యొక్క కేంద్ర బిందువు. అల్లాహ్ కు సమర్పించుకునే అత్యుత్తమమైన మార్గం. పరిశుభ్రంగా ఉన్న ఏ ప్రాంతంలోనైనా నమాజు చేసుకోవచ్చు: అది పొలం కావచ్చు, ఆఫీసు కావచ్చు, కర్మాగారం కావచ్చు లేదా యూనివర్శిటీ కావచ్చు; కొన్ని నిమిషాలలో నమాజు పూర్తి చేయవచ్చు. అందులో ఖుర్ఆన్ పఠనం ఉన్నది. అంతేగాక వివిధ భంగిమలలో అంటే నిలుచొని, వంగుని, సాష్టాంగపడి, కూర్చొని అల్లాహ్ ను వేడుకోవడం మరియు ప్రశంసించడం కూడా ఉన్నది. నమాజు ద్వారా ముస్లింలు తమ సృష్టికర్త అయిన అల్లాహ్ ఘనతను జ్ఞాపకం చేసుకుంటారు. తన కోరికలు మరియు అవసరాలు తీర్చమని ఆయనను వేడుకుంటారు.

మాటిమాటికీ అల్లాహ్ ముందు అణుకువతో విధేయత ప్రకటించడం వలన చెడుపనులు, పాపకార్యాల నుండి దూరంగా ఉంటారు. ఖుర్ఆన్ లో తెలిపినట్లు ఇదొక రకమైన ఆత్మప్రక్షాళణ: "నిజంగా, సిగ్గుమాలిన పనులు మరియు చెడుపనుల నుండి నమాజు నిరోధిస్తుంది." ఖుర్ఆన్ 29:45. చేసిన పాపాలకు పశ్చాత్తాప పడుతూ, అల్లాహ్ నుండి క్షమాభిక్ష అర్థించే ఒక అవకాశాన్ని నమాజు కల్పిస్తుంది.

ఒకసారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులను ఇలా ప్రశ్నించారు, "ఒకవేళ ఎవరైనా తన ఇంటి గడప ముందు నుండి ప్రవహించే నది కలిగి ఉండి, అందులో అతడు ప్రతిరోజూ ఐదు సార్లు స్నానం చేస్తున్నట్లయితే, అతడిపై ఏమైనా మురికి మిగిలి ఉంటుందా?" దానికి వారు "లేదు." అని జవాబిచ్చారు. అపుడు ఆయనిలా పలికారు, "అదే విధంగా, ప్రతిరోజు చేసే ఐదు పూట్ల నమాజుల ద్వారా అల్లాహ్ మన పాపాలను తుడిచి వేస్తాడు."

## 3. నిర్ణీత విధిదానం – జకాతు

"ఎవరైతే నమాజులు చేస్తారో మరియు జకాతు చెల్లిస్తారో, ... అలాంటి వారే సాఫల్యవంతులవుతారు." ఖుర్ఆన్ 31:4-5

ధనసంపదలతో పాటు ప్రతిదీ అల్లాహ్ కే చెందును. మనకు ప్రసాదించబడే ధనసంపదలు అల్లాహ్ యొక్క అమానతులు. నిర్ణీత స్థాయికి చేరిన మిగులు సంపదపై ప్రతి ముస్లిం తప్పనిసరిగా నిర్ణీత విధిదానం అంటే జకాతు చెల్లించవలసి ఉన్నది. (e.g. యుక్తవయస్సుకు చేరిన, మతిస్థిమితం కలిగి ఉన్నవారు ఒకవేళ నిర్ణీత స్థాయి దాటి మిగులు సంపద కలిగి ఉంటే). ప్రతి సంవత్సరం ముస్లింలు నిర్ణీత స్థాయి దాటిన తమ మొత్తం మిగులు సంపదలో నుండి కేవలం 2.5% వంతు ఖుర్ఆన్ లో తెలిపిన అర్హతలు గలవారికి (నిరుపేదలు మరియు అక్కరగలవారు) దానం ఇవ్వవలసి ఉన్నది.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు: "కేవలం మీ మిగులు సంపదను పరిశుద్ధం చేసేందుకే అల్లాహ్ జకాతును తప్పనిసరి చేసినాడు."

"జకాహ్" అనే అరబీ పదం యొక్క అర్థం, 'పరిశుద్ధి' మరియు 'అభివృద్ధి'. ఇష్టం వచ్చినట్లు అటూ ఇటూ పెరిగి పోతున్న శాఖలను చక్కగా ట్రిమ్ చేయడం, కత్తిరించడం వలన మొక్కలు బ్యాలెన్సుగా, ఏపుగా పెరుగుతాయి. ఈ తప్పనిసరి విధిదానం చేయడం ద్వారా, ముస్లింలు తమ మిగిలిన సంపదను శుద్ధి చేసుకోగలుగుతారు. అంతేగాక, ఆర్థికంగా మరియు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతారు.

### జకాతు విధిదానం యొక్క కొన్ని ప్రయోజనాలు:

- స్వార్థం, అహంకారం మరియు దురాశల నుండి మన హృదయాన్ని పరిశుద్ధి చేస్తుంది.

- పేదప్రజలు మరియు అక్కరగలవారి పట్ల సానుభూతితో మరియు దయతో ప్రవర్తించేలా ట్రయినింగ్ ఇస్తుంది.
- అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని జ్ఞప్తికి తెస్తుంది మరియు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకునేలా ప్రోత్సహిస్తుంది.
- వివిధ సాంఘిక – ఆర్థిక సమూహాల మధ్య దూరాన్ని తగ్గిస్తుంది. ఇదొక రకమైన సోషల్ సెక్యూరిటీ అంటే సాంఘిక భద్రత.
- బీదరికాన్ని తగ్గిస్తుంది. తప్పనిసరిగా తమకు ప్రసాదించబడిన సంపదలో నుండి కొంత భాగాన్ని పేదప్రజలతో పంచుకోవాలని ధనవంతులను ఆదేశించడం వలన సమాజం ఆర్థిక సమానత్వం ఏర్పడుతుంది. "...తద్వారా ఇది (సంపద) కేవలం మీలోని ధనవంతుల చేతిలో మాత్రమే ఉండి పోకుండా." ఖుర్ఆన్ 59:7

జకాతు దానం ఇవ్వడమే కాకుండా, ముస్లింలు అదనంగా పేదప్రజలకు తమ ఇష్టానుసారం సదఖా దానం కూడా ఇవ్వవచ్చు.

### 4. రమదాన్ నెల ఉపవాసం – సౌమ్

"మీకంటే పూర్వం వచ్చిన వారిపై నిర్దేశించబడినట్లుగానే మీపై కూడా ఉపవాసం విధిగావించబడింది, తద్వారా మీరు కూడా తఖ్వా పొందగలరు (ధర్మపరాయణత్వం)." ఖుర్ఆన్ 2:183

ఇతర దైవారాధనల వలే, ఉపవాసంలో కూడా అత్యంత ఉన్నత స్థాయిలో దృఢనిశ్చయం మరియు చిత్తశుద్ధితో కూడిన అల్లాహ్ యొక్క విధేయత మరియు సమర్పణ ఎంతో అవసరం. ప్రతి సంవత్సరం మొత్తం రమదాన్ నెలలో (ఇస్లామీయ క్యాలెండరులోని 9వ నెలలో), ముస్లింలు ప్రాత:కాలం నుండి సూర్యాస్తమం వరకు మూడు ముఖ్య మానవ అవసరాలైన అన్నపానీయాలు మరియు దాంపత్య లైంగక సంబంధాలకు దూరంగా ఉంటారు. అంతేగాక వారు ప్రతి చెడుపని నుండి కూడా దూరంగా ఉంటారు.

శారీరక మరియు మానసిక ఆరోగ్యం కలిగి ఉండి, యుక్తవయస్సుకు చేరిన ప్రతి ముస్లింపై రమదాన్ నెల మొత్తం ఉపవాసం పాటించడం తప్పనిసరి. చిన్నపిల్లలు, వ్యాధిగ్రస్తులు, మతిస్థిమితం కోల్పోయినవాళ్ళు, స్పృహలో లేని వాళ్ళు, వయసు మళ్ళిన పండు ముసలివాళ్ళు, నెలసరి బహిష్టు లేదా పురుటి రక్తస్రావం స్థితిలో ఉన్న మహిళలు, ప్రయాణికులు మినహాయించి.

## రమదాన్ నెల ఉపవాసాల కొన్ని ప్రయోజనాలు:

- ఆధ్యాత్మిక స్వీయ శుద్ధీకరణ మరియు అభివృద్ధి మొదలైన మంచి అలవాట్లను ప్రోత్సహిస్తుంది.
- వైద్యశాస్త్రం ధృవీకరించిన ఆరోగ్య ప్రయోజనాలు.
- పేదప్రజలపై సానుభూతి మరియు మరింత దానధర్మాలు చేసేలా లభించే ప్రోత్సాహం, ప్రేరణ.
- స్వీయ శుద్ధీకరణ, సహనం అలవర్చుకునేలా మార్గదర్శకత్వం వహిస్తుంది.
- ఆత్మ పరిశుద్ధి మరియు కోరికలను త్యజించడం ద్వారా అల్లాహ్ కు విధేయులుగా మారే అలవాటు అలవర్చుకునేలా సహాయపడుతుంది. నిలకడ మరియు దృఢత్వాన్ని పెంపొదిస్తుంది. ఆత్మను శుద్ధి చేస్తుంది మరియు కోరికలకు దూరంగా ఉంటూ, నిలకడగా అల్లాహ్ కు విధేయత చూపే అలవాటును అలవర్చుకునేలా సహాయ పడుతుంది.
- ఉపవాసం పాటిస్తున్న ప్రజలలో ఐకమత్య భావనల పెంపుదల మరియు సామూహిక గుర్తింపును కలుగజేస్తుంది.
- ప్రాపంచిక వ్యవహారాల అవగాహనను పెంచుతుంది మరియు కష్టనష్టాలలో సహనం వహించేలా తయారు చేస్తుంది.
- పాపవిమోచన. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికారు, "ఎవరైతే అల్లాహ్ నుండి ప్రతిఫలం లభిస్తుందనే విశ్వాసంతో మరియు ఆశతో రమదాన్ ఉపవాసాలు ఉంటారో, అతడి పూర్వ పాపాలన్నీ క్షమించివేయబడతాయి."

## 5. పవిత్ర మక్కా యాత్ర - హజ్

“పవిత్ర కాబాగృహాన్ని సందర్శించే హజ్ యాత్ర తగిన స్తోమత గల వారిపై అల్లాహ్ యొక్క హక్కు అయి ఉన్నది.” ఖుర్ఆన్ 3:97

తగిన స్తోమత మరియు ఆరోగ్యం కలిగి ఉన్న ముస్లిం, వారి జీవితంలో కనీసం ఒక్కసారి సౌదీ అరేబియాలోని మక్కా నగరాన్ని మరియు అక్కడి ఇతర పుణ్యస్థలాలను సందర్శించి హజ్ యాత్ర చేయవలసి ఉన్నది.

హజ్ యాత్రలో తాత్కాలికంగా ప్రాపంచిక పనులన్నీ ఆపి వేయవలసి ఉంటుంది. ఈ సమయం ఆత్మపరిశీలనలో, అల్లాహ్ యొక్క ఆరాధనలో, అల్లాహ్ యొక్క క్షమాభిక్ష అర్థిస్తూ, ఆయనకు మరింత చేరువ కావడంకోసం వెచ్చించ వలసిన ఉత్తమ సమయం.

ప్రతి సంవత్సరం హిజ్రీ చంద్రమాన క్యాలెండరులోని 12వ నెల అయిన దిల్ హజ్ నెలలో హజ్ యాత్ర జరుగుతుంది. ప్రపంచ నలుమూలల నుండి రంగు, జాతి, వర్గం, స్టేటస్, వయస్సు, జాతీయతలకు అతీతంగా ఏకైక నిజ ఆరాధ్యుడి ఆరాధనలలో ప్రజలందరినీ ఏకం చేస్తుంది. మగవారందరూ చాలా సింపుల్ గా ఉండే ఒకే రకమైన రెండు తెల్లటి వస్త్రాలు మాత్రమే ధరిస్తారు. తద్వారా వారు జాతి, వర్గం, కులం, రంగు, స్టేటస్ మొదలైన వాటన్నింటినీ వదిలి అల్లాహ్ ముందు సామాన్య మానవులుగా, సమానులుగా నిలబడతారు.

అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికారు, “ఎవరినీ దూషించకుండా, పాపకార్యాలలో పాల్గొనకుండా ఎవరైతే హజ్ యాత్ర పూర్తి చేస్తారో, వారు అప్పుడే తల్లి గర్భం నుండి పుట్టిన పసిబిడ్డవలే (స్వచ్ఛంగా, పాపరహితంగా) మరలుతారు.”

అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించినట్లుగా, ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాం అడుగుజాడలను అనుసరిస్తూ హజ్ యాత్ర పూర్తి చేయవలసి ఉంది. ఈ అత్యద్భుత ఆరాధనలో నిరంతరంగా

ఆరు దినాలలో ఖుర్బానీ (పశుబలి) చేయడం, ప్రార్థనలు చేయడం, వివిధ ప్రాంతాలను సందర్శించడం మరియు అక్కడ ఆరాధించడం, ఇంకా అనేక ఇతర ఆరాధనలు చేయడం వంటి అనేక అంశాలు ఉన్నాయి.

అలాంటి అపూర్వమైన గొప్ప అనుభవం మానవ జీవిత దిశనే మార్చివేస్తుంది. మానవుడిలో అణుకువ, నమ్రతలను పెంపొందిస్తుంది. మరింత సహనంతో ప్రవర్తించేలా, అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలిపేలా తయారు చేస్తుంది. మానవులలో సోదరభావం పెరుగుతుంది. భేదభావాలకు అతీతంగా మానవులందరూ ఒకే సమాజం అనే భావనలను కలుగజేస్తుంది.

## ముగింపు

ఇస్లాం ధర్మం యొక్క ఐదు మూలస్థంభాలు అల్లాహ్ చే నిర్దేశించిబడినాయి. ముస్లింలు వాటిని విశ్వసించి, తమ జీవితంలో తప్పకుండా ఆచరించవలసి ఉన్నది. అవన్నీ ఆచరాణ్మకమైనవి మరియు సులభమైనవి. వాటి వెనుక ఎన్నో రెట్ల వివేకం మరియు శుభం ఉన్నది. సరైన దృష్టికోణంలో పరిశీలిస్తే, అవన్నీ వ్యక్తిగత మరియు సామాజిక అభ్యున్నతికి దోహద పడతాయి. వ్యక్తిగత సద్గుణాలు మరియు నైతిక ప్రవర్తనలను మెరుగుపరుస్తాయి. తద్వారా ప్రజలను మరియు సమాజాన్ని తమ పనులకు తాము బాధ్యత వహించే వారిగా తయారు చేస్తాయి మరియు అల్లాహ్ దగ్గరికి చేరుస్తాయి.

ఇస్లాం ధర్మం యొక్క ఐదు మూలస్థంభాలు కేవలం సృష్టితాల ప్రయోజనం కోసం మాత్రమే బోధించబడినాయి. ఎందుకంటే అల్లాహ్ నిరుపేక్షాపరుడు, అంటే ఎలాంటి అక్కరా లేనివాడు. ఈ ఐదు మూలస్థంభాలు మొత్తం మానవజాతి ఔన్నత్యం, సంక్షేమం, అభ్యుదయం మరియు సాఫల్యం కోసం పటిష్టమైన నిర్మాణాన్ని మరియు ట్రయినింగ్ ప్రోగ్రామ్ ను ఏర్పాటు చేస్తున్నాయి.

# 11. ఇస్లాం ధర్మంలో సైన్సు

“ఇక త్వరలోనే మేము వారికి మా చిహ్నాలను వారు చుట్టూ ఉన్న విశ్వంలో మరియు వారి యందును చూపుతాము. చివరకు ఇదే సత్యమని వారికి స్పష్టమవుతుంది.” ఖుర్ఆన్ 41:53

ఇస్లాం ధర్మం యొక్క మూలగ్రంథమైన ఖుర్ఆన్ ను సర్వలోక సృష్టకర్త అయిన అల్లాహ్ మానవజాతి కొరకు పంపిన అంతిమ మార్గదర్శక గ్రంథం మరియు ప్రవక్తలపై అవతరించబడిన దివ్యవాణులలో చిట్టచివరిది.

ఖుర్ఆన్ గ్రంథం (1400 సంవత్సరాల క్రితం అవతరించినది) సైన్సు పుస్తకం కాకపోయినప్పటికీ, అనేక సాంకేతిక, వైజ్ఞానికి వాస్తవాలు కలిగి ఉన్నది. టెక్నాలజీ మరియు సాంకేతిక విజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన తర్వాత శాస్త్రజ్ఞులు వీటిని ఈమధ్యనే కనుగొన్నారు. ప్రకృతిపై దీర్ఘాలోచనలను, వైజ్ఞానిక పరిశోధనలను ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది. ఎందుకంటే ఈ అద్భుత సృష్టి ఎలా సృష్టించబడిందో అర్థం చేసుకుంటే, వాటి సృష్టికర్తను, ఆయన శక్తిసామర్థ్యాలను మరియు వివేకాన్ని ప్రజలు ప్రశంసించే అవకాశం ఉన్నది.

సైన్సు ఇంకా ఆరంభ దశలో ఉన్నప్పుడే ఖుర్ఆన్ గ్రంథం అవతరించింది; ఆకాలంలో టెలిస్కోపులు లేవు, మైక్రోస్కోపులు లేవు, ఈనాటి ఆధునిక పరిజ్ఞానానికి కనీసం దరిదాపులలో ఉండే పరిశోధనా పరికరాలు కూడా లేవు. భూమి చుట్టూ సూర్యుడు పరిభ్రమిస్తున్నాడని, భూమి బల్లపరుపుగా ఉందని, దాని నాలుగు మూలలలో ఉన్న స్థంభాలపై ఆకాశం నిలబడి ఉందని ఆనాటి ప్రజలు నమ్మేవారు. అలాంటి సమయంలో ఖగోళశాస్త్రం నుండి బయోలజీ వరకు, జియాలజీ నుండి జువాలజీ వరకు అనేక వైజ్ఞానికి వాస్తవాలు కలిగి ఉన్న ఖుర్ఆన్ గ్రంథం అవతరించింది.

## ఖుర్ఆన్ లో ప్రస్తావించబడిన కొన్ని వైజ్ఞానిక వాస్తవాలు:

### #1 – జీవారంభం

"మరియు మేము ప్రతి ప్రాణిని నీటి నుండి పుట్టించాము. ఇకనైనా వారు విశ్వసించరా?" ఖుర్ఆన్ 21:30

నీరు జీవాలన్నింటి ఆరంభానికి మూలం అని పేర్కొనబడింది. ప్రాణులన్నీ కణాలతో సృష్టించబడినాయి. కణాలలో ఎక్కువ భాగం నీటితో తయారవుతుందని ఈనాడు మనకు తెలిసింది. ఇది మైక్రోస్కోపు కనిపెట్టబడిన తర్వాత కనుగొనబడింది. అరేబియాలోని ఎడారి ప్రాంతంలో, జీవాన్ని నీటి నుండే సృష్టించబడినాయని ఎవరైనా ఊహించగలరనే ఆలోచన భావాతీతమైంది, అనూహ్యమైంది.

### #2 – మానవ పిండం అభివృద్ధి

తన అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ గ్రంథంలో సర్వలోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ మానవ పిండం అభివృద్ధి గురించి ఇలా తెలిపినాడు :

"మరియు వాస్తవంగా మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో సృష్టించాము. తరువాత అతనిని ఇంద్రియ బిందువుగా ఒక కోశంలో భద్రంగా ఉంచాము. ఆ తరువాత ఆ ఇంద్రియ బిందువును రక్తపు ముద్దగా (జలగగా) మార్చాము. ఆ పైన ఆ రక్తపు ముద్దను మాంసపు ముద్దగా (జీవాణువుల పిండంగా) మార్చాము. ఆ జీవాణువుల పిండంలో ఎముకలను ఏర్పరచి, ఆ ఎముకలను మాంసంతో కప్పాము. ఆ తరువాత దానిని మరొక (భిన్న) సృష్టిగా చేసాము. కావున శుభకరుడు (శుభప్రదుడు) అయిన అల్లాహ్ యే అత్యుత్తమ సృష్టికర్త. …" ఖుర్ఆన్ 23:12-14

ఇక్కడ వాడబడిన "అలఖహ్" అనే అరబీ పదానికి మూడు అర్థాలు ఉన్నాయి: జలగ, వ్రేలాడే వస్తువు మరియు గడ్డకట్టిన రక్తం. "ముద్గహ్" అంటే

నమిలిన పదార్థం (చూయింగ్ గమ్). పిండం అభివృద్ధిని వివరించడంలో ఈ పదాల వాడకం చాలా ఖచ్చితంగా జరిగిందని మరియు పిండోత్పత్తి అవగాహనలో ప్రస్తుత వైజ్ఞానిక శాస్త్రంతో ఇది పూర్తిగా ఏకీభవిస్తున్నదని పిండోత్పత్తి శాస్త్రవేత్తలు గుర్తించారు.

20వ శతాబ్దానికి పూర్వం పిండోత్పత్తి దశల గురించి చాలా తక్కువగా తెలుసు. అంటే ఖుర్ఆన్ లో పేర్కొనబడిన పిండోత్పత్తి దశల వివరణ 7వ శతాబ్దానికి చెందిన సైన్సు విజ్ఞానంపై ఆధారపడి ఉండే అవకాశం అస్సలు లేదు.

### #3 – విశ్వం వ్యాపించడం

ఖగోళశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలో, ఖుర్ఆన్ లోని క్రింది వచనం అవతరించింది:

"మరియు ఆకాశాన్ని మేము మా చేతులతో నిర్మించాము. మరియు నిశ్చయంగా మేమే దానిని విస్తరింపజేస్తాము" ఖుర్ఆన్ 51:47

పైవచనం ఒక అర్థం ఏమిటంటే, సృష్టికర్త ఈ విశ్వాన్ని (అంటే ఆకాశాన్ని) వ్యాపింపజేస్తున్నాడు. దీని మరో అర్థం ఏమిటంటే, సృష్టికర్త ఈ విశ్వాన్ని పోషిస్తున్నాడు మరియు అలా పోషించే శక్తిసామర్థ్యాలు ఆయనకు ఉన్నాయి – నిజమే కదా!

విశ్వం వ్యాపిస్తున్నది (గ్రహాలు ఒకదానికొకటి దూరం దూరంగా జరుగుతున్నాయి) అనే వాస్తవం కేవలం క్రితం శతాబ్దంలో మాత్రమే కనిపెట్టబడింది. భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ (Stephen Hawking) తన పుస్తకం 'ది బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ - A Brief History of Time' లో ఇలా వ్రాసినాడు, "విశ్వం వ్యాపిస్తుందనే విషయాన్ని కనిపెట్టడమనేది 20వ శతాబ్దపు అతి గొప్ప వైజ్ఞానిక విప్లవాలలో ఒకటి."

మరి, టెలిస్కోపు కనిపెట్టబడక ముందే విశ్వం వ్యాపిస్తుందనే వాస్తవాన్ని ఖుర్ఆన్ గ్రంథం సూచించింది కదా!

## #4 – భూమండలం పైకి ఇనుము ఇతర గ్రహాల నుండి పంపబడింది

ఇనుము భూమండల సహజ వనరులలోనిది కాదు. అది బయటి అంతరిక్షం నుండి భూమండలంపైకి పంపబడింది. అనేక బిలియన్ల సంవత్సరాలకు పూర్వం, దూరపు నక్షత్రాలు పేలటం వలన అక్కడి నుండి ఇనుముతో నిండిన తోకచుక్కలు భూమిని తాకాయని శాస్త్రజ్ఞులు కనిపెట్టారు.

"మేము ఇనుమును క్రిందికి పంపాము. అందులో గొప్ప శక్తి ఉంది మరియు మానవులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి." ఖుర్ఆన్ 57:25

ఇక్కడ సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ 'క్రిందికి పంపాము' అనే పదాలను వాడినాడు. అంటే ఇనుము వేరే అంతరిక్షం నుండి భూమి పైకి పంపబడింది. ఈ విషయం అంతగా అభివృద్ధి చెందని 7వ శతాబ్దపు సైన్సుకు తెలియదు.

## #5 – ఆకాశ రక్షణ కవచం

సూర్యుడి నుండి వెలువడే ప్రాణాంతకమైన విషవాయువులు మరియు అంతరక్షం యొక్క గడ్డకట్టే చల్లదనం నుండి భూమిని మరియు భూమిపై ఉన్న జీవాలను భద్రంగా కాపాడటంలో ఆకాశం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది.

ఖుర్ఆన్ లో ఈ విషయం గురించి అల్లాహ్ ఇలా పేర్కొంటున్నాడు:

"మేము ఆకాశాన్ని సురక్షితమైన కప్పుగా చేసాము. అయినా వారు అందులోని సూచనల నుండి విముఖులవుతున్నారు!" ఖుర్ఆన్ 21:32

20వ శతాబ్దంలో జరిగిన పరిశోధనలలో సాంకేతిక పరిశోధనలు కనిపెట్టిన ఆకాశపు రక్షణ కవచాన్ని మరియు దాని రక్షించే లక్షణాలను అల్లాహ్ యొక్క అద్భుత చిహ్నాలలో ఒకటిగా ఖుర్ఆన్ 7వ శతాబ్దంలోనే పేర్కొన్నది.

## #6 – పర్వతాలు

పర్వతాలకు చెందిన ఒక ముఖ్య లక్షణం వైపు దృష్టి సారించమని అల్లాహ్ మనకు ఇక్కడ తెలుపుతున్నాడు:

"ఏమీ? మేము భూమిని పరుపుగా చేయలేదా? మరియు పర్వతాలను మేకులుగా?" ఖుర్ఆన్ 78:6-7

"మేకులు" అనే పదాన్ని వాడుతూ లోతుగా పాతుకుపోయిన పర్వతాల వ్రేళ్ళ గురించి ఖుర్ఆన్ చాలా ఖచ్చితంగా వివరిస్తున్నది. ఉదాహరణకు, మౌంట్ ఎవరెస్ట్ భూమిపై దాదాపు 9 కి.మీ. ఎత్తు కలిగి ఉండగా, భూమి లోపల దాని వ్రేళ్ళు 125 కి.మీ. కంటే లోతుగా చొచ్చుకుపోయి ఉన్నాయి!

20వ శతాబ్దపు ఆరంభంలో థియరీ ఆఫ్ ప్లాటె టెక్ట్రానిక్స్ (theory of plate tectonics) వెలుగులోనికి వచ్చే వరకు పర్వతాల వ్రేళ్ళు భూమి లోపలికి లోతుగా లోపలికి చొచ్చుకుని పోయిన మేకుల వలే ఉంటాయనే వాస్తవం ప్రపంచానికి తెలియదు. అయితే, భూమిని స్థిరంగా ఉంచడంలో పర్వతాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ఖుర్ఆన్ (16:15) లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు. "...తద్వారా అది కంపించదు," ఈమధ్యనే శాస్త్రవేత్తలు దీనిని గ్రహించసాగారు.

## #7 – సూర్యుడి కక్ష్య

1512లో, నికోలస్ కాపర్నికస్ (Nicholas Copernicus) అనే ఖగోళ శాస్త్రజ్ఞుడు సూర్యకుటుంబం మధ్యలో సూర్యుడు చలనరహితంగా, స్థిరంగా ఉన్నాడని మరియు గ్రహాలు సూర్యుని చుట్టూ భ్రమిస్తున్నాయనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు. 20వ శతాబ్దం వరకు ఇదే సిద్ధాంతం ఖగోళ శాస్త్రజ్ఞులలో విస్తృతంగా వ్యాపించింది. మరిప్పుడు ఖచ్చితంగా ప్రకటించబడిన వాస్తవం ఏమిటంటే, సూర్యుడు కూడా నిలకడగా లేడని, మన మిల్కీ వే గ్యాలక్సీ

(Milky Way galaxy) కేంద్రం చుట్టూ ఒక కక్ష్యలో పరిభ్రమిస్తున్నాడు. ఇదే వాస్తవం ఖుర్ఆన్ లో పధ్నాలుగు శతాబ్దాలకు పూర్వమే స్పష్టంగా ఇలా తెలుపబడింది.

"మరియు రేయింబవళ్ళను మరియు సూర్యచంద్రులను సృష్టించినవాడు ఆయనే. అవి తమత తమ కక్ష్యలలో తేలియాడుతూ (తిరుగుతూ) ఉన్నాయి." ఖుర్ఆన్ 21:33

## #8 – మహాసముద్రాలలోని అంతర్గత అలలు

సముద్రాల ఉపరితలంపైనే అలలు వస్తాయని సాధారణంగా భావిస్తుంటాము. కానీ, సముద్ర ఉపరితలం క్రింద కూడా అంతర్గత అలలు ఏర్పడతాయని, అవి మానవ కంటికి కనబడవని, కేవలం ప్రత్యేక పరికరాల ద్వారా మాత్రమే గుర్తించగలమని సాగర శాస్త్రవేత్తలు ఈ మధ్య కనిపెట్టారు.

మరి, వాటి గురించి ఖుర్ఆన్ లో పధ్నాలుగు శతాబ్దాలకు పూర్వమే ఇలా పేర్కొనబడింది:

"... చాలా లోతుగల సముద్రంలోని చీకట్ల వలే ఉంటుంది. దానిపై ఒక గొప్ప అల క్రమ్ముకొని ఉంటుంది. దానిపై మరొక గొప్ప అల, మేఘాలు. చీకట్లు ఒకదానిపై నొకటి క్రమ్ముకొని ఉంటాయి. అపుడు ఎవడైనా తన చేతిని (చూడాలని) చాచితే, వాడు దానిని చూడలేడు. ..." ఖుర్ఆన్ 24:40

ఈ స్పష్టమైన వివరణ ఎంతో ఆశ్చర్యకరమైంది. ఎందుకంటే 1400 సంవత్సరాలకు పూర్వం సముద్రాలలో చాలా లోతుగా అంతర్గత అలలను గుర్తించే పల ఎలాంటి ప్రత్యేక పరికరమూ లేదు.

## #9 – అబద్ధాలు & దాని కదలికలు

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో క్రూరమైన, దౌర్జన్యపరుడైన ఒక తెగ నాయకుడు ఉండేవాడు. అతడిని హెచ్చరించేందుకు, అల్లాహ్ ఖుర్ఆన్ లో ఈ వచనాన్ని అవతరింపజేసినాడు:

"అలా కాదు! ఒకవేళ అతడు మానుకోక పోతే, మేము అతడిని నుదుటి జుట్టు వెంట్రుకలను పట్టి ఈడుస్తాము. అది అబద్ధాలలో , అపరాధాలలో మునిగి వున్న నుదురు." ఖుర్ఆన్ 96:15-16

అల్లాహ్ అతడిని అబద్ధాలకోరు అని పేర్కొనలేదు, కానీ అతడి నుదురు ముందుభాగాన్ని (మెదడు ముందు భాగాన్ని) 'అబద్ధాలకోరు' మరియు 'పాపాత్మకమైనది' గా పేర్కొన్నాడు, ఇంకా పాపకార్యాలు వదిలి వేయాలని హెచ్చరించాడు. అబద్ధాలు పలకడం మరియు ఇష్టానుసారం కదలడం అంటే పాపకార్యాలు చేయడం మొదలైన వాటికి మన మెదడు ముందు భాగం బాధ్యత వహిస్తుందని అనేక పరిశోధనలు గుర్తించాయి. ఈ చర్యలు 20వ శతాబ్దంలో అభివృద్ధి చేయబడిన ప్రత్యేక మెడికల్ ఇమేజింగ్ పరికరాల ద్వారా కనిపెట్ట బడినాయి.

## #10 – రెండు సముద్రాలు కలుసుకోవు

సముద్రాల గురించి, మన సృష్టికర్త ఇలా పేర్కొన్నాడు:

"ఆయనే రెండు సముద్రాలను కలుసు కోవటానికి వదలి పెటాడు. ఆ రెండింటి మధ్య, అవి అతిక్రమించలేని అడ్డు తెర వుంది." ఖుర్ఆన్ 55:19-20

ఉపరితలం ఉద్రిక్తత (surface tension ) అనబడే ఒక భౌతిక శక్తి ఇరుగు పొరుగు సముద్రాల నీటిని వాటి సాంద్రతల తేడా వలన పరస్పరం కలుసుకోకుండా నిరోధిస్తుంది. వాటి మధ్య ఒక సన్నటి అడ్డుపొర వలే ఏర్పడుతుంది. ఈ వాస్తవాన్ని ఈ మధ్యనే సాగర శాస్త్రవేత్తలు కనిపెట్టారు.

## ఖుర్ఆన్ గ్రంథాన్ని ముహమ్మద్ రచించలేదా?

చరిత్రలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిరక్ష్యరాస్యులుగా పేర్కొనబడినారు. ఆయనకు చదవడం, వ్రాయడం రాదు. ఖుర్ఆన్ లో అనేక సాంకేతిక వాస్తవాలను అంత ఖచ్చితంగా పేర్కొనేందుకు ఆయన ఏ వైజ్ఞానిక విభాగంలోనూ విద్యాభ్యాసం చేయలేదు.

ఆయన కాలంలోని జ్ఞానుల నుండి లేదా శాస్త్రవేత్తల నుండి కాపీ చేసి ఉంటారని కొందరు వాదించవచ్చు. ఒకవేళ అది కాపీ చేయబడితే, ఆనాటి తప్పుడు వైజ్ఞానిక కల్పితాలన్నీ కూడా కాపీ చేయబడి ఉండాలి కదా. కానీ, ఖుర్ఆన్ లో ఎలాంటి తప్పులు లేవు – అది వైజ్ఞానిక పరమైనదైనా లేక ఇతర అంశాలకు చెందినదైనా.

నూతన వైజ్ఞానిక వాస్తవాలు కనుగొన్న తర్వాత, ఖుర్ఆన్ కూడా మార్చబడిందని కొందరు ప్రజలు వాదించవచ్చు. ఇందులో వాస్తవం లేదు ఎందుకంటే ఖుర్ఆన్ గ్రంథం దాని ఒరిజినల్ రూపంలో చాలా సురక్షితంగా భద్రం చేయబడి ఉన్నదన్న వాస్తవం చారిత్రకపరంగా నిరూపించబడింది – ఇదే స్వయంగా ఒక మహాద్భుత విషయం.

## ఏదో ఒక యాధృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటనా?

“ఇక త్వరలోనే మేము వారికి మా చిహ్నాలను వారు చుట్టూ ఉన్న విశ్వంలో మరియు వారి యందును చూపుతాము. చివరకు ఇదే సత్యమని వారికి స్పష్టమవుతుంది.” ఖుర్ఆన్ 41:53

ఇక్కడ కేవలం వైజ్ఞానిక అద్భుతాలపైన మాత్రమే దృష్టి సారించడం జరిగింది. అయితే ఖుర్ఆన్ లో మరెన్నో రకాల అద్భుతాలు పేర్కొనబడినాయి: చారిత్రక అద్భుతాలు; క్రమక్రమంగా నిజమవుతున్న భవిష్యవాణులు; సాటిలేని భాషాపరమైన మరియు సాహిత్యపరమైన శైలి; ప్రజలను కదిలించి వేసే దాని ప్రభావం. ఈ అద్భుతాలన్నీ కేవలం యాదృచ్ఛికమైన హఠాత్పరిణామాలు

కాజాలవు. ఇవన్నీ ఖుర్ఆన్ గ్రంథం వైజ్ఞానిక నియమాలన్నింటినీ సృష్టించిన సకల లోకాల సృష్టికర్త నుండి అవతరించిన గ్రంథమని స్పష్టంగా ఋజువు చేస్తున్నాయి. ఆయనే ప్రవక్తలందరినీ ఈ ఏకైక సందేశంతో పంపిన దైవం - కేవలం ఏకైక దైవాన్ని మాత్రమే ఆరాధించండి మరియు ఆయన ప్రవక్త యొక్క బోధనలు అనుసరించండి.

ఖుర్ఆన్ గ్రంథం ఒక మార్గదర్శక గ్రంథం. ఎలాంటి లక్ష్యం, గమ్యం లేకుండా పిచ్చి పిచ్చిగా తిరిగేందుకు సృష్టికర్త మానవులను సృష్టించలేదని పేర్కొంటున్నది. మన జీవితానికి ఒక పరమార్థం ఉందని, ఒక ఉన్నత ఉద్దేశ్యం ఉందని ఖుర్ఆన్ బోధిస్తున్నది – సృష్టికర్త యొక్క పూర్తి సంపూర్ణత్వం, ఘనత మరియు ఏకత్వాన్ని గుర్తించి, కేవలం ఆయనను మాత్రమే ఆరాధించడం మరియు విధేయత చూపడం.

తనకు ప్రసాదించబడిన తెలివితేటలు, వివేకాన్ని ఉపయోగించి, సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క చిహ్నాల గురించి పరిశోధించేందుకు మరియు వాటిని గుర్తించేందుకు ప్రతి ఒక్కరికీ తగిన స్వేచ్ఛ ఇవ్వబడింది – ఖుర్ఆన్ గ్రంథం అల్లాహ్ యొక్క చిహ్నాలలో ఒక గొప్ప ముఖ్య చిహ్నం. ఖుర్ఆన్ చదవండి మరియు అందులోని అద్భుత సౌందర్యాన్ని మరియు నిజాన్ని కనిపెట్టండి. తద్వారా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉన్నది!

# 12. ఇస్లాం గురించి ప్రజలలో వ్యాపించి ఉన్న కొన్ని అపార్థాలు

***వాస్తవానికి ఇస్లాం గురించి మీకేమి తెలుసు?***

ఇస్లాం ధర్మం ప్రపంచంలోని అతి పెద్ద ధర్మాలలోని ఒక పెద్ద ధర్మం. అయినా అత్యధికంగా అపార్థాలకు గురవుతున్నది. రాజకీయ, ఆర్థిక, పక్షపాతంతో వ్యవహరించే మీడియా మరియు ఇతర భయాల వంటి అనేక కారణాలు ఉన్నాయి – ఇస్లాంకు వ్యతిరేకంగా అనేక అసత్యాలు మరియు అపార్థాలు వ్యాపింపజేయబడినాయి. ఇస్లాం మరియు ముస్లింల గురించి సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ముందుగా స్టీరియో టైపు అసత్య ప్రచారాలను నమ్మటం మాని, ప్రతి విషయాన్ని ఇస్లామీయ బోధనల మరియు ప్రామాణిక ఆధారాల వెలుగులో పరిశీలించాలి.

**1వ అపార్థం** – "ముస్లింలు ఉత్తమమైన మరియు దివ్యమైన విలువలను ముస్లిమేతరులతో పంచుకోరు"

*"మీలో ఎవరైతే ఉత్తమ గుణగణాలు మరియు నడత కలిగి ఉంటారో అలాంటి వారే ఉత్తములు."* – ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ఇస్లామీయ విలువలు మర్యాదగల పాశ్చాత్య విలువలతో సరితూగవని కొందరు ఆరోపిస్తున్నారు. అలాంటి ఆరోపణలు సత్యానికి చాలా దూరంగా ఉన్నాయి.

ముస్లింలు ఉత్తమ మరియు ప్రసిద్ధ విలువలను కాపాడుతూ వచ్చినారు. ఉదాహరణకు:

- నిజాయితీ మరియు న్యాయంగా ఉండటం.
- ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం
- ధార్మిక స్వేచ్ఛను అనుమతించడం

- తల్లిదండ్రులను, బంధువులను, ఇరుగు పొరుగువారిని మరియు వృద్ధులను గౌరవించడం
- దానధర్మాలు చేస్తూ ఉదారంగా ప్రవర్తించడం, బీదసాదలకు మరియు అక్కరగలవారికి చేతనైనంత సహాయం చేయడం
- అబద్ధాలు, మోసం, అసత్య ప్రమాణాలు, చాడీలు, అపనిందలు మొదలైన వాటికి దూరంగా ఉండటం.

ముస్లింలు సామాజిక పనులలో సానుకూలంగా పాల్గొనవలసి ఉన్నది. ముస్లింలు స్వయంగా ఎల్లప్పుడూ అత్యంత ఉన్నతమైన నైతిక విలువలు మరియు అత్యంత ఉత్తమమైన ఆచరణలు ప్రదర్శించవలసి ఉన్నది.

**2వ అపార్థం** – "ముస్లింలు ఒక నూతన దేవుడైన అల్లాహ్ ను ఆరాధిస్తారు"

నూహ్, అబ్రహాం, మోసెస్ మరియు జీసస్ అలైహిస్సలాం మొదలైన ప్రవక్తలు ఆరాధించిన దేవుడినే ముస్లింలు ఆరాధిస్తున్నారు. సింపుల్ గా అల్లాహ్ అనే పదం అరబీ భాషలో ఏకైక ఆరాధ్యుడి పేరు. ఇది ఎంతో విస్తృతమైన పదం – కేవలం ఒకే ఒక్క ఆరాధ్యుడిని మాత్రమే సూచిస్తుంది. అంతేగాక అరబీ భాష మాట్లాడే క్రైస్తవులు మరియు యూదులు కూడా దేవుడిని సూచించేందుకు అల్లాహ్ అనే పదాన్నే వాడతారు.

ముస్లింలు, యూదులు మరియు క్రైస్తవులు ఒకే దైవాన్ని (సర్వలోక సృష్టికర్తను) మాత్రమే విశ్వసిస్తున్నా, వారి దైవభావనలో చాలా తేడా ఉన్నది. ఉదాహరణకు, దేవుడికి సాటి కల్పించడం లేదా త్రైత్వంలో ఒకడని భావించడం వంటి భావనలను ముస్లింలు పూర్తిగా తిరస్కరిస్తారు మరియు పరిపూర్ణత్వం కేవలం సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ కు మాత్రమే చెందుతుందని అంటారు.

**3వ అపార్థం** – "ఇస్లాం ధర్మం తీవ్రవాదాన్ని అనుమతిస్తుంది"

సాధారణంగా ఏ ముస్లిం పోరాడుతున్నా, మీడియా అతడిని తీవ్రవాదిగానే చూపుతుంది – అతడు న్యాయం కోసం పోరాడుతున్నా లేక న్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్నా, ఇతరులను అణిచి వేస్తున్నా లేక ఇతరుల అణిచివేతకు గురవుతున్నా.

యుద్ధరంగంలో, పోరాటంలో పాల్గొనని అమాయకులను లక్ష్యం చేయడాన్ని ఇస్లాం ధర్మం స్పష్టంగా నిషేధిస్తున్నది. నిజానికి, అమాయక ప్రజలకు హాని కలిగించకూడదనే ఆదేశంతో పాటు చెట్లను మరియు జంతువులను అనవసరంగా నాశనం చేయకూడదనే నిషేధం కూడా ముస్లింలపై ఉన్నది. ఏదేమైనా, తీవ్రవాదానికి మరియు దురాక్రమణల వ్యతిరేకతకు మధ్య ఉన్న భేదాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే అవి రెండూ పూర్తిగా వ్యతిరేకమైన భిన్నధృవాలు.

అమాయక వ్యక్తిని హత్య చేయడం ఎంత తీవ్రమైన విషయమో ఖుర్ఆన్ గ్రంథం స్పష్టంగా తెలుపుతున్నది మరియు మానవజీవిత విలువను నొక్కి వక్కాణిస్తున్నది.

"ఒకవేళ ఎవరైనా ఒక అమాయక వ్యక్తిని హత్య చేస్తే, అతడు మొత్తం మానవజాతిని హత్య చేసినట్లుగా పరిగణింపబడతాడు. ఆలాగే ఒకవేళ ఎవరైనా ఒక వ్యక్తిని కాపాడితే, అతడు మొత్తం మానవజాతిని కాపాడినట్లుగా పరిగణింపబడతాడు." ఖుర్ఆన్ 5:32

**4వ అపార్థం** – "ఇస్లాం ధర్మం స్త్రీలను అణిచివేస్తున్నది"

ఇస్లాంలో, దైవం ముందు స్త్రీపురుషులు ఇరువురూ సమానులే. వారుభయులూ సరిసమానంగానే పుణ్యాలు పొందుతారు మరియు తమ తమ పనులకు వారుభయులూ సరిసమానంగా బాధ్యులు. అల్లాహ్ పై చూపే భయభక్తుల స్థాయిని బట్టి మాత్రమే అల్లాహ్ వద్ద ప్రజల స్థానం

నిర్ణయించబడుతుంది. (ఎవరు ఎక్కువ అల్లాహ్ యొక్క భయభక్తులు కలిగి ఉంటారో వారు అల్లాహ్ వద్ద ఉన్నత స్థానం పొందుతారు.)

"ఎవరైతే అత్యంత ఎక్కువగా అల్లాహ్ యొక్క భయభక్తులు కలిగి ఉంటారో వారే అల్లాహ్ దృష్టిలో మహోన్నతులు." ఖుర్ఆన్ 49:13

అసలైన గౌరవం మరియు స్టేటస్ అనేది ఒక వ్యక్తి ధనికుడు లేదా బీదవాడు, నల్లవాడు లేదా తెల్లవాడు, మగవాడు లేదా స్త్రీ అనే వాటి ద్వారా పొందలేము, కానీ దానిని కేవలం అల్లాహ్ యొక్క భయభక్తులు మరియు మనస్పూర్తిగా సమర్పించుకోవడం ద్వారా మాత్రమే పొందగలమనే విషయం ఈ ఖుర్ఆన్ వచనం నిరూపిస్తున్నది.

ఉభయ లింగాలను సృష్టించిన అల్లాహ్, వారుభయులకూ వారి మధ్య ఉన్న తేడాలను పరిగణలోనికి తీసుకుని వేర్వేరు పాత్రలు, కర్తవ్యాలు మరియు బాధ్యతలు నిర్దేశించినాడు. స్త్రీలకు అత్యంత ఎక్కువ గౌరవం మరియు స్టేటస్ ఇవ్వబడెను. ఉదాహరణకు సరిసమానంగా వేతనం చెల్లించడం, జీవిత భాగస్వామిని ఎంచుకోవడం, విద్యాభ్యాసం, భర్తకు విడాకులు ఇచ్చే హక్కు, ఆస్తిపాస్తుల వారసత్వ హక్కు మొదలైనవి.

దురదృష్టవశాత్తు వారి హక్కులను వారికి ఇవ్వకుండా మహిళలను అణచి వేస్తున్న కొందరు ముస్లింలు కూడా ఉన్నారు. ఇది ఇస్లాం తప్పు కాదు. అసలు సమస్య ఏమిటంటే, వివిధ దేశాలలో కొందరు ముస్లింలు ఇస్లాం ధర్మంతో ఎలాంటి సంబంధం లేని కొన్ని ప్రాంతీయ సంప్రదాయాలను మరియు ఆచారాలను అనుసరిస్తూ ఉంటారు.

**5వ అపార్థం** – "ఖుర్ఆన్ కూడా మరో చారిత్రక లేక కవితల గ్రంథం"

ఖుర్ఆన్ గ్రంథం సర్వలోకాల సృష్టికర్త, ప్రభువు అయిన అల్లాహ్ యొక్క దివ్యమైన వాక్కు. ఆయన దానిని తన అంతిమ ప్రవక్త అయిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై జిబ్రయీల్ దైవదూత ద్వారా

అవతరింపజేసినాడు. ఇది సత్యాసత్యాలను వేరు చేసే గీటురాయి. ఇందులో మొత్తం మానవజాతి కొరకు చక్కటి మార్గదర్శకత్వం ఉన్నది. ఖుర్ఆన్ గ్రంథం పూర్వ తరాల నుండి మరియు ప్రవక్తల చరిత్ర నుండి అనేక గుణపాఠాలను ప్రస్తావిస్తున్నది. వాటి నుండి మనం కూడా గుణపాఠం నేర్చుకుంటామని. ఇంకా స్వయంగా మన గురించి, మన సృష్టికర్త గురించి, మన జీవిత పరమార్థం అంటే సృష్టికర్తను గుర్తించడం మరియు కేవలం ఆయనను మాత్రమే ఆరాధించడం గురించి చక్కగా బోదిస్తున్నది.

ఎలాంటి లక్ష్యం లేకుండా పిచ్చి పిచ్చిగా అటూ ఇటూ తిరగటానికి కాదు ఆయన మానవులను సృష్టించింది. తమకు ప్రసాదించబడిన తెలివితేటలు, వివేకం, విచక్షణ, స్వేచ్ఛ, హేతువాద సామర్థ్యం మొదలైన వాటిని సరిగ్గా ఉపయోగించి, సర్వలోక సృష్టికర్త చిహ్నాలు, సూచనల గురించి పరిశోధించి, వాటిని గుర్తించడం అనేది మన దైవ విశ్వాసం యొక్క అసలు పరీక్ష. అన్నింటి కంటే మహాద్భుత సూచన "ఖుర్ఆన్ గ్రంథం".

స్వయంగా ఖుర్ఆన్ గ్రంథం తనలో అనేక అద్భుతాలను కలిగి ఉన్నది. వాటిపై దృష్టి సారించడం వలన దాని ప్రామాణికతపై మనకు సందేహం కలిగే అవకాశమే లేదు. అసలు ఖుర్ఆన్ దేని గురించి బోధిస్తున్నది అనే విషయాన్ని తెలుసుకునే అతి గొప్ప మార్గం ఏమిటంటే స్వయంగా మీరే దానిని చదవడం.

### **6వ అపార్థం** – "హిజాబ్ అణచివేతకు చిహ్నం"

హిజాబ్ పరదా వేసుకోవడమంటే, ముస్లిం మహిళలు చక్కటి, సాంప్రదాయకమైన వదులు దుస్తులు ధరించి తమ శరీర భాగాలను, శరీర ఆకారాన్ని పరపురుషుల కంటికి కనబడకుండా దాచుకోవడం. అయితే హిజాబ్ అంటే కేవలం బహిరంగ వస్త్రధారణ మాత్రమే కాదు, దానిలో మర్యాదపూర్వకమైన సంభాషణ, మానమర్యాదలు మరియు సంస్కారంతో నిండిన నైతిక ప్రవర్తన మొదలైనవన్నీ ఇమిడి ఉన్నాయి.

హిజాబ్ వలన అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ముస్లిం మహిళలను హిజాబ్ దుస్తులు ధరించడానికి అసలు కారణం అది అల్లాహ్ యొక్క ఆజ్ఞ అవడమే. తన సృష్టికి ఏది మంచిదో ఆయన బాగా ఎరుగును.

ఒక స్త్రీ తన బహిరంగ ప్రదర్శనపై కాకుండా, అంతరంగిక సౌందర్యంపై దృష్టి కేంద్రీకరించేలా హిజాబ్ వ్యవస్థ మార్గదర్శకత్వం వహిస్తున్నది. హిజాబ్ వ్యవస్థ మహిళలకు తమ పాతివ్రత్యాన్ని కాపాడుకుంటూ, సామాజిక అభివృద్ధిలో యాక్టివ్ గా పాల్గొనే అవకాశాన్ని ఇస్తున్నది.

హిజాబ్ వ్యవస్థ అణచివేత, దౌర్జన్యం లేదా నోరు మూయడం వంటి వాటిని సూచించదు. అయితే అది వారి స్థాయిని దిగజార్చకుండా కాపాడే రక్షణ కవచం. అనవసరమైన మరియు అనైతిక అడుగులకు అది ఆటంకమవుతుంది. కాబట్టి, ఇక నుండి మీరెప్పుడైనా ముస్లిం మహిళను చూస్తే, ఆమె తన బాహ్య శరీరాన్ని కప్పి వేసుకుందే గానీ తన బుద్ధిని లేక తెలివితేటలను కాదని తెలుసుకోండి.

**7వ అపార్థం** – “ముస్లిములందరూ అరబ్బులే”

ప్రపంచంలోని ముస్లింలలో కేవలం 20% ప్రజలు మాత్రమే అరబ్బులు అంటే 80% ముస్లింలు అరబ్బేతరులన్నమాట. ఉదాహరణకు, అరబ్బు ముస్లింల సంఖ్య కంటే భారతదేశం & ఇండోనేషియా దేశాలలోని ముస్లింల సంఖ్య ఎక్కువ.

రంగు, జాతి, వర్గం, కులం, సంపద, అధికారం, స్టేటస్ మొదలైన వాటి కారణంగా ఏ వ్యక్తీ మరో వ్యక్తి కంటే గొప్ప వాడు కాజాలడని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఇస్లాం ధర్మం జాతి వివక్షతను తీవ్రంగా ఖండిస్తున్నది. ఇస్లాం సందేశం మొత్తం మానవులందరి కోసం పంపబడిన ఒక సార్వత్రిక సందేశం. ఏకైక దైవమైన సర్వలోక సృష్టికర్తను గుర్తించడం మరియు ఆరాధించడం ద్వారా ప్రతి ఒక్కరూ శాంతి మరియు సాఫల్యం పొందగలరు.

**8వ అపార్థం** – "జిహాద్ అంటే ఉగ్రవాదం, తీవ్రవాదం"

జిహాద్ అంటే శ్రమించడం, ప్రయాస పడటం. దైవం మెచ్చుకునే విధంగా తమ ధర్మం కోసం త్యాగం చేయడం. భాషాపరంగా, దీని అర్థం శ్రమించడం, కష్టపడటం. ఇది మంచి పనులు మరియు దానధర్మాలు చేయడంలో శ్రమించడం లేదా ఇస్లామీయ సైనిక చర్యలలో పాల్గొనడం మొదలైన వాటిని సూచిస్తుంది. అయితే మిలటరీ జిహాద్ అనేది అత్యంత ప్రచారంలో ఉన్న అవగాహన. సమాజ సంరక్షణ కోసం, దౌర్జన్యం మరియు అణచివేత వ్యాపించకుండా కట్టడి చేయడం కోసం, న్యాయ స్థాపన కోసం మాత్రమే మిలటరీ జిహాద్ అనుమతించబడింది. అది పరిస్థితులను బట్టి ఎదురు దాడి కావచ్చు లేదా డిఫెన్సు కావచ్చు.

**9వ అపార్థం** – "ముస్లింలు ముహమ్మద్ ను లేక చంద్ర దేవుడిని పూజిస్తారు"

ముస్లింలు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను పూజిస్తారనేది మరో ఘోరమైన అపార్థం. దీనిలో అస్సలు సత్యం లేదు. ఇది పచ్చి అబద్ధం. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఈ బోధనను పరిశీలించడం ద్వారా దీనిలోని నిజానిజాలు సులభంగా గుర్తించవచ్చు:"మర్యమ్ కుమారుడైన జీసస్ ను క్రైస్తవులు హద్దుమీరి ప్రశంసించినట్లుగా మీరు నన్ను ప్రశంసించవద్దు. నేను కేవలం దైవదాసుడిని మాత్రమే. కాబట్టి నన్ను అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ఆయన దాసుడు అని పేర్కొనండి.'"

అల్లాహ్ యొక్క ప్రవక్తలందరినీ మరియు సందేశహరులందరినీ గౌరవించాలని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. వారిని గౌరవించడం, ప్రేమించడమంటే వారిని ఆరాధించాలని, పూజించాలని ఎంత మాత్రమూ కాదు.

అలాంటిదే మరో అభాండము – ముస్లింలు చంద్ర దేవుడిని పూజిస్తారు. ఇది ఎంత మాత్రమూ నిజం కాదు. అల్లాహ్ ను వదిలి చంద్రుడిని లేదా ఇతరులను ఆరాధించడమనేది ఇస్లాం ధర్మంలో తీవ్రంగా, తీక్షణంగా నిషేధించబడింది:

“సూర్యచంద్రులకు సాష్టాంగ పడవద్దు, కానీ మిమ్ముల్ని సృష్టించిన అల్లాహ్ కు మాత్రమే సాష్టాంగపడండి – ఒకవేళ మీరు నిజంగా ఆయనను ఆరాధిస్తున్నట్లయితే.” ఖుర్ఆన్ 41:37

సర్వలోక సృష్టికర్త యొక్క పరిపూర్ణత్వం, ఘనత, సార్వభౌమత్వం, ఏకత్వం మొదలైన వాటిని ఇస్లాం ధర్మం సర్దుబాట్లకు అస్సలు తావులేకుండా ప్రాధాన్యతనిస్తున్నది. ఆయన అత్యంత న్యాయవంతుడు, అత్యంత కరుణామయుడు. కేవలం ఆయనను మాత్రమే ఆరాధించడమనేది ఇస్లాం ధర్మంలో అత్యంత ముఖ్యమైన విశ్వాసం. దీని గురించి ఖుర్ఆన్ లో అనేక చోట్ల ప్రస్తావించబడింది.

**10వ అపార్థం** – “బలవంతపు పెళ్ళిళ్ళను ఇస్లాం ధర్మం అనుమతిస్తున్నది”

ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలలో పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళు సాంస్కృతిక ఆచారంగా అనుసరించబడుతున్నాయి. ముస్లింలపై ముస్లింల విషయంలో ఎలాంటి నిబంధనలు లేనప్పటికీ, తప్పుగా బలవంతపు పెళ్ళిళ్ళు ఇస్లాంతో ముడిపెట్టబడినాయి.

ఇస్లాంలో, స్త్రీపురుషులు ఉభయులూ తమకు ఇష్టమైన జీవిత భాగస్వామిని ఎంచుకునే లేదా తిరస్కరించే హక్కు కలిగి ఉన్నారు. అంతేగాక ఇస్లాం ధర్మంలో పెళ్ళికి ముందు పెళ్ళికూతురి ప్రామాణికమైన అంగీకారం తీసుకోకపోతే ఆ పెళ్ళి అస్సలు చెల్లదు.

**11వ అపార్థం** – “ప్రజలు ముస్లింలుగా మారాలని ఇస్లాం బలవంతం చేస్తుంది”

అల్లాహ్ ఆజ్ఞ, “ధర్మంలో నిర్బంధం లేదు. అసత్యం నుండి సత్యం స్పష్టం చేయబడింది.” ఖుర్ఆన్ 2:256

ఆకర్షణీయమైన ఇస్లాం ధర్మ సందేశాన్ని ఇతరులకు అందజేయడం అనేది ముస్లింల బాధ్యత, కర్తవ్యమై ఉంది. అయినా, ఇస్లాం ధర్మం

స్వీకరించాలని ఎవ్వరినీ బలవంతం చేయకూడదని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఎవరైనా ఇస్లాం ధర్మం స్వీకరించాలంటే, అతను చిత్తశుద్ధితో మరియు మనస్పూర్తిగా అల్లాహ్ పై విశ్వాసం తీసుకురావాలి మరియు అల్లాహ్ యొక్క విధేయులుగా మారాలి. కాబట్టి, ఈ నిర్వచనం ప్రకారం, ఇస్లాం ధర్మంలోనికి ప్రవేశించమని ఎవ్వరినీ బలవంతం చేయకూడదు.

## క్రింది విషయాలను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించండి:

- ఇండోనేషియా దేశం ప్రపంచంలో అత్యధిక ముస్లిం జనాభా కలిగి ఉన్నది. అయినా అక్కడ ఎన్నడూ ఇస్లామీయ సైన్యం కాలుమోపలేదు.
- తరతరాలుగా అరేబియా గుండెకాయలో దాదాపు 14 మిలియన్ల అరబ్ కాప్టిక్ క్రైస్తవులు సురక్షితంగా జీవిస్తున్నారు.
- ఈనాడు పాశ్చాత్య దేశాలలో ఇస్లాం ధర్మం అన్ని ధర్మాల కంటే అత్యంత వేగంగా వ్యాపిస్తున్నది.
- అణచివేతను, దౌర్జన్యాన్ని వ్యతిరేకించేందుకు మరియు న్యాయాన్ని స్థాపించేందుకు జిహాద్ ధర్మయుద్ధం అనుమతించబడినా, ప్రజలను ఇస్లాం ధర్మం స్వీకరించమని బలవంతం పెట్టేలా జిహాద్ యుద్ధం చేసేందుకు అనుమతి లేదు.
- దాదాపు 800 సంవత్సరాల పాటు స్పెయిన్ దేశాన్ని ముస్లింలు పరిపాలించారు. అయినా అక్కడ ఎన్నడూ ప్రజలను ఇస్లాం స్వీకరించమని బలవంతపెట్టలేదు.

## ముగింపు

తప్పొప్పుల గురించి సరిగ్గా పరిశోధించకుండా, అప్రామాణికమైన చోట్ల నుండి ఇస్లాం ధర్మం గురించి నేర్చుకోవడం చాలా ప్రమాదకరమైన విషయం. అది అనేక అపార్థాలకు దారి తీస్తుంది. కాబట్టి ఇస్లాం గురించి తప్పుగా ప్రచారం

చేసే అలాంటి అపార్థాలను నమ్మి, మార్గభ్రష్టులు కాకండి – మొత్తం మానవజాతిలో దాదాపు నాలుగోవంతు కంటే ఎక్కువ ప్రజలు దృఢంగా విశ్వసిస్తున్న గొప్ప ధర్మం ఇస్లాం ధర్మం.

ఇస్లామీయ సందేశ మొత్తం మానవజాతి కొరకు మార్గదర్శిని కాదా? అది జాగ్రత్తగా పరిశీలించవలసిన, దీర్ఘాలోచన చేయవలసిన హక్కు కలిగి లేదా?

# 13. ఇస్లాం తీవ్రవాద ధర్మం కాదు

ఖుర్ఆన్ లోని అల్లాహ్ ప్రకటన యొక్క తెలుగు భావానువాదం:

"...ఎవరైనా ఒక అమాయకుడిని సరైన కారణం లేకుండా హత్య చేస్తే, అతడు సర్వ మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడితే, అతడు సర్వ మానవాళి ప్రాణాలు కాపాడినట్లే. ..." ఖుర్ఆన్ 5:32

## ఇస్లాం... ఒక తీవ్రవాద ధర్మమా?

"ఇస్లామీయ తీవ్రవాదులు!" "ముస్లిం మతఛాందసవాదులు!" "తీవ్రవాదులు!" "ఇస్లామీయ ఉగ్రవాదులు!" ఈమధ్య కాలంలో తప్పుగా ముస్లింలపై మరియు కొన్ని ముస్లిం వర్గాలపై బలవంతంగా రుద్దబడుతున్న కొన్ని మారుపేర్లు ఇవి.

ఇస్లాం గురించి మీడియా చిత్రీకరిస్తున్న ఈ తప్పుడు సమాచారం తరుచుగా ఇస్లాం గురించి కొద్దిగా మాత్రమే తెలిసిన ప్రజలను తప్పుదోవ పట్టించి, ఈ ప్రశాంతమైన మరియు సహనశీల జీవన విధానం గురించి వారిలో ప్రతికూల భావాలను రేకెత్తిస్తున్నది.

పీటర్ మాన్నింగ్ (Peter Manning), పాత్రికేయునిగా 30 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్న ఒక జర్నలిష్టు. ఆయన తన పుస్తకం "Us and Them (మేము మరియు వారు)" లో ఇలా వ్రాసినారు: "*అరబ్ మరియు ముస్లిం ఆస్ట్రేలియన్ల దైనందిన జీవితంలోని వాస్తవికతల మరియు మన (ఆస్ట్రేలియా) మీడియా చూపుతున్న దాని మధ్య చాలా పెద్ద వ్యత్యాసం ఉందని నా అనుభవం చెబుతున్నది.*

*60% కంటే ఎక్కువ కేసులలో [కేవలం 2 ప్రధాన వార్తాపత్రికల కవరేజీ నుండి], 'హింసాత్మక, దౌర్జన్యపూరిత', 'చావు', 'దాడి', 'చంపడం, హత్య చేయడం', 'ఆత్మహత్య' లేదా 'గన్ మేన్' మొదలైన పదాలు 'అరబ్', 'ఫలస్తీనా', 'ముస్లిం' లేక 'ఇస్లాం' పదాలకు చాలా దగ్గరగా వాడటం జరిగింది*"

మరి ఇలా జరుగుతున్నప్పుడు, అనేక మంది ప్రజలు ఇస్లాం ధర్మానికి టెర్రరిజంతో ముడిపెట్టడంలో ఆశ్చర్యపరచడంలో ఇంకేమైనా మిగిలి ఉందా?

ఇస్లాం మరియు దాని అనుచరుల గురించి తమకేమీ తెలియదని ఆస్ట్రేలియాలోని మూడింట రెండు వంతుల ప్రజలు అంగీకరించడాన్ని ఒక సర్వే బయట పెట్టి, అజ్ఞానం యొక్క అసలు సమస్యను ఎత్తి చూపింది.

ఆస్ట్రేలియా – ఇండోనేషియా పరిశోధనా సంస్థకు చెందిన డాక్టర్ డున్ (Dr Dunn), *"ఎవరికైతే ఇస్లాం గురించి అతి తక్కువగా తెలుసో మరియు ఎవరైతే ముస్లింలతో అతి తక్కువ సంబంధాలు కలిగి ఉన్నారో, అలాంటి వారిలో ఎక్కువమంది ఇస్లాం నుండి ప్రమాదాన్ని శంకిస్తున్నారు"* అని అభిప్రాయ బడినారు.

మీడియా తప్పుడు ప్రచారం యొక్క ప్రాబల్యం మరియు ఇస్లాం గురించిన ప్రజల అజ్ఞానాన్ని ప్రామాణిక ఇస్లామీయ బోధలను సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారా అధిగమించవచ్చు. ఇక్కడ ప్రామాణిక ఇస్లామీయ బోధనలంటే (సర్వలోకాల సృష్టికర్త, ప్రభువు అయిన అల్లాహ్ యొక్క దివ్యవాణి అని ముస్లింలు నమ్మే) దివ్యఖుర్ఆన్ మరియు సున్నతులు (ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ప్రామాణిక బోధనలు, ఉపదేశాలు). వీటి సరైన అవగాహన ద్వారా తీవ్రవాదం, హింస, దౌర్జన్యం మరియు ఉగ్రవాదం మొదలైన వాటికి ఇస్లాం ధర్మం పూర్తిగా వ్యతిరేకమనే సత్యాన్ని ఇట్టే గ్రహిస్తారు.

## ఖుర్ఆన్ గురించి ఎలా అపార్థానికి గురి కావచ్చు ...

ఖుర్ఆన్ లేదా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు చదువుతున్నప్పుడు వాటి సందర్భం గురించి అర్థం చేసుకోవలసి ఉంది. ఇస్లాం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నవారు తరుచుగా వాడే క్రింది ఖుర్ఆన్ ఆయతు (వచనం) ను ఒక్కసారి పరిశీలించండి:

“వారు మీకు ఎక్కడ ఎదురైతే అక్కడనే వారిని చంపండి. మరియు వారు మిమ్మల్ని ఎచ్చటి నుండి తరిమి వేసారో, మీరు కూడా వారిని అచ్చటి నుండి తరిమి వేయండి. మరియు సత్యధర్మానికి అడ్డుగా నిలవటం (ఫిత్నా), చంపటం కంటే ఘోరమైనది. మస్జిద్ హరమ్ వద్ద వారు మీతో యుద్ధం చేయనంత వరకు మీరు వారితో అక్కడ యుద్ధం చేయకండి. ఒకవేళ వారు మీతో యుద్ధం చేస్తే, వారిని వధించండి. ఇదే సత్యతిరస్కారులకు తగిన శిక్ష.” ఖుర్ఆన్ 2:191

కొన్ని సందర్భాలలో చాలా ప్రమాదకరంగా పై వచనాన్ని ఇలా కత్తిరించి, పేర్కొనడం జరుగుతున్నది:

“మరియు వారెక్కడ కనబడితే అక్కడ చంపండి …” ఖుర్ఆన్ 2:191

అయితే వెంటనే ఇక్కడ ప్రత్యక్షమయ్యే ప్రశ్న “ఎవరిని చంపాలి?” ఈ ప్రశ్నకు సరైన సమాధానం కావాలంటే, 2:191కు పూర్వ వచనం మరియు తర్వాత వచనం చదవ వలసి ఉన్నది.

“మరియు మీతో పోరాడే వారితో మీరు అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులను అతిక్రమించకండి. నిశ్చయంగా, అల్లాహ్ హద్దులను అతిక్రమించే వారిని ప్రేమించడు.“ ఖుర్ఆన్ 2:190

పై వచనంలో ఆత్మ రక్షణ కోసం మీపై జరిగే దాడిని త్రిప్పి కొట్టాలని స్పష్టం చేస్తున్నది. ఇక 2:191 తర్వాత వచనం:

“కానీ, వారు (యుద్ధం చేయడం) మానుకుంటే, (మీరు కూడా మానుకోండి). ఎందుకంటే నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.” ఖుర్ఆన్ 2:192

వారి ధార్మిక విశ్వాసం వలన ముస్లింలను వారి ఇళ్ళ నుండి బయటికి వెళ్ళగొడుతున్న సందర్భంలో ఈ ఖుర్ఆన్ వచనాలు అవతరించాయి. పదేళ్ళ కంటే ఎక్కువ సమయం వరకు వారు తమపై జరుగుతున్న అత్యాచారాలను,

హింసలను సహించారు. చివరికి తమ స్వంత జన్మభూమిని వదిలి పెట్టి, సురక్షిత ప్రాంతానికి వలస పోయారు.

పైవచనాలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో, మక్కా నగరంలోని అరబ్ బహుదైవారాధకుల గురించి పేర్కొంటున్నాయి. వారు ముస్లింలపై ఎంతో దౌర్జన్యం చేసారు, పీడించారు, వేధించారు. ముస్లింలు ఆశ్రయం పొందిన స్థావరంపై దాడి చేసేందుకు పన్నాగాలు పన్నారు.

కాబట్టి, అలాంటి సందర్భాలకు మాత్రమే పై వచనం వర్తిస్తుంది.

మనకు ఈ ఉపమానం స్పష్టం చేస్తున్నదేమిటంటే, ఖుర్ఆన్ వచనాలను వాటి సందర్భాన్ని అనుసరించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించ వలెను. ఎందుకంటే అవి 23 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో దశల వారీగా వివిధ సందర్భాలలో అవతరించాయి. ఇక్కడ గుర్తించవలసిన మరో ముఖ్య విషయం ఏమిటంటే ఖుర్ఆన్ గ్రంథం అరబీ భాషలో అవతరించింది. కాబట్టి, వేర్వేరు భాషలలోని అనువాదాలు ప్రజలను దారితప్పించే అవకాశం ఉంది, వాటి అనువాదం తప్పు కావచ్చు కూడా.

## అనుమతించబడిన ఆయుధాలు / యుద్ధాలు:

ఇతర ప్రజల వలే తమపై జరిగే దౌర్జన్యం, హింస, అణచివేతల నుండి తమను తాము కాపాడుకోవడానికి శత్రువుల దాడిని త్రిప్పి కొట్టే న్యాయమైన హక్కు ముస్లింలకు కూడా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సమాజ సంరక్షణ కోసం లేదా అరాచకత్వాన్ని నిరోధించేందుకు సాయుధ పోరాటం అనుమతించబడిందని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది – అది ఆయా సందర్భాలను బట్టి ఎదురు దాడి కావచ్చు లేదా తమపై జరుగుతున్న దాడిని త్రిప్పికొట్టే డిఫెన్స్ పోరాటం కావచ్చు. ఇతర జీవన విధానాలకు వలే, తనకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించబడినప్పుడు, తన ఉనికిని స్వయంగా కాపాడుకునే హక్కు ఇస్లాం ధర్మానికీ ఉన్నది. ఖుర్ఆన్ లోని (22:39) వచనం

యొక్క భావానువాదం ఇలా ఉన్నది: "తమపై దాడి చేసిన వారితో యుద్ధం చేయడానికి అనుమతి ఇవ్వబడుతున్నది. ఎందుకంటే వారు అన్యాయంలో మునిగి పోయారు."

అయితే, శత్రువు యుద్ధ విరమణ చేసినప్పుడు, తాము కూడా తప్పనిసరిగా యుద్ధ విరమణ చేయాలని ముస్లింలకు ఆజ్ఞాపించబడింది. "కానీ ఒకవేళ వారు శాంతి వైపుకు మొగ్గితే, నీవు కూడా అటువైపు మరలు. మరియు అల్లాహ్ పై నమ్మకం ఉంచు. నిశ్చయంగా ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు." ఖుర్ఆన్ 8:61

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత సన్నిహితులు మరియు మొట్టమొదటి ఖలీఫా అయిన అబూ బక్ర్ రదియల్లాహు అన్హు యుద్ధరంగంలో ముస్లింలు పాటించవలసిన ఇస్లామీయ నియమాల గురించి ఇలా ప్రకటించారు.

యుద్ధరంగంలో, క్రింద పేర్కొనబడిన అంశాలు పూర్తిగా నిషేధించబడినాయి:

- నమ్మకద్రోహం, మోసం చేయడం
- మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చిన్నాభిన్నం చేయడం
- సన్మార్గం విడిచి, పెడదారి పట్టడం
- మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులను చంపడం.
- చెట్లు నరకడం లేదా కాల్చడం, ముఖ్యం ఫళ్ళుఫలాలు ఇచ్చేవాటిని.
- శత్రుపక్షానికి చెందిన పశుపక్ష్యాదులను అనవసరంగా వధించడం.
- తమ జీవితాన్ని దైవారాధనలకు అంకితం చేసుకున్న పురోహితులు, పూజారులు, పండితులకు హాని కలిగించడం

2:190లో మనం చదివినట్లుగా, హద్దుమీరి ప్రవర్తించవద్దని అల్లాహ్ ఇలా ముస్లింలను ఆదేశిస్తున్నాడు, "హద్దులు దాటి ప్రవర్తించవద్దు." యుద్ధ

రంగంలోనైనా సరే, హద్దులు దాటి ప్రవర్తించే మినహాయింపు ఇవ్వబడలేదు. మూర్ఖంగా, గుడ్డిగా ప్రతీకారం తీర్చుకోకూడదని ఇస్లాం బోధిస్తున్నది.

"ఇతరుల పట్ల మీకున్న ద్వేషానికి లోనై, మీరు న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి. అది దైవభక్తికి సమీపమైంది." ఖుర్ఆన్ 5:8

## తీవ్రవాద దృక్పథం లేక ఉగ్రవాద దృక్పథం

తీవ్రవాదం లేక ఉగ్రవాద దృక్పథం విషయంలో ప్రధాన సమస్య ఏమిటంటే అసలు తీవ్రవాదం, ఉగ్రవాదం లేక టెర్రరిజం అనే దానికి అందరి మధ్య ఏకాభిప్రాయం కుదిరిన నిర్వచనమే లేదు. అంతేగాక, టెర్రరిజం అనేక రూపాలలో మారవచ్చు, ఉదారహణకు:

ది ఇండిపెండెంట్ (The Independent)లో రాబర్ట్ ఫిస్క్ (Robert Fisk) ఇలా వ్రాసినారు: *"ఇస్రాయీలు మరియు ఇస్రాయీలుకు చెందిన పౌర సైన్య మిత్ర వర్గాలు (16 సెప్టెంబరు 1982వ తేదీన) ఫలస్తీనాలోని సబ్రా మరియు షతిలా శరణార్థ క్యాంపులలో మూడు దినాల వరకు మానభంగాలు, కత్తిపోట్లు మరియు హత్యలతో కూడిన భయంకర ఉన్మాద చర్యలను మొదలు పెట్టి, దాదాపు 1,800 ప్రాణాలు పొట్టన పెట్టుకున్నాయి. వెనువెంటనే ముందుగా ప్రణాళిక వేసుకున్నట్లుగా లెబనాన్ దేశంపై ఇస్రాయీలీ ఆక్రమణ మొదలై, PLO (ఫలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్) దేశం వెలుపలకు గెంటివేశాయి. ఈ అరాచకానికి (అమెరికా నుండి) గ్రీన్ లైట్ లభించింది. ఇందులో దాదాపు 17,500 లెబనాన్ మరియు ఫలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వారందరూ దాదాపుగా సామాన్య పౌరులే."*

ప్రొఫెసర్ నోమ్ షోమ్స్కి (Professor Noam Chomsky) ప్రకారం, *"యునైటెడ్ స్టేట్స్ ఒక ప్రధాన టెర్రరిష్టు దేశం అనడం ఏమాత్రం వివాదాస్పదమైన విషయం కాదు. వాస్తవానికి, అది అంతర్జాతీయ ఉగ్రవాదానికి*

*కారణభూతమైన దేశంగా అత్యంత ఉన్నత సంస్థ ఖండించిన ఏకైక దేశం: ది ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్, 1986."*

అలాగే, *"1995వ సంవత్సరంలో స్రెబ్రెనికాలో (Srebrenica) నిరాయుధులైన 8,000 ముస్లింలను భయంకరంగా ఊచకోత కోయడం అనే క్రైస్తవుల హింసాత్మక మరియు అణచివేత ధోరణులు మీడియాలో ఎక్కడా ప్రస్తావనకు నోచుకోలేదు."* – విలియమ్ డాల్రైమ్పుల్, ది ఇండిపెండెంట్, యు.కె. (William Dalrymple, The Independent UK).

*"క్రితం ఆరు దశాబ్దాలుగా పాశ్చాత్య దేశాల క్రైస్తవ నాయకుల చేత బహిరంగంగా కొనసాగిన మారణహోమం – ఒక ప్రపంచ యుద్ధం, కోల్డ్ వార్, హోలోకాస్ట్, రెండు అటామిక్ బాంబులు, అనేక దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల అణచివేతలు, తమ జట్టు దేశాలను యుద్ధాల వైపు ప్రేరేపించడం, న్యూక్లియర్ దేశాలను కవ్వించి తప్పుకునే పన్నాగాలు, ఇంకా నియంతలు, రాష్ట్రీయ తీవ్రవాదులు, రాష్ట్రేతర తీవ్రవాదుల సమర్ధన మొదలైన వాటిని చూసిన తర్వాత, ఇస్లాం ధర్మం అంతర్గతంగా హింసాత్మకమైన ధర్మమా లేక నాగరికమైన ధర్మమా అనే దానిలోని అవాస్తవికతలు తేటతెల్లమై పోతున్నాయి."* – రామా మణి, జెనివా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ (Geneva Centre for Security Policy)

ఇంకా ఎన్నో యూదుల, క్రైస్తవుల టెర్రరిజం ఉదాహరణలు ఉన్నాయి. ఏదేమైనా, మనం ఎన్నడూ అస్సలు జనరలైజ్ చేయకూడదు మరియు యూదులు, క్రైస్తవులందరినీ టెర్రరిష్టులని అనకూడదు. అలాగే, ముస్లింలందరినీ విచారణ బోనులో నిలబెట్ట కుండా ఎవరైతే నేరానికి పాల్పడినారో, వారిని మాత్రమే విచారించాలి.

## ఇస్లాం ధర్మం టెర్రరిజాన్ని బహిరంగంగా ఖండిస్తున్నది

నిరాయుధులైన పౌరుల మనస్సులలో భయందోళనలు రేకెత్తించే చర్యలు, బిల్డింగులను మరియు ప్రాపర్టీలను ఏకమొత్తంగా నాశనం చేయడం, అమాయకులైన పురుషులు, మహిళలు మరియు పిల్లలపై నిర్దయగా బాంబులు కురిపించడం మరియు అవయవచ్ఛేదన శిక్షలు విధించడం మొదలైనవన్నీ ఇస్లాం ధర్మం మరియు ముస్లింల దృష్టిలో పూర్తిగా నిషేధించబడిన మరియు గర్హణీయమైన చర్యలు. అది ఇతర టెర్రరిజం రకాలన్నింటి కంటే ఎక్కువగా లెక్కలేనంత మందిని చంపిన, తీవ్రంగా గాయ పర్చిన, తమ ఇళ్ళ నుండి బయటికి గెంటివేసిన పాశ్చాత్య దేశాల సమర్ధనలోని రాష్ట్రీయ టెర్రరిజంతో పాటు వేరే ఏ టెర్రరిజం అయినా సరే.

ఒకవేళ ఏ ముస్లిం అయినా వ్యక్తిగతంగా టెర్రరిజం చర్యలకు పాల్పడితే, ముందు అతడు ఇతరులను కూడా అనుసరించమని ఆహ్వానిస్తున్న తన ఇస్లాం ధర్మంలోని అసలు ప్రాథమిక ధర్మాదేశాలనే ఉల్లంఘించిన వాడవుతాడు. మరి అలాంటప్పుడు, తీవ్రవాద చర్యలను ఇస్లాం ధర్మం స్వయంగా ఖండిస్తుండగా, ముస్లింలందరినీ ఏక మొత్తంగా తీవ్రవాదులను నిందించడం సబబుగా ఉందా? ముస్లింలు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వయంగా సర్వలోక సృష్టికర్తకు సమర్పించుకునే, శాంతియుతమైన, కరుణ మరియు దయాగుణాలతో నిండిన ఇస్లాం ధర్మాన్ని అనుసరిస్తున్నారు. కొన్ని హింసాత్మక ఘటనలతో అత్యధిక ముస్లింలకు ఎలాంటి సంబంధమూ లేదు – కానీ మీడియా వాటిని ముస్లింకు అంటగడుతున్నది. ఇస్లాం ధర్మం ఉగ్రవాద ధర్మం కాదు, తీవ్రవాద ధర్మం ఎంత మాత్రమూ కాదు.

"ఎవరైతే ధర్మ విషయంలో మీతో యుద్ధం చేయరో మరియు మిమ్ముల్ని మీ గృహాల నుండి వెళ్ళగొట్టరో, వారి పట్ల మీరు సత్ ప్రవర్తనతో మరియు న్యాయంతో వ్యవహరించడాన్ని అల్లాహ్ నిషేధించలేదు. నిశ్చయంగా అల్లాహ్ న్యాయంగా ప్రవర్తించేవారిని ప్రేమిస్తాడు." ఖుర్ఆన్ 60:8

# 14. హిజాబ్ - పరదా

## హిజాబ్ అంటే ఏమిటి?

అరబీ భాషలోని ‘హజబ’ అనే మూలపదం నుండి ’హిజాబ్’ అనే పదం వచ్చింది. దీని అర్థం దాచడం లేక కప్పడం. ఇస్లామీయ పరిభాషలో హిజాబ్ అనే పదం ‘యుక్తవయస్కులైన (రజస్వలైన) ముస్లిం మహిళలు ధరించ వలసిన దుస్తుల’ను సూచిస్తుంది. మొత్తం శరీరాన్ని పూర్తిగా కప్పే లేక దాచే విధంగా ఆ దుస్తులు ఉండాలి. చేతులు మరియు ముఖానికి మినహాయింపు ఉందని కొందరు పండితుల అభిప్రాయం. కొందరు చేతులు మరియు ముఖం కూడా కప్పుకోవడాన్ని లేక దాచుకోవడాన్ని ఇష్టపడతారు. దీనిని నిఖాబ్ లేక బురఖా అంటారు. కేవలం మహిళలు మాత్రమే ఉన్న ప్రాంతంలో వారు హిజాబ్ లో ఉండవలసిన అవసరం లేదు. అలాగే వివాహబంధం నిషేధింపబడిన మహ్రామ్ పురుషుల సమక్షంలో కూడా. అయితే హిజాబ్ అనేది కేవలం బహిరంగ ప్రదర్శన గురించి జాగ్రత పడటం మాత్రమే కాదు; హిజాబ్ లో ఉత్తమ పలుకులు, పాతివ్రత్యం, సచ్ఛీలత, గౌరవప్రదంగా మరియు హుందాగా ఉండే నైతిక ప్రవర్తన మొదలైనవన్నీ వస్తాయి. ఇలాంటి మంచి గుణగణాలను పురుషులు కూడా అలవర్చు కోవలసిన అసరం ఉన్నది. ముస్లిం పురుషులు కూడా తమ హుందాతనం మరియు సచ్ఛీలతలను సూచించేట్లు వదులుగా ఉండే మరియు శరీర భాగాలు కనబడనీయకుండా కప్పి ఉంచే మంచి దుస్తులు ధరించ వలసి ఉన్నది.

## హిజాబ్ కూడా దైవవిధేయతే.

హిజాబ్ వలన అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, మొట్టమొదట ఇది అల్లాహ్ ఆదేశించిన ఆజ్ఞ. కాబట్టి, దీనిని ధరించడమనేది దైవవిశ్వాసాన్ని ధృవీకరించే ఒక ఆచరణ మరియు సృష్టికర్తకు విధేయత చూపినట్లే:

“(ఓ ప్రవక్తా) తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా త్వరగా గుర్తింపబడి, వేధింపులకు గురి కాకుండా ఉంటారు.” ఖుర్ఆన్ 33:59

తన సృష్టికోసం ఏది మంచిదో అత్యంత వివేకవంతుడైన అల్లాహ్ కు బాగా తెలుసు. తద్వారా ఆయన మానవజాతికి ప్రయోజనకరమైన మార్గదర్శకత్వాన్ని పంపినాడు. ఇతర విధేయతా పూర్వకమైన ఆచరణల వలే, హిజాబ్ ధరించడం కూడా తమ ప్రభువు దగ్గరికి చేరుస్తుంది. ధరించే వారిలో సంతృప్తి భావనలు మరియు ప్రశాంతత పెంపొందిస్తుంది. ఎట్టిపరిస్థితులలోనూ హిజాబ్ వస్త్రధారణ వలన పురుషుల స్థాయి కంటే మహిళల స్థాయి దిగజారిపోదు.

## హిజాబ్ అనేది ప్రాతివత్యం, సచ్ఛీలతలను సూచిస్తుంది

ఇస్లాం ధర్మం సమాజంలో ప్రాతివత్యం, సభ్యతా సంస్కారాలను ప్రోత్సహిస్తుంది మరియు అసభ్యత, పోకిరీతనం, అనైతికతలను సాధ్యమైనంతగా తగ్గించాలని ప్రయత్నిస్తుంది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో హిజాబ్ మరియు ఇలాంటి ఇతర విషయాలు సహాయపడతాయి.

“(ఓ ప్రవక్తా) ముస్లిం పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, వారు తమ మర్మస్థానాలను కాపాడుకోవాలనీ, అది వారి కొరకు పవిత్రమైనదనీ వారితో చెప్పు. వారు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు. (ఓ ప్రవక్తా) ముస్లిం స్త్రీలు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మస్థానాలను రక్షించుకోవాలనీ, బహిర్గతమై ఉండేది తప్ప తమ అలంకరణను బహిర్గతం చేయరాదని, తమ వక్షస్థలాలపై ఒణీలు వేసుకోవాలనీ, తమ భర్త లేక తమ తండ్రి లేక తమ మామగారు లేక తమ కొడుకులు లేక తమ భర్త కొడుకులు లేక తమ సోదరులు లేక తమ సోదరుల కొడుకులు లేక తమ అక్కాచెల్లెళ్ళ కొడుకులు

లేక తమతో కలిసి మెలిసి ఉండే స్త్రీలు లేక తమ బానిసలు లేక ఇతరత్రా ఉద్దేశాలు లేకుండా తమకు లోబడి ఉన్న పురుష సేవకులు లేక స్త్రీల గుప్త విషయాల గురించి అవగాహన లేని బాలురు – వీళ్ళ ఎదుట తప్ప ఇతరుల ఎదుట తమ అలంకరణలను కనబడనీయకూడదనీ, దాగివున్న తమ అలంకరణ ఇతరులకు తెలిసిపోయేలా తమ కాళ్ళను నేలపై కొడుతూ నడవరాదనీ వారితో చెప్పు …" ఖుర్ఆన్ 24:30-31

పై ఖుర్ఆన్ వచనాలలో, తమ కంటి చూపు క్రింద ఉంచుకోవాలని మరియు తమ శీలాన్ని కాపాడుకోవాలని ముందుగా పురుషులను సంబోధించడం జరిగింది. సచ్ఛీలత, ప్రాతివత్యం బాధ్యతంతా మహిళల పైనే వేయబడిందనే తప్పుడు వాదనను ఇది స్పష్టంగా ఖండిస్తున్నది.

బహిరంగంగా అసాంఘిక దుస్తులు ధరించడం మరియు కొంటె చేష్టలు చేయడం వంటి వాటిని ఇస్లాం ధర్మం ఖండిస్తున్నది. ఒక ఆచరణాత్మకమైన జీవన విధానంగా, ఏకాంతంలో భార్యాభర్తల మధ్య ప్రేమాభిమానాలు, ఆత్మీయత మరియు సాన్నిహిత్యం పెరగాలని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తుంది.

## హిజాబ్ ఒక రక్షణ కవచం

హిజాబ్ వెనుకనున్న అసలు వివేకం ఏమిటంటే దాని ద్వారా స్త్రీపురుషులలో వీలయినంతగా లైంగిక ప్రలోభాలు మరియు వేధింపులు, కొంటెపనులు, కవ్వింపులు మరియు నైతిక పతనాన్ని సూచించే చెడు పనులు వంటి వాటిని తగ్గించడం. హిజాబ్ వ్యవస్థ క్రింది పేర్కొనబడిన అనేక విధాలుగా ఇరువైపు కుటుంబాలలో మరియు సమాజాలలో పురుషులను, స్త్రీలను మరియు సమాజాన్ని కాపాడుతుంది:

- అవాంఛిత పనులలో ముందడుగు వేయకుండా కవచం వలే మహిళలను కాపాడుతుంది.
- కొంటెచూపులు, అసభ్యకర చేష్టల నుండి మహిళలను సంరక్షిస్తుంది.

- మహిళలపై లైంగిక వేధింపులు తగ్గించేందుకు సహాయపడుతుంది.
- బహిరంగ మేకప్పుల, ఆకర్షణల కారణంగా జరిగే లైంగిక ఆక్రమణల నుండి మహిళలను కాపాడుతుంది.
- చెడు ప్రేరణలు, నష్టదాయకమైన కోరికల నుండి మహిళలను రక్షిస్తుంది.

## హిజాబ్ హుందాతనానికి చిహ్నం

హిజాబ్ మహిళల స్త్రీత్వాన్ని హెచ్చిస్తుంది, ప్రోత్సహిస్తుందే గానీ దానిని అణచి వేయడం లేదు. మహిళలకు హుందాతనాన్ని ఇస్తున్నది. తమపై , తమ అందచందాలపై వ్యాఖ్యానించే అవకాశాన్ని ఇతరులకు ఇవ్వకుండా, తమ స్వంత అభిప్రాయాలపై నిలబడేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. వారెంత అందంగా కనబడుతున్నారు, వారెంత సంపాదిస్తున్నారు వంటి భౌతిక ఆకర్షణల ఆధారంగా వారి విలువ గురించి హుకుంలు జారీ చేసే కన్సూమర్ సొసైటీల దుర్వ్యవస్థకు భిన్నంగా వారి సచ్ఛీలత, జ్ఞానం మరియు సామాజిక సహాయసహకారాలు వంటి అర్థవంతమైన ప్రామాణికతల ఆధారంగా వారి ఆత్మగౌరవాన్ని రూపుదిద్దుకోగలిగే శక్తిని ఇస్లాం ధర్మం మహిళలకు ఇస్తున్నది. అల్లాహ్ దృష్టిలో, స్త్రీపురుషులు సరిసమానం అయ్యేందుకు వారుభయులూ ఒకేలా ఉండవలసిన అవసరం లేదు, ఒకే విధమైన పనులు చేయవలసిన అవసరమూ లేదు. వారికి ఇవ్వబడిన వేర్వేరు పాత్రలలో మరియు బాధ్యతలలో ఇది స్పష్టంగా కనబడుతుంది.

నోబుల్ ప్రైజ్ విజేత తవక్కుల్ కర్మాన్ (The mother of Yemen's revolution) ను జర్నలిష్టులు ఆమె హిజాబ్ గురించి మరియు విద్యాభ్యాసంలో మరియు తెలివితేటలలో ఆమె ఉన్నత స్థానానికి చేరుకున్న తర్వాత కూడా హిజాబ్ ధరించడాన్ని గురించి ప్రశ్నించినప్పుడు, ఆమె ఇలా జవాబిచ్చారు:

"పూర్వకాలంలో మానవుడు దాదాపు నగ్నంగా ఉండేవాడు. తన బుద్ధివివేకం పరిణితి చెందిన కొద్దీ, దుస్తులు ధరించడం మొదలు పెట్టాడు. నేను ఈ రోజు

ఎలా ఉన్నానో మరియు ఏమి ధరిస్తున్నానో, అది మానవుడు సాధించిన మహోన్నత ఆలోచన మరియు నాగరికతలకు ప్రాతినిధ్యం వహిస్తున్నదే గానీ తిరోగమనాన్ని కాదు. అంతేగాక దుస్తులు త్యజించడమనేది మరలా ప్రాచీనకాలానికి చేర్చే తిరోగమనాన్ని సూచిస్తుంది.”

## హిజాబ్ పరువు, గౌరవమర్యాదలకు చిహ్నం

ఈనాడు అనేక సమాజాలలో, అనేక మంది మహిళలకు బాల్యం నుండే “వారి విలువ వారి బాహ్యాకర్షణకు, అందచందాలకు ప్రపోషనల్ గా ఉంటుందని” నేర్పుతున్నారు. తోటివారి అసమంజసమైన ఒత్తిడి మరియు సొసైటీ అంచనాలను సంతృప్తి పరిచేందుకు, అందచందాల మరియు ఆకర్షణల అవాస్తవమైన, అర్థం పర్థం లేని ప్రామాణికతలను అనుసరించేలా వారు ఒత్తిడికి గురవుతున్నారు. బాహ్య అలంకరణలు, అందచందాలకు అమితంగా ప్రాధాన్యత ఇవ్వబడుతున్నటు వంటి మిడిమిడి వాతావరణంలో, ఏ వ్యక్తి అయినా అంతర్గత సౌందర్యానికి అంతగా విలువ ఇవ్వడు.

ఏదేమైనా చూపులు లేక శారీరక అందచందాల ఆధారంగా కాకుండా ఆమె యొక్క సద్గుణాలు మరియు ఆచరణల ఆధారంగానే ఒక మహిళ గౌరవించబడాలని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది. ఎందుకంటే తన బాహ్య అందచందాలపై ఆమెకు చాలా తక్కువ కంట్రోల్ ఉంటుంది లేదా అసలు కంట్రోల్ యే ఉండదు, పైగా అవి తాత్కాలికమైనవి. సమాజంలో గుర్తింపు పొందడం కోసం లేక స్థానం సంపాదించడం కోసం ఆమె తన శారీరక అందచందాలను మరియు ఆకర్షణలను వాడుకోవలసిన అవసరం లేదు. అందువలన హిజాబ్ మహిళల ఆత్మగౌరవానికి సముచిత స్థానాన్నిస్తూ, బాహ్య ఆకర్షణలకు దూరంగా మహిళలందరూ సులభంగా పాటించగలిగే ధర్మనిష్ఠ, ధార్మిక చింతన, సద్గుణం, సత్ ప్రవర్తన, సుశీలత, అణుకువ, సిగ్గుబిడియం, పాతివ్రత్యం, ముగ్ధత్వం మరియు బుద్ధివివేకం మొదలైన వాటికి గొప్ప ప్రాధాన్యతను ఇస్తున్నది.

హిజాబ్ లేదా బురఖా ధరించే ప్రతి మహిళ ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తించబడుతున్నది. తాము ధరించిన దుస్తులు ఒకేలా ఉండటం వలన, హిజాబ్ లేదా బురఖా వేసుకుంటున్న మహిళలందరి గురించి ఒకే రకమైన భారీ తీర్పునివ్వడం చాలా తప్పు మరియు అన్యాయం.

## బైబిల్ లో హిజాబ్ ప్రస్తావన

హిజాబ్ అనేది కొత్తగా ఆదేశించబడలేదు. ముస్లిం మహిళలు జీసస్ తల్లి మర్యమ్ వంటి  పూర్వకాలంలోని ఉత్తమ మహిళల ఉపమానాలను అనుసరిస్తున్నారు. హిజాబ్ ను ధృవీకరిస్తున్న బైబిల్ లోని కొన్ని వచనాలు,

"ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషు డనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసి కొనవలెనని కోరుచున్నాను. ఏ పురుషుడు తలమీదముసుకు వేసికొని ప్రార్థన చేయునో లేక ప్రవచించునో, ఆ పురుషుడు తన తలను అవమానపరచును.ఏ స్త్రీ తలమీద ముసుకు వేసికొనక ప్రార్థనచేయునో లేక ప్రవ చించునో, ఆ స్త్రీ తన తలను అవమానపరచును; ఏలయనగా అది ఆమెకు క్షౌరము చేయబడినట్టుగానే యుండును. ఏ స్త్రీ తలమీద ముసుకు వేసికొనక ప్రార్థనచేయునో లేక ప్రవ చించునో, ఆ స్త్రీ తన తలను అవమానపరచును; ఏలయనగా అది ఆమెకు క్షౌరము చేయబడినట్టుగానే యుండును. స్త్రీ ముసుకు వేసికొననియెడల ఆమె తల వెండ్రుకలు కత్తిరించుకొనవలెను. కత్తిరించుకొనుటయైనను క్షౌరము చేయించు కొనుటయైనను స్త్రీకవమానమైతే ఆమె ముసుకు వేసికొన వలెను" **1కొరింథీయులకు 11:3-6**

"మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగు మాత్రపు వస్త్రముల చేతనేగాని, జడలతోనైనను, బంగారముతోనైనను, ముత్యములతోనైనను మిగుల వెల గల వస్త్రములతోనైనను అలంకరించుకొనక,

దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్ క్రియల చేత తమ్మును తాము అలంకరించుకొనవలెను." **1 తిమోతికి 2:9-10**

## హిజాబ్ ఆత్మవిశ్వాసానికి చిహ్నం

తాము కూడా మానవులే అనే ఆత్మవిశ్వాసం తమలో పెంపొందించుకునేలా హిజాబ్ మహిళలకు సహాయపడుతుంది. జీవితంలో పనికి వచ్చే అసలు విషయాలపై దృష్టి కేంద్రీకరించేలా చేసి మహిళలలోని ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. భౌతిక ఆకర్షణలతో ఇతరులపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించడంలో చాలా ప్రమాదకరమైన మరియు అనారోగ్యకరమైన పర్యవసనాలు ఎదుర్కోవలసి వస్తుంది. కొందరు స్త్రీలైతే, విచ్చలవిడితనంలో రోజురోజుకీ పెరిగి పోతున్న సమాజం డిమాండ్ ను పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తూ, ప్రజలు తమను మెచ్చుకోవాలనే ఆకాంక్షతో నైతిక హద్దులు దాటి, ప్రమాదకరమైన స్థాయికి చేరుకుంటున్నారు. తమపై తమకు నమ్మకం లేని అలాంటి స్థితి నుండి మానసికంగా మరియు శారీరకంగా కాపాడేందుకు హిజాబ్ సహాయ పడుతుంది. బాహ్య అలంకరణలను తమ స్వంత స్పృహ లోపలే తగిన హద్దులలో ఉంచుతుంది.

"అణచివేయబడటం వలన నేను దానిని ధరించడం లేదు, నాపై నాకు సాధికారాన్ని ఇస్తుండటం వలన నేను దానిని ధరిస్తున్నాను." జౌమానా , 23, మెలబోర్న్

## హిజాబ్ అంటే ...

- సమాజానికి తోడ్పాటు అందజేయక అంతరాయం కలిగించే ఆటంకం కాదు.
- అణచివేతకు చిహ్నం కాదు.
- కేవలం స్త్రీలు మరియు దగ్గరి రక్తసంబంధీకులైన పురుషులు ఉన్నచోట అవసరం కాదంటూ వెసులు బాటునిస్తున్నది.

- పురుషుల కంటే స్త్రీలను తక్కువగా చూపే చిహ్నం కాదు.
- తన అభిప్రాయాలు మరియు ఆలోచనలు బయటికి చెప్పకుండా స్త్రీలను నిర్భందించే వ్యవస్థ కాదు.
- విద్యార్జన చేయకుండా లేక సముచితమైన ఉద్యోగంలో చేరకుండా స్త్రీలను నిర్భంధించే వ్యవస్థ కాదు.
- ఒక పోర్టబుల్ జైలు వంటిది కాదు.
- ముస్లిమేతరులకు వ్యతిరేకంగా ధిక్కరణ, ప్రతిఘటన లేక నిరసన చర్య కాదు.
- కొత్తగా మొదలు పెట్టింది కాదు – చారిత్రక పరంగా అనేక మంది ఉత్తమ స్త్రీలు దీనిని ధరించేవారు.
- సామాజిక విలువలకు వ్యతిరేకం కాదు – ఎలాంటి దుస్తులు ధరించారో అనే దాని మీద ఆధారపడి ప్రజల గురించి తీర్మానించకూడదని, వేరుగా చూడకూడదని, అవమాన పరచకూడదని సామాజిక విలువలు చెబుతున్నాయి. తమకు ఇష్టమైన రీతిలో దుస్తులు ధరించే మరియు ఇంటి నుండి బయటికి వచ్చే హక్కు ప్రజలకు ఉంది.
- ఇతరులను భయపెట్టుటకు లేదా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనేందుకు ధరించడం లేదు.

## కొందరు ముస్లిం మహిళలు హిజాబ్ గురించి ఏమంటున్నారు

"17 ఏళ్ళ వయస్సులో నేను దానిని ధరించాను. అయితే అంతకు ముందు నుండే ఎందుకు ధరించడం ప్రారంభించలేదని నేను బాధ పడ్డాను." ఫాతెన్, 27, మెల్ బోర్న్

"దానిని ధరించేందుకు సిద్ధం పడటం గొప్ప కాదు. అయితే దానిని ధరించేంత అదృష్టం పొందటం నిజంగా ఒక గొప్ప విషయం." మదీనా, 22, మెల్ బోర్న్

"హిజాబ్ దుస్తులు నా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు మరియు నా ఛాయిస్ లను సూచిస్తున్నాయి. అంతేగాని పురుషుల మరియు మీడియా కోరికలకు బలయ్యే నా అణచివేతను కాదు." నుస్సైబాహ్, 45, మెల్ బోర్న్

"హిజాబ్ వేసుకోవడం నాకెంతో ఇష్టం. ఎందుకంటే, నేనది అల్లాహ్ కోసం చేస్తున్నాను. నేనెప్పుడు దాని గురించి ఆలోచించినా, నా ముఖంపై చిరునవ్వు కనబడుతుంది." ఆయెషా,13, మెల్ బోర్న్

"అది పురుషుల ఆకలి చూపుల నుండి నన్ను కాపాడుతూ, స్వేచ్ఛగా ఉన్నత విద్యనభ్యసించడం మరియు విద్యాలయాలకు వెళ్ళడం వంటి నా లక్ష్యాల్ని సాధించేందుకు అనుమతిస్తుంది. నా బయటి అలంకరణల ఆధారంగా నన్ను గురించి తీర్మానించుకోకుండా, నా ఆలోచనలు మరయు నా సద్గుణాల ఆధారంగా నా గురించి తీర్మానించుకునేలా ప్రజలపై ఒత్తిడి చేస్తుంది." Ms. ఫ్లావియా, 22, అమెరికా

"నా శరీరం నా ఇష్టం. నేనేమి ధరిస్తున్నానో దాని గురించి ఇతరులకు సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరం లేదు. ఇది నా ధర్మంలోని ఒక భాగం. నేను ధరించాలని ఎంచుకోవడం ద్వారా నేను ఇతర మానవుల కంటే తక్కువగా దిగజారి పోవడం లేదు." Ms. యాస్మిన్, 21, ఆస్ట్రేలియా

**ముగింపు**

ఒక ముస్లిం మహిళకు మరియు ఆమె సృష్టికర్తకు మధ్య హిజాబ్ అనేది విధేయతాపూర్వకమైన ఒక ఉత్తమ ఆచరణ. అది స్వాధికారం మరియు ఆత్మగౌరవాలకు మూలం. తమ దైవవిశ్వాసంలో భాగంగా ప్రపంచం నలుమూలలా మిలియన్ల కొద్దీ ముస్లిం మహిళలు స్వచ్ఛందంగా హిజాబ్ వేసుకోవడాన్ని ఎంచుకుంటున్నారు. అణచివేతకు బహుదూరంగా, హిజాబ్

అనేది నిజమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, పవిత్రతకు మరియు అతి ప్రధానంగా దైవవిశ్వాసానికి ప్రతీక. ఇస్లామీయ బోధనలలో స్త్రీలను గౌరవించడమనేది ఎంతో ముఖ్యమైన విషయం. ఇది హిజాబ్ వ్యవస్థ ద్వారా నిరూపించబడుతున్నది.

ఏనాడైతే సమాజంలో స్టేటస్ కోసం స్త్రీలు తమను తాము బహిరంగంగా చూపుకోవలసిన దీనస్థితి రాదో, మరియు స్త్రీలు తమ శరీరాన్ని తమ ఇష్టప్రకారం దాచుకునే స్వంత నిర్ణయాన్ని సమర్థించుకోగలుగుతారో అప్పుడే నిజమైన సమానత్వం స్థాపించబడుతుంది.

# 15. బురఖా & నిఖాబ్ లలోని వాస్తవాలు

**బురఖా** (పరదా) మరియు **నిఖాబ్** (ముఖం & అరచేతులు కూడా కనబడకుండా కప్పుకునే ముసుగు) లు చాలా వివాదాస్పదమైన, వాడి వేడి డిబేటు అంశాలై పోయాయి. అనేక దేశాలు ఈ ధార్మిక దుస్తులు ధరించకూడదని నిషేధించగా, ఇతరులు వాటి వాడకంపై నిషేధం విధించాలని లేదా పరిమితం చేయాలనే ఆలోచనలో ఉన్నాయి.

బురఖా మరియు నిఖాబ్ లు ధరించడాన్ని ఖండిస్తూ అనేక వాదనలు చేయబడు తున్నాయి. వాటిని సంఘ వ్యతిరేక చర్యలుగా, తిరోగమనం మరియు అణచివేత చిహ్నాలుగా పేర్కొనబడుతున్నాయి. అవి అసలు ఇస్లాం ధర్మంలోని భాగాలు కావనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కరపత్రం ఇస్లామీయ దృష్టికోణంలో బురఖా మరియు నిఖాబ్ ల గురించి చర్చిస్తున్నది. ఈ ధార్మిక దుస్తులు ధరించకూడదని ఆటంకాలు సృష్టిస్తున్న అజ్ఞానుల అనేక వాదనలను మరియు ఆరోపణలను సంబోధిస్తున్నది.

## ఇస్లామీయ దుస్తులలోని రకాలు

"(ఓ ప్రవక్తా) తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా త్వరగా గుర్తింపబడి, వేధింపులకు గురి కాకుండా ఉంటారు." ఖుర్ఆన్ 33:59

బహిరంగ ప్రదేశాలలో మహిళలు ధరించవలసిన ఇస్లామీయ దుస్తులు ప్రధానంగా మూడు రకాలు :

1. **హిజాబ్ :** ఇది సర్వసాధారణమైన ఇస్లామీయ వస్త్రధారణ. ఇది ముఖం మరియు చేతులు మినహాయించి, మహిళ శరీరాన్ని పూర్తిగా కప్పుతుంది.

2. **నిఖాబ్ :** ఇది కూడా హిజాబ్ వంటిదే అయితే కేవలం కళ్ళకు సరి పోయేటంత చోటు వదిలి, మొత్తం ముఖాన్ని కప్పివేస్తుంది.

3. **బురఖా :** ఇది అంత ఎక్కువగా వాడకంలో లేదు. వల లాంటి పరదాతో రెండు కళ్ళనీ కప్పివేస్తూ, మొత్తం శరీరాన్ని పూర్తిగా కప్పుతుంది. .

ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం మహిళలందరూ హిజాబ్ కప్పుకోవడాన్ని సాధారణంగా చూస్తుంటాము. అయితే కొన్ని ప్రత్యేక దేశాలలో మాత్రమే సాధారణంగా నిఖాబ్ మరియు బరఖా కప్పుకోవడం కనబడుతుంది.

ఇతర మహిళల ముందు కూడా ప్రైవాటిలో ఏదో ఒక పరదా కప్పుకోవటం ముస్లిం మహిళల కొరకు తప్పనిసరి కాదు. కేవలం ఇస్లామీయ నిబంధనలను అనుసరించి పరపురుషుల సమక్షంలో మాత్రమే ముస్లిం మహిళలు విధిగా పరదా కప్పుకోవలసి ఉన్నది.

## సుస్థిరంగా స్థాపితమైన ఒక ప్రాక్టీసు

బురఖా మరియు నిఖాబ్ లు రెండింటికీ ఇస్లాం ధర్మంలో ప్రామాణిక ఆధారాలు ఉన్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు, అవి రెండూ మామూలు ప్రాక్టీసులో ఉన్నాయి మరియు మొత్తం చరిత్రలో ముస్లింలచే గుర్తించబడినాయి. ముస్లిం మహిళలు పరదా కప్పుకోవడం తప్పనిసరి అని ఇస్లామీయ వచనాలు స్పష్టం చేస్తున్నాయి. తత్ఫలితంగా, బురఖా మరియు నిఖాబ్ లను ఇస్లాంలోని భాగంగా ఇస్లామీయ పండితులు అంగీకరించారు. కానీ, వాటిని తప్పనిసరిగా ధరించవలసి ఉన్నదా లేక ఐచ్ఛికంగా పాటించే శుభమైన ఆచారమా అనే విషయంలో వారి మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇది కొందరు ముస్లిం మహిళలు హిజాబ్ కప్పుకోవడం, మరికొందరు నిఖాబ్ లేదా బురఖా కప్పుకునేందుకు నిర్ణయించుకోవటం వెనుక నున్న కారణాన్ని వివరిస్తున్నది.

## కామన్ ఆరోపణలు

***గమనిక:*** *నిఖాబ్ మరియు బురఖా లను రెండింటినీ ఈ కరపత్రం సింపుల్ గా బురఖా అనే పేరుతోనే రాబోయే పేజీలలో సూచించబోతున్న ది.*

### 'ఇదొక అణచివేత చర్య'

బురఖా కప్పుకోవాలని నిర్ణయించుకున్న ముస్లిం మహిళలు, దానిని ఒక దైవారాధనగా మరియు నేటి ఆధునిక సమాజంలో అశ్లీల ప్రదర్శనల నుండి మహిళలకు స్వేచ్ఛ ప్రసాదించేదిగా భావిస్తూ స్వచ్ఛందంగా తమ ఇష్టానుసారమే బురఖా వేసుకోవాలని  నిర్ణయించుకున్నారు. నిజానికి, తమ ధర్మాచారాలను పాటించకుండా ముస్లిం మహిళలను నిరోధించడమనేదే నిజానికి అణచివేత.

"నిఖాబ్ అనేది ఎంతో స్వేచ్ఛను ప్రసాదిస్తుంది మరియు అదొక సాధికారిక అనుభవం. నా జీవిత లక్ష్యాలను అర్థం చేసుకోవడానికి మరియు పరపురుషుల కొంటె చూపుల నుండి కాపాడుకుంటూ స్కూలుకు వెళ్ళడానికి అది నాకు అనుమతిస్తున్నది. నా ఆలోచనలు మరియు నైతిక ప్రవర్తన ఆధారంగా కాకుండా నా బహిరంగ సౌందర్యం ఆధారంగా నా గురించి ఒక నిర్ణయానికి రాకుండా ప్రజలను ఆపుతుంది." ఫ్లావియా, 22 ఏళ్ళు, అమెరికా (Ms. Flavia, 22, USA)

### 'ఇదొక తిరోగమన చర్య'

బురఖా అనేది ఏదో ఒక స్వల్పకాలిక ప్రాక్టీసు కాదు. అదొక ధార్మిక వస్త్ర ధారణ మరియు నియమిత సమయానికి మాత్రమే చెందదు, కొంతకాలం తర్వాత పాతబడి కనుమరుగై పోయేది కాదు. వాస్తవానికి, ఆధునిక సమాజాలలో బురఖా చాలా ఎక్కువగా ప్రజాదరణ పొందుతున్నది, ముఖ్యంగా పాశ్చాత్య నవముస్లింలలో.

"నా శరీరం నా ఇష్టం. నేనేమి ధరించాలో ఆ దుస్తుల గురించి ఇతరుల ముందు సమర్ధించుకోవలసిన అవసరం నాకు లేదు. బురఖా నా ధర్మంలోని ఒక భాగం, దానిని ధరించాలనే నా ఎంపిక, నన్ను ఇతరుల కంటే తక్కువ స్థాయిలో దిగజార్చదు." యాస్మిన్, 21 ఏళ్ళు, ఆస్ట్రేలియా (Ms. Yasmin, 21, Australia).

## 'ఇదొక బెదిరింపు చర్య'

బురఖా ధరించడమనేది బెదిరింపుకు, భయభ్రాంతులకు గురి చేసే దుస్తులుగా కొందరు ప్రజలకు కనిపించవచ్చు. అయితే ఇతరులను బెదిరించే లేదా భయపెట్టే సంకల్పంతో అది ధరించబడటం లేదు. తరుచుగా ప్రజలు తమకు తెలియని విషయాల నుండి భయభ్రాంతులకు గురవుతూ ఉంటారు. బురఖా అనేది కేవలం ఒక వస్త్రం ముక్క. అది ఎవ్వరినీ భయభ్రాంతులకు గురి చేసే అవకాశం లేదు. బురఖా వెనుక ఉన్న వ్యక్తులు సింపుల్ గా తమ ధర్మాన్ని అనుసరించాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఆసక్తికరమైన ఒక విషయం ఏమిటంటే, ఇతర దుస్తులు భయభ్రాంతులు కలిగించేవిగా పరిగణించబడటం లేదు. ఎందుకంటే వాటిని సమాజంలోని అధికశాతం ప్రజలను ఆమోదించారు. ఉదాహరణకు పచ్చబొడుపులు, అతి తక్కువ మోతాదులో ఉండే చాలీ చాలని దుస్తులు, అంగాంగ ప్రదర్శన చేసే దుస్తులు, దేహంపై కుట్లు మరియు చీల్చడాలు, విపరీతంగా కనబడే కేశాలంకరణలు మొదలైనవి వాటిలో కొన్ని.

## 'పురుష ఆధిపత్యానికి చిహ్నం'

బురఖా ధరించడమనేది స్త్రీలను ఏ విధంగానూ పురుషుల కంటే తక్కువ స్థాయికి దిగజార్చడం లేదు. పురుష ఆధిపత్యానికి బురఖా ఒక చిహ్నం అని వాదించడమనేది అనేక మంది మహిళలు తమ ఇష్టానుసారం స్వచ్ఛందంగా బురఖా ధరిస్తున్న వాస్తవానికి వ్యతిరేకంగా పోతున్నది. అలా స్వచ్ఛందంగా బురఖా కప్పుకుంటున్న వారిలో అనేక మందికి అసలు పురుష

బంధువులే లేరు లేదా వారి పురుష బంధువుల ఇష్టానికి వ్యతిరేకంగా వారు బురఖా కప్పుకుంటున్నారు.

## ‘ఇదొక అసాంఘిక చర్య’

సమాజంలోని ఇతర వ్యక్తులతో పరస్పరం సంభాషించకుండా లేదా సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకోకుండా నిరోధించే ఏ విషయమూ బురఖాలో లేదు. వాస్తవానికి, కేవలం మహిళలు మాత్రమే ఉన్నప్పుడు, హిజాబ్ లేదా బురఖా లలో ఏదీ కప్పుకోవలసిన అవసరం లేదు.

బురఖా కప్పుకునే ప్రతి మహిళా ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలిగి ఉన్న మహిళ. కామన్ గా ధరిస్తున్న వస్త్రం ఆధారంగా ఆ మహిళలందరి గురించి ఏక మొత్తంగా అలా తీర్మానించడం చాలా అన్యాయం మరియు సరైన పనీ కాదు.

## ‘సామాజిక కార్యక్రమాలలో పాల్గోనివ్వకుండా మహిళలను ఆపుతుంది’

బురఖా కప్పుకోవడమనేది సామాజిక కార్యక్రమాలలో పాల్గొనకుండా ఆపదు. పై చదువులకు వెళ్ళనీయకుండా ఆపదు. బురఖా కప్పుకుంటూ కూడా ఉన్నత చదువులు పూర్తి చేసిన లేదా విజయవంతంగా తమ కేరీర్ లో ముందుకు అడుగు వేస్తున్న అనేక మంది మహిళలు ఉన్నారు.

ఇస్లాం ధర్మ తొలిదినాల నుండే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భార్య అయిన ఆయేషా రదియల్లాహు అన్హా కనీవినీ ఎరుగని ఒక గొప్ప ఇస్లామీయ పండితురాలిగా ప్రసిద్ధి చెందినారు. ఆమె బురఖా కప్పుకోవడమనేది అలా సుప్రసిద్ధ పండితురాలిగా మారకుండా ఆపలేదు. అలాగే తన సమాజం లోని స్త్రీపురుషులకు ఇస్లామీయ బోధనలు చేయకుండా నిరోధించనూ లేదు.

## ‘ఇందులో భద్రతాపరమైన ప్రమాదం దాగి ఉంది’

భద్రతాపరంగా బురఖా అనేది మోటారు సైకిలు హెల్మెటు, పెద్ద పెద్ద సన్ గ్లాసులు, పెద్ద పెద్ద తలపాగాల కంటే ఎక్కువ ప్రమాదకరమైంది ఎంత మాత్రమూ

కాదు. దానిని అవసరమైనప్పుడల్లా సెక్యూరిటీ పరీక్షల నిమిత్తం తొలగించ వచ్చు. అయితే అలా తొలగించవలసి వచ్చినప్పుడు, వీలయినంత వరకు లేడీ సెక్యూరిటీ సమక్షంలో మాత్రమే జరగాలి గానీ పురుష సెక్యూరిటీ గార్డుల ఎదురుగా కాదు.

## ‘సామాజిక విలువలకు విరుద్ధం’

బురఖా కప్పుకోవడమనేది అందరికీ ఆమోదయోగ్యమైన కమ్యూనిటీ విలువలకు విరుద్ధం కాదు. ధరించిన దుస్తుల ఆధారంగా లేదా షో ఆఫ్ ల ఆధారంగా ఒకరి స్థాయి గురించి తీర్మానించకూడదని, భేదభావం చూపకూడదని, తప్పుగా ప్రవర్తించకూడదని కమ్యూనిటీ విలువలు నిర్దేశించాయి.

## బురఖా చూసి ప్రజలు ఎందుకు భయపడతారు ?

అనేక మంది ప్రజలకు బురఖా కప్పుకున్న మహిళలు విచిత్రంగా కనబడతారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అలాంటి దృశ్యం మామూలుగా కనపడే దృశ్యం కాదు. ఎందుకంటే కేవలం అల్ప సంఖ్యాక ముస్లిం మహిళలు మాత్రమే దానిని కప్పుకుంటారు. అందువలన అనేక మంది కొరకు అది క్రొత్తగా, విచిత్రంగా కనబడుతుంది. అయితే ఈ కారణం వలన ప్రజలు భయపడటం లేదా అసహ్యించుకోవటం ఎంత మాత్రమూ సబబు కాదు. బురఖా గురించి భయాందోళనలకు గురి చేస్తూ, మీడియా మొదలు పెట్టిన నిరంతర ప్రచారం, బురఖా ప్రత్యేకతల గురించి ఎలాంటి జ్ఞానం లేకుండానే అనేక మంది ప్రజలు ఈ ఇస్లామీయ ఆచరణపై తప్పుగా తీర్మానించుకునేలా చేసింది. అలాంటి పక్షపాత, దురభిమాన ప్రచారం ఎవరికి లాభం కలిగిస్తున్నదో పరిశీలించడం చాలా ముఖ్యం. ఉదాహరణకు కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజల అపార్థాలను మరియు భయాందోళనలను సొమ్ము చేసుకుని, రాజకీయ లబ్ది పొందాలని ప్రయత్నిస్తూ ఉంటాయి.

అసలు విషయం ఏమిటో పరిశోధించకుండా ఇతరులపై అలా తీర్మానించుకోవడం సముచితమైన విషయమేనా?

## మత స్వేచ్ఛ మరియు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కు

స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల ఆధారంగా నేటి ఆధునిక సమాజాలు ఏర్పడినవి. ఇది వారి సభ్యులకు తమ స్వంత ధర్మాన్ని పాటించే మరియు తమకు ఇష్టమైన దుస్తులు ధరించే హక్కులు ఇస్తున్నది. బురఖా కప్పుకోవడాన్ని నిషేధించడమనేది వారి ప్రాథమిక విలువలకు వ్యతిరేక దిశలో తీసుకు పోతున్నది. ఇది కపటత్వం మరియు ద్వంద్వ వైఖరి తప్ప మరేమీ కాదు. వాస్తవానికి, ప్రజల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ మరియు మత స్వేచ్ఛలను స్పష్టంగా నిర్దేశించే అంతర్జాతీయ చట్టాలు ఉన్నాయి:

## సివిల్ & పొలిటికల్ హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడికలు

**ఆర్టికల్ 18:1.** ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఆలోచించే, తమ అంతరాత్మను మరియు ధర్మాన్ని అనుసరించే హక్కు కలిగి ఉన్నారు. ఈ హక్కులో ... తన ధర్మాన్ని లేదా ఆరాధనలలోని విశ్వాసాన్ని స్పష్టంగా విశదీకరించే, శ్రద్ధగా పరిశీలించే, ఆచరించే మరియు బోధించే హక్కులు ఇమిడి ఉన్నాయి.

అంతేగాక కేవలం భావోద్రేకంలో పడి, ఏదైనా ధార్మిక ఆచరణను నిషేధించడమనేది పక్షపాతం, భేదభావం చూపడంలో మరియు మానవ హక్కుల ఉల్లంఘనలో, దుర్వినియోగంలో మరింత ముందుకు తీసుకు పోతుంది. నాజీ జర్మనీలో యూదులు మరియు ఇతర అల్ప సంఖ్యాకులకు వ్యతిరేకంగా పెరిగిన జాతి వివక్షత ముందుగా చిన్న చిన్న విషయాలతోనే మొదలైందనేది ఇక్కడ మనం తప్పకుండా గమనించాలి. క్రమంగా అది సమాజంలో స్వీకరించబడింది, తర్వాత తీవ్రమైన అణచివేతలు, దౌర్జన్యాలతో మరింత ముందుకు తీసుకు పోబడింది.

## బురఖా కప్పుకోవడం నిషేధింపబడాలా?

బురఖా కప్పుకోవడాన్ని అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం, అతిక్రమించడమే కాకుండా, అతి ఎక్కువ మోతాదులో జాతి వివక్షత చూపినట్లవుతుంది, హానికరమైన అనేక సాంఘిక పర్యవసానాలకు దారి తీస్తుంది. ఇది ముస్లిం సమాజాన్ని మరింతగా అవమానాల పాలు చేస్తుంది, ముస్లింల మరియు వారు నివసిస్తున్న సమాజాల మధ్య అపనమ్మకాన్ని సృష్టిస్తుంది. ఒకవైపు ముస్లిం మహిళలను రక్షిస్తామనే దావా చేస్తూ, మరోవైపు బురఖా కప్పుకోవడాన్ని నిషేధించడమనేది బురఖా కప్పుకునే అలవాటు ఉన్న మహిళల జీవితాన్ని దుర్భరం చేస్తుంది. కేవలం ఇంటి నుండి బయటికి వెళ్ళడం కోసం తమ ధర్మాదేశాన్ని ధిక్కరించాలా లేక అస్సలు బయటికి రాకుండా ఇంటి పట్టునే ఉండిపోవాలా – ఈ రెండింటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకోమని వారిని బలవంతం చేస్తున్నది. అదనంగా, అలాంటి నిషేదం ద్వంద్వ వైఖరిని బయట పెడుతున్నది – ఇతర ధర్మాల చిహ్నాలు మరియు దుస్తులు సహించబడటమే కాకుండా, గౌరవించబడుతున్నాయి కూడా. ఉదాహరణకు క్రైస్తవ సన్యాసిని, బౌద్ధ భిక్షువు, ఆర్థోడాక్స్ ప్రీస్ట్, రబ్బీ మొదలైన వారి వస్త్ర ధారణ.

## ముగింపు

బురఖా కప్పుకోవడమనేది అస్సలు అణచివేత లేక అనాగరికత కాదు. సెక్యూరిటీ ప్రమాదం కాదు, కప్పుకునే వ్యక్తీ మరియు సమాజం మధ్య అడ్డుగోడలను సృష్టించడం లేదు. కానీ, అది సర్వలోక సృష్టికర్త సామీప్యాన్ని కోరుకునే మహిళలు స్వచ్ఛందంగా, స్వయంగా ఎంచుకున్న వస్త్ర ధారణ కావడం తప్పకుండా గౌరవించబడాలి. సుస్థిరంగా స్థాపితమై ఉన్న ఒక ధార్మిక ఆచరణను నిషేధించాలా లేక కొనసాగించాలా అనే దానిపై డిబేటు చేయడమే స్వయంగా ఒక జాతి వివక్ష, భేదభావం చర్య. ప్రాథమిక హక్కులను కాపాడే దిశ వైపుకు బదులు దానికి వ్యతిరేక దిశలో తీసుకు పోతున్నది. సహనం చూపడం

అంటే కేవలం వేషభాషలలో మీ వలే కనబడే మరియు కట్టుబాట్లు పాటించే వారితో మాత్రమే కలిసి మెలిసి ఉండటం కాదు; ఇతర ప్రజల అలవాట్లను, కట్టుబాట్లను కూడా స్వీకరించడం, ముఖ్యంగా మీరు వారిని అర్థం చేసుకోనప్పుడు లేదా వారితో అంగీకరించనప్పుడు వారి జీవన విధానంపై సహనం వహించడం.

మహిళలు తమకు ఇష్టమైన ఎంపికలు మరింత ఎక్కువ స్వేచ్ఛతో స్వయంగా చేసుకునే కాలంలో జీవిస్తుండగా, అనేక దేశాలలో తన దుస్తులు తానే స్వయంగా ఎంచుకునే అత్యంత ప్రాథమిక స్వేచ్ఛను ముస్లిం మహిళల నుండి లాక్కోవడం  విచిత్రంగా కనబడటం లేదా? ఒకవేళ ఎవరినైనా బురఖా కప్పుకోమని బలవంతం చేయడం అణచివేత అనబడితే, బురఖా తీసివేయమని బలవంత పెట్టడం అణచివేత మరియు దౌర్జన్యం కాదా?

# 16. ఇస్లాం ధర్మంలో మహిళల హక్కులు

ఇస్లాం ధర్మంలో మహిళలు అణచివేతకు గురి చేయబడుతున్నారని, తక్కువ స్థాయికి దిగజార్చబడుతున్నారని, వేధించబడుతున్నారని భావించ బడు తున్నది – నిజానికి అలా జరుగుతున్నదా? మిలియన్ల కొద్దీ ముస్లింలు సింపుల్ గా దౌర్జన్యపరులా లేక ఇలాంటి తప్పుడు అపార్థాలు, దురభిప్రాయాలను పక్షపాతం వహిస్తున్న మీడియా కల్పితాలా?

"మరియు పురుషులపై మహిళలకు హక్కులు ఉన్నాయి, ఎలాగైతే మహిళలపై పురుషులకు హక్కులు ఉన్నాయో." ఖుర్ఆన్ 2:228

1400 సంవత్సరాలకు పూర్వమే ఇస్లాం ధర్మం మహిళల హక్కులు ప్రకటించింది. పాశ్చాత్య దేశాలలోని మహిళలకు అవి ఈమధ్యనే ఇవ్వ బడినాయి. 1930లో, అన్నీ బీసెంట్ ఇలా అభిప్రాయపడినారు, "కేవలం ఇరవై సంవత్సరాల క్రితం నుండే మహిళల ఆస్తి హక్కులను క్రైస్తవ ఇంగ్లండ్ గుర్తించగా, ఇస్లాం ధర్మం దానిని అన్ని కాలాలలో గుర్తించింది. మహిళలకు మనస్సు లేదని ఇస్లాం ధర్మం బోధిస్తున్నదనడం ఒక అపనింద, అభాండం మాత్రమే." ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ ముహమ్మద్, 1932 (The Life and Teachings of Mohammed, 1932).

స్త్రీపురుషులు ఉభయులూ ఒకే వ్యక్తి వారసులు – ప్రవక్త ఆదం అలైహిస్సలాం. ఇస్లాం ధర్మం వారిరువురి కొరకు న్యాయం మరియు కారుణ్యం తప్ప మరేమీ అంగీకరించదు.

## ప్రతిఫలం & జవాబుదారీలలో సరిసమానం

స్త్రీపురుషులు అల్లాహ్ ను ఒకే విధంగా ఆరాధిస్తారు, అంటే వారు ఒకే సృష్టికర్త (అల్లాహ్) ను ఆరాధిస్తారు, ఒకే విధమైన ఆరాధనలు చేస్తారు, ఒకే దివ్యగ్రంథాన్ని అనుసరిస్తారు మరియు ఒకే దైవవిశ్వాసాన్ని కలిగి ఉన్నారు. అల్లాహ్ (అరబీ భాషలో సర్వలోక సృష్టికర్త అయిన ఏకైక నిజ దైవం పేరు),

మానవులందరినీ న్యాయంగా మరియు సమానంగా చూస్తాడు. ఖుర్ఆన్ లోని అనేక వచనాలలో స్త్రీపురుషులిద్దరికీ న్యాయమైన ట్రీట్మెంటు మరియు ప్రతిఫలం లభిస్తుందని అల్లాహ్ నొక్కి వక్కాణించాడు:

"విశ్వసించిన పురుషులకు మరియు స్త్రీలకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికీ మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది." ఖుర్ఆన్ 9:72

"మీలో పని చేసే వారి పనిని – వారు పురుషులైనా లేక స్త్రీలైనా – దానిని వృధా కానివ్వను; మీరు పరస్పరం ఒకే కోవకు చెందినవారు." ఖుర్ఆన్ 3:195

ఒకరికి లభించే ప్రతిఫలం అతని ఆచరణలపై ఆధారపడి ఉంటుందే కానీ, అతని లింగభేదం పై కాదని ఈ వచనాలు తెలుపుతున్నాయి. ఒక వ్యక్తి ఎలా ప్రతిఫలం పొందుతాడు మరియు న్యాయ విచారణ చేయబడతాడనే విషయంలో లింగభేదం ఎలాంటి పాత్ర పోషించదు.

ఒకవేళ ఇస్లాం ధర్మాన్ని ఇతర ధర్మాలతో పోలిస్తే, ఇస్లాం ధర్మం స్త్రీపురుషులు ఉభయుల మధ్య న్యాయం చేస్తున్నది. ఉదాహరణకు, నిషేధించబడిన చెట్టు ఫలం తినడం గురించి 'ఈవ్' పై మోపబడిన నిందను ఇస్లాం ధర్మం పూర్తిగా తిరస్కరిస్తున్నది. ఇస్లాం ధర్మం ప్రకారం, ఆదం మరియు ఈవ్ ఇరువురూ తప్పు చేసారు, ఇద్దరూ పశ్చాత్తాప పడినారు మరియు అల్లాహ్ వారిద్దరినీ క్షమించివేసినాడు.

## జ్ఞానం సంపాదించడంలో సమాన హక్కులు

జ్ఞానం సంపాదించడం వైపు స్త్రీపురుషులిద్దరూ సరిసమానంగా ప్రోత్సహించబడినారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, "ప్రతి ముస్లిం కొరకు విద్య తప్పనిసరి."

ఇంకా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో గొప్ప గొప్ప ముస్లిం మహిళా పండితురాళ్ళు ఆయన చుట్టుప్రక్కల ఉండేవారు. కొందరు ఆయన కుటుంబంలోని వారైతే, మరికొందరు ఆయన సహచరులు లేదా సహచరుల కుమార్తెలు. వారిలో సుప్రసిద్ధురాలు ఆయెషా రదియల్లాహు అన్హా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క భార్య, ఆమె ద్వారా దాదాపు నాలుగోవంతు ఇస్లామీయ ధర్మశాసనం ఇతరులకు చేరింది.

ఇతర మహిళలలో గొప్ప ధర్మశాస్త్రవేత్తలు ఉన్నారు. కొందరు ప్రఖ్యాత పురుష పండితులు వారి వద్ద శిష్యరికం చేసినారు.

జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో సమాన హక్కులు

తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును మరియు పెళ్ళి అయిన తర్వాత కూడా తమ అసలు వంశం పేరునే కొనసాగించే హక్కును మహిళలకు ఇచ్చి, ఇస్లాం ధర్మం వారిని గౌరవించింది. అదనంగా, తల్లిదండ్రులు బలవంతంగా తమ కుమార్తెలకు పెళ్ళిళ్ళు చేస్తారనే అపవాదు ప్రజలలో ఉన్నది. ఇదొక సాంస్కృతిక ఆచారమే గానీ, దీనికి ఇస్లాం ధర్మంలో ఎలాంటి స్థానం లేదు. వాస్తవానికి, ఇస్లాం ధర్మంలో ఇలా చేయడం నిషేధించబడింది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఒక మహిళ ఆయన వద్దకు వచ్చి ఇలా తెలిపింది, "నా తండ్రి తన సామాజిక స్థాయిని పెంచుకోవడం కోసం నా పెళ్ళి నా కజిన్ తో బలవంతంగా జరిపించినాడు." అది విని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆమె తండ్రిని పిలిపించి, అతని సమక్షంలో పెళ్ళిసంబంధాన్ని కొనసాగించాలో లేక రద్దు చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను ఆమెకు ఇచ్చారు. అపుడు ఆమె ఇలా పలికింది, "ఓ రసూలుల్లాహ్, నా తండ్రి చేసిన దానికి నేను సమ్మతిస్తున్నాను, కానీ నేను ఇతర మహిళలకు దీనిని చూపాలని కోరుకున్నాను (వారు బలవంతంగా పెళ్ళి చేయలేరనే నిజాన్ని ఇతరులకు అందజేయాలని కోరుకున్నాను)."

## భిన్నత్వంలో సమానత్వం

జనరల్ నియమాల ప్రకారం స్త్రీపురుషులు సరిసమాన హక్కులు కలిగి ఉన్నా, వారిద్దరిలో ప్రతి ఒక్కరి ప్రత్యేక హక్కులు మరియు బాధ్యతలు ఒకేలా లేవు. స్త్రీపురుషులు ఉభయులూ బహుమానపూర్వక హక్కులు (complementary rights) మరియు బాధ్యతలు కలిగి ఉన్నారు.

స్త్రీపురుషుల మెదడు భాష, సమాచారం మరియు భావోద్రేకం మొదలైన ప్రక్రియలలో శరీర నిర్మాణ సంబంధమైన బాహ్య మరియు అంతర్గత వ్యత్యాసాలతో పాటు, వారిద్దరి మధ్య అనేక ఇతర సూక్ష్మ వ్యత్యాసాలు కూడా ఉన్నాయని శాస్త్రవేత్తలు కనిపెట్టారు.

మాటకారితనం, సానుభూతి చూపడం, కలుపుగోలుతనం మొదలైన నైపుణ్యాలలో మగవారి కంటే ఆడవారు ముందున్నారని, ఇతర విషయాలలో అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆధిపత్యం, ప్రాంతీయత్వం, గణితశాస్త్రంలో నైపుణ్యం, అంతస్తు, హెూదాల పరంగా దౌర్జన్యం మరియు ఇతర గుణాలలో ఆడవారి కంటే మగవారు ముందున్నారని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని ఒక సాంఘిక జీవశాస్త్ర నిపుణుడైన ఎడ్వర్డ్ ఓ. విల్సన్ (Edward O. Wilson) తెలిపారు.

స్త్రీపురుషులిద్దరి మధ్య ఉన్న వ్యత్యాసాలను నిర్లక్ష్యం చేసి, వారిద్దరినీ సరిసమానంగా చూడటం మూర్ఖత్వం అవుతుంది. స్త్రీపురుషులిద్దరూ తమ తమ శక్తిసామర్థ్యాలు, ప్రత్యేకతలను అనుసరించి వేర్వేరు బాధ్యతలు, పాత్రలు, బహుమానపూర్వక హక్కులు కలిగి ఉన్నారు. ఎందుకంటే, అది వారి సహజ మానసిక మరియు శారీరక నిర్మాణాలను అనుసరించి ఉన్నది. ఖుర్ఆన్ లోని అల్లాహ్ వచనాల తెలుగు భావానువాదం:

“మగబిడ్డ ఆడబిడ్డ వంటిది కాదు.” ఖుర్ఆన్ 3:36

“ఏమిటీ, సృష్టించిన ఆయనే తెలీకుండా ఉంటాడా? ఆయన సూక్ష్మగ్రాహి, ప్రతిదీ ఎరిగినవాడు.” ఖుర్ఆన్ 67:14

## కుటుంబ వ్యవస్థ

సృష్టికర్త స్త్రీపురుషులు ఇద్దరినీ విభిన్నంగా కేవలం వారికే ప్రత్యేకమైన పాత్రలు, నైపుణ్యాలు మరియు బాధ్యతలతో సృష్టించినాడు. ఈ వ్యత్యాసాలు వారి మధ్య హెచ్చుతగ్గులకు, ఆధిక్యము లేక తక్కువతనాలకు కారణంగా చూడకుండా, వారి మధ్య స్పెషలైజేషన్ గా చూడవలెను. ఇస్లాంలో, కుటుంబ వ్యవస్థ సమాజం యొక్క కేంద్ర బిందువుగా, ప్రధాన యూనిట్ గా పరిగణించ బడింది. పురుషుడు కుటుంబ ఆర్థిక వ్యవస్థకు బాధ్యుడు కాగా, కుటుంబ భౌతిక, విద్య మరియు బంధుత్వాల అభివృద్ధికి స్త్రీ బాధ్యత వహిస్తున్నది. ఇది ఉభయుల మధ్య సహకారాన్ని పెంచాలే గానీ పోటీని కాదు. తమ పరస్పర బాధ్యతలు నెరవేర్చడం ద్వారా, దృఢమైన కుటుంబ వ్యవస్థ స్థాపించబడుతుంది. తద్వారా బలమైన సమాజాలు.

అలాగే, భావోద్రేకాల పరంగా, స్త్రీపురుషులు ఇద్దరిలో ఎవ్వరూ రెండోవారి తోడు లేకుండా సంతోషంగా ఒంటరి జీవితం గడపలేరు. దీనిని అల్లాహ్ చాలా చక్కగా ఇలా తెలిపినాడు:

"వారు మీ కొరకు దుస్తులు మరియు మీరు వారి కొరకు దుస్తులు." ఖుర్ఆన్ 2:187

దుస్తులు మనకు సౌలభ్యం, సౌకర్యం, వెచ్చదనం మరియు భద్రతలను ఇవ్వడమే కాకుండా మంచిగా కనబడేలా చేస్తాయి – ఇస్లాం ధర్మంలో భార్యాభర్తల మధ్య సంబంధం ఎంత చక్కగా నిర్వచించబడిందో చూడండి.

## భార్యాభర్తల సంబంధాలలో ప్రేమ & ఆప్యాయత

తమ జీవిత భాగస్వాములను అతి ఉత్తమంగా చూసుకోవాలని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, "మీలో ఎవరైతే తమ భార్యలతో ఉత్తమంగా ప్రవర్తిస్తారో, వారే ఉత్తములు."

“ఆయన సూచనలలో ఒకటేమిటంటే, ఆయన మీకోసం స్వయంగా మీలో నుండే మీ భార్యలను సృజించాడు. మీరు వారి వద్ద ప్రశాంతత పొందటానికి; ఆయన మీ మధ్య ప్రేమను, ఆప్యాయతను, దయాబావాన్ని పొందుపరచాడు. నిశ్చయంగా ఆలోచించే వారు కోసం ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.” ఖుర్ఆన్ 30:21

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఒక భార్య ఆయెషా రదియల్లాహు అన్హును ఇంట్లో ఆయన ప్రవర్తన గురించి ప్రశ్నించగా, ఆమె ఇలా జవాబిచ్చారు,“మీలో ఒకరి వలే ఆయన ఇంట్లో మామూలుగా ఉండేవారు, అయితే ఆయన అత్యంత సానుకూలంగా మరియు ఉదారంగా ప్రవర్తించేవారు … ఆయన ఇంట్లోని మామూలు పనులలో తన భార్యలకు సహాయపడేవారు, తన బట్టలకు తనే స్వయంగా కుట్లు వేసుకునేవారు, తన బూట్లను తనే రిపేరు చేసుకునేవారు.” జనరల్ గా, తన భార్యలు చేసే పనులలో ఆయన తన వంతు తోడ్పాటు అందించేవారు.

## తల్లి మరియు కూతుళ్ళ ఉన్నత స్థానం

బాల్యంలో చిన్న పిల్లలపై తల్లి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణం తల్లి ప్రేమాభిమానాలు, సంరక్షణ, మరియు ఆప్యాయత. సమాజం యొక్క సాఫల్యం తల్లిపై ఆధారపడి ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాబట్టి, వారి స్థాయిని గౌరవించడం మరియు ఉన్నత పరచడమనేది సరైన చర్యగా ఇస్లాం ధర్మం ప్రకటించింది.

ఖుర్ఆన్ లోని అల్లాహ్ ప్రకటన :

“మేము మనిషికి తన తల్లిదండ్రుల పట్ల ఉత్తమరీతిలో వ్యవహరించవలసినదిగా తాకీదు చేసాము. అతని తల్లి బాధను భరిస్తూ గర్భంలో అతన్ని మోసింది. బాధను భరిస్తూ అతన్ని ప్రసవించింది.” ఖుర్ఆన్ 46:15

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను, “*ఓ రసూలుల్లాహ్, ప్రజలలో నా నుండి మంచి ఆదరణ పొందే అర్హత ఎవరికి*

*ఎక్కువగా ఉన్నది (ప్రజలలో నేను ఎవరిని ఎక్కువగా ఆదరించాలి)?" అని ప్రశ్నించగా, ఆయన ఇలా జవాబిచ్చారు, "నీ తల్లి." రెండుసార్లు అతడు మరలా ఇలా ప్రశ్నించాడు, "తర్వాత ఎవరు?" దానికి అదే సమాధానం ఇవ్వబడింది. నాలుగోసారి అతడు అడిగినప్పుడు మాత్రం, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, "తర్వాత నీ తండ్రి." అని జవాబిచ్చారు.* తల్లిని మంచిగా చూసుకోవడం, ఉత్తమంగా ఆదరించడం మొదలైన వాటికి మాత్రమే కాదు వాస్తవానికి తమ కుమార్తెలను మంచిగా పెంచినందుకు కూడా ఇస్లాం ధర్మంలో ప్రతిఫలం ప్రకటించబడింది. అంతేగానీ కుమారులను పెంచినందుకు కాదు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు, *"ఎవనికైతే అల్లాహ్ ఇద్దరు కుమార్తెలను ఇచ్చాడో, అతడు ఆ ఇద్దరిని మంచిగా పెంచితే, అతడు స్వర్గంలో ప్రవేశించేందుకు వారిద్దరూ కారణం కాగలరు."*

## ముగింపు

ఇస్లాం ధర్మానికి పూర్వం, మహిళలు హీనంగా చూడబడేవారు, ఆడపిల్లలను పుట్టగానే సజీవంగా పాతిపెట్టేవారు, వ్యభిచారం అదుపు తప్పింది, కేవలం భర్తల చేతిలోనే విడాకులు ఇచ్చే అధికారం ఉండింది, వారసత్వం కేవలం బలవంతులకే చెందింది, దౌర్జన్యం విస్తృతంగా వ్యాపించింది. రాగానే ఇస్లాం ధర్మం వీటన్నింటినీ నిర్మూలించింది. నేటికీ "అభివృద్ధి చెందిన దేశాలలో", మహిళలకు తగిన గౌరవం, హెూదా, మర్యాద ఇవ్వబడటం లేదు, కేవలం సమాన పనికి సమాన జీతం తప్ప. కానీ ఇస్లాం ధర్మం మాత్రం, మహిళను అమూల్యమైన మరియు విలువైన వారిగా పరిగణిస్తున్నది. వారిని అగౌరవపర్చరాదని మరియు పరాభవం పాలు చేయరాదని ఆదేశిస్తున్నది. కొన్ని మధ్యేసియా దేశాలలో లేక ముస్లిం కుటుంబాలలో మహిళలు అణచివేతకు గురికావడానికి కారణం కొందరు ముస్లింలు తప్పుగా అనుసరిస్తున్న అక్కడి ప్రాంతీయ సంప్రదాయాలు మాత్రమే గానీ ఇస్లాం ధర్మ

బోధనలు ఎంత మాత్రమూ కాదు. ఒకవేళ ఇస్లాం ధర్మం మహిళలను అణచివేసే ధర్మమే అయితే, ప్రపంచ వ్యాప్తంగా అంత ఎక్కువ మంది మహిళలు ఇస్లాం ధర్మాన్ని ఎందుకు స్వీకరిస్తున్నారు?

స్త్రీపురుషుల సృష్టికర్త, పాలకుడు, పోషకుడు అయిన మా ప్రభువు మరియు మీ ప్రభువు యొక్క ఈ వచనాలతో మేము ఇక్కడ ముగిస్తున్నాము:

"నిశ్చయంగా ముస్లిం పురుషులు మరియు ముస్లిం స్త్రీలు, విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు, విధేయులైన పురుషులు మరియు విధేయులైన స్త్రీలు, సత్యసంధులైన పురుషులు మరియు సత్యసంధులైన స్త్రీలు, సహనశీలురైన పురుషులు మరియు సహనవతులైన స్త్రీలు, అణుకువ గల పురుషులు మరియు అణుకుల గల స్త్రీలు, దానధర్మాలు చేసే పురుషులు మరియు దానధర్మాలు చేసే స్త్రీలు, ఉపవాసం పాటించే పురుషులు మరియు ఉపవాసం పాటించే స్త్రీలు, తమ మర్మాంగాలను కాపాడుకునే పురుషులు మరియు తమ మర్మాంగాలను కాపాడుకునే స్త్రీలు, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే పురుషులు మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే స్త్రీలు – వీరందరి కోసం అల్లాహ్ మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు." ఖుర్ఆన్ 33:35

# 17. ఇస్లాం ధర్మంలో మరణం & పరలోకం

"ప్రతి ఆత్మా మరణాన్ని తప్పక రుచి చూస్తుంది." ఖుర్ఆన్ 29:57

## మరణం అతి చేరువలోనే ఉన్నది

"మీరెక్కడున్నా సరే, మరణం నుండి తప్పించుకోలేరు – అత్యంత పటిష్ఠంగా మరియు ఎత్తుగా నిర్మించుకున్న కోటలలో దాక్కున్నా సరే!" ఖుర్ఆన్ 4:78

మరణం అనేది ఒక వాస్తవం. దాని నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. ప్రతి రోజూ, ప్రతి ఘడియ, ప్రతి నిమిషం గడిచే కొద్దీ, అది మరింత చేరువ అవుతుంది. CIA యొక్క *The World Factbook 2007*, అనే పుస్తకం ప్రకారం, ప్రతి సెకనుకు ఇద్దరు వ్యక్తులు మరణిస్తున్నారు. అంటే ప్రతి సంవత్సరం దాదాపు 57.9 మిలియన్ల ప్రజలు! ప్రతి ఒక్కరూ తమ వయస్సు, ఆరోగ్యం, ఇతర అంశాలు, సామాజిక హెూదా, దేవుడి భయభక్తులకు అతీతంగా ఎవ్వరూ తప్పించుకోలేని ఈ గమ్యాన్ని చేరుకోవలసిందే. పూర్వ కాలపు రారాజులు, బిలియనీర్లు, బలవంతులు ఎక్కడ ఉన్నారు? ఒకప్పటి అత్యంత సౌందర్యవంతులు, సుప్రసిద్ధులు మరియు వివేకులు ఎక్కడ ఉన్నారు?

## మరణం యొక్క వాస్తవికత

మరణమనేది ఒక దుర్ఘటన కాదు కానీ అది సింపుల్ గా ఇహలోకం నుండి పరలోకానికి ఒక అద్భుత ప్రయాణం.జీవిత పరమార్థం మరియు చనిపోయిన తర్వాత మనకు ఏమి జరగబోతున్నది అనే విషయాలపై అది మనల్ని దీర్ఘాలోచనలకు గురిచేస్తుంది.

కేవలం తనను మాత్రమే ఆరాధించే పరమార్థంతో మనల్ని సృష్టించానని మరియు ఎవరు ఈ జీవిత పరమార్థాన్ని పూర్తి చేయగలరో చూసేందుకు మన కొరకు ఇహలోక జీవితాన్ని ఒక పరీక్షగా చేసాననీ అల్లాహ్ ఖుర్ఆన్ లో స్పష్టంగా పేర్కొన్నాడు:

“మరియు నేను జిన్నాతులను మరియు మానవులను కేవలం నన్ను ఆరాధించుట కొరకే సృష్టించాను.” ఖుర్ఆన్ 51:56

చావుబ్రతుకుల వెనుక నున్న పరమార్థాన్ని అల్లాహ్ ఇలా తెలిపినాడు:

“మీలో సదాచారాలలో, పుణ్యకార్యాలలో ఎవరు ఉత్తములో పరీక్షించేందుకు అల్లాహ్ చావుబ్రతుకులను సృష్టించాడు.” ఖుర్ఆన్ 67:2

మరణం కోసం తయారీలు పూర్తిగావించడం అంటే ముందుగానే అంత్యక్రియల ఖర్చులు చెల్లించడం లేదా కఫన్ వస్త్రాలు ఎంచుకోవడం కాదు. ఆ తయారీ తమ జీవిత పరమార్థాన్ని పూర్తి చేయడం అంటే కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించడం, ఆయన ఆదేశాలను అనుసరించి జీవించడం మరియు సత్కార్యాలు చేయడంతో పూర్తవుతుంది. ఇస్లాం ధర్మంలో దైవారాధన భావనలో అల్లాహ్ కోసం చేసే ప్రతిదీ వస్తుంది, అంతేగానీ అది కేవలం ప్రార్థనలకు మాత్రమే పరిమితం కాలేదు. వాస్తవానికి, అల్లాహ్ యొక్క మెప్పు, అంగీకారం కోసం చేసే ప్రతి పనీ ఆరాధనగానే పరిగణించబడుతుంది. అందుకు గాను ఆ వ్యక్తికి తగిన పుణ్యాలు ప్రసాదించబడతాయి.

## మరణ ఘడియ

“రేపటి కోసం ఏమి ముందుకు పంపారో ప్రతి ఒక్కరూ లెక్కించుకోవాలి.” ఖుర్ఆన్ 59:18

ప్రతిరోజు మనం అనేక మరణాలు చూస్తుంటాము. ఎలాంటి బాధ, కష్టం, తీవ్రత లేని ప్రశాంతమైన చావు రావాలని ఆశిస్తాం. కానీ, అలా జరుగుతుందనే గ్యారంటీ లేదు. ఎప్పుడైతే ఒక వ్యక్తి మరణిస్తాడో, అతడి ఆత్మ అతడి శరీరాన్ని వదిలి పెడుతుంది. కాబట్టి అతడి శారీరక ఆకారం అతడి ఆత్మ యొక్క వాస్తవ స్థితిని సూచించదు. ఆత్మలు పొందే ప్రశాంత లేదా అప్రశాంత స్థితి, వారు ఎంత చక్కగా ఇహలోకంలో తమ జీవిత పరమార్థాన్ని పూర్తి చేసారనే దానిపై

ఆధారపడి ఉంటుంది. అందులో చావు తెచ్చిపెట్టిన కారణానికి ఎలాంటి ప్రమేయం లేదు.

అంతకు ముందు ఎన్నడూ దర్శించని ప్రదేశానికి వెళ్ళేందుకు టిక్కెట్టు తీసుకున్న ఇద్దరు వ్యక్తుల ఈ ఉదాహరణను పరిశీలించండి. మొదటి వ్యక్తి తను వెళ్ళబోతున్న ప్రాంతం యొక్క భాష, ఆచార వ్యవహారాలు మరియు సంప్రదాయాల గురించి నేర్చుకునేందుకు కొంత సమయం వెచ్చిస్తాడు. సరైన కరెన్సీ సంపాదిస్తాడు మరియు తగిన టీకాలు వేయించుకుంటాడు. తీరా ప్రయాణ సమయం వచ్చేసరికి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా, ఎలాంటి ఆశ్చరాలను ఎదురుకోకుండా చక్కగా తన లక్ష్యానికి చేరుకుంటాడు - సురక్షితంగా మరియు ప్రశాంతంగా. ఎందుకంటే, తయారీకి అవసరమైన సమయాన్ని అతను వెచ్చించాడు.

దీనికి భిన్నంగా, రెండో వ్యక్తి తయారీలో నిర్లక్ష్యం చేసినాడు. ప్రయాణ సమయం ఆసన్నమయ్యే వరకు ఎలాంటి తయారీలు చేయకుండా గడిపినాడు. గమ్యం చేరుకున్న తర్వాత కొత్త ప్రదేశంలో ఏమి చేయాలో, ఎలా ప్రవర్తించాలో తెలియక తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు. గమ్యస్థానం గురించి, దాని ప్రయాణం గురించి పట్టించుకోకుండా, దాని కోసం సిద్ధపడకుండా అతడు మూర్ఖత్వంతో గడపటం వలన అలాంటి భయంకర పరిస్థితి ఎదుర్కోవలసి వచ్చింది. తనతో తెచ్చుకున్నవేవీ అతడికి క్రొత్త ప్రదేశంలో పనికి రాకుండా పోయాయి.

పరలోకం గురించి పట్టించుకోకుండా అలాంటి అశ్రద్ధతో జీవించే వ్యక్తి గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా వర్ణిస్తున్నాడు:

"ఎప్పుడైతే వారిలో ఒకరికి మరణం ఆసన్నమవుతుందో, అతడు ఇలా అంటాడు, 'నా ప్రభూ, నన్ను వెనక్కు పంపించు! తద్వారా నిర్లక్ష్యం చేసిన సత్కార్యాలను

నేను ఆచరిస్తాను.' అస్సలు కుదరదు! అది కేవలం అతడు మాట్లాడే మాట మాత్రమే (అలా వెనక్కి పంపటం అస్సలు జరగదు)." ఖుర్ఆన్ 23:99-100

అలాగే, నరకాగ్నిలో పడవేయబడిన ప్రజలు 'మిమ్మలన్ని ఏ విషయం నరకంలోనికి చేర్చింది' అని ప్రశ్నించబడగా, వారిచ్చిన జవాబు గమనించండి:

"వారిలా అంటారు, 'మేము నమాజులు చేసిన వారిలోని వారము కాదు మరియు బీదలకు దానధర్మాలు చేయలేదు. అలాంటి మంచి పనులు చేస్తున్న వారితో అనవసర వాదనలలోనికి దిగేవారము. అంతిమ దినాన్ని తిరస్కరించేవారము. చివరికి చావు రానే వచ్చింది. అది నిశ్చయమైంది.' " ఖుర్ఆన్ 74:43-47

మనందరి చావు కోసం ఒక నిర్ణీత సమయం కాచుకుని ఉన్నది. మనమందరం ఈ అజ్ఞాత గమ్యస్థానానికి ప్రయాణించవలసి ఉన్నది. ఒక్కసారి మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి – దాని కోసం మీరు తయారుగా ఉన్నారా?

## జీవిత ఉద్దేశ్యం

"మేము మిమ్మల్ని ఆటపాటల కోసం (ఎలాంటి ఉద్దేశ్యం లేకుండా) సృష్టించామని మరియు మీరెన్నడూ మా వైపుకు తీసుకు రాబడరని భావిస్తున్నారా?" ఖుర్ఆన్ 23:115

ఇహలోక జీవితం ఒక పరీక్ష. చావుతో అది అంతమవుతుంది. కానీ, అది ఒకరి ఉనికిని అంతం చేయదు. మరణం ఆసన్నమైన తర్వాత, సత్కార్యాలు చేసే అవకాశం అంతమై పోతుంది. ఇక అప్పుడు ప్రాయశ్చిత పడేందుకు అవకాశం ఇవ్వబడదు. మన పరిస్థితి కేవలం ఇహలోకంలోని మన విశ్వాసం మరియు ఆచరణల మీదనే ఆధారపడి ఉంటుంది. మానవ జీవితం రెండు భాగాలలో విభజింపబడింది: తాత్కాలికమైన, క్షణికమైన ఇహలోక జీవితం మరియు శాశ్వతమైన, అపరిమితమైన పరలోక జీవితం. ఏ కొద్దిపాటి

తెలివితేటలున్న వారెవరైనా పరిమితమైన ఇహలోక భోగభాగ్యాల కంటే అపరిమితమైన పరలోక జీవితం లాభదాయకమైందని చాలా తేలిగ్గా గుర్తిస్తారు.

మానవజాతిని అల్లాహ్ సృష్టించినాడు. మనకు స్వేచ్ఛాజీవితాన్ని ప్రసాదించి అంటే మంచి చెడుల నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ, విచక్షణలను ప్రసాదించి, మన మంచి - చెడు పనులకు మనల్నే బాధ్యులుగా చేసినాడు. ఒకవేళ మంచి పనులకు పుణ్యాలు ప్రసాదింపబడే మరియు చెడు పనులకు కఠిన శిక్షలు వేయబడే పరలోకమే లేకపోతే, అది సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క పరిపూర్ణ న్యాయానికి విరుద్ధమవుతుంది.

కాబట్టి ఖచ్చితంగా ప్రతి ఆత్మ యొక్క మంచి చెడుల లెక్క తీసుకోబడే ఒక అంతిమ తీర్పుదినం తప్పకుండా ఉండాలనేది ఒక సంపూర్ణమైన డిమాండ్.

"విశ్వాస ప్రజలను పాపిష్టులతో సమానంగా వ్యవహరించాలా? మీకేమైంది? మీరెలా తీర్మానిస్తారు ?" ఖుర్ఆన్ 68:35-36

## అంతిమ తీర్పుదినం

"మీరు దూరంగా పారిపోతున్న మరణం, మిమ్మల్ని తప్పకుండా చేజిక్కించు కుంటుంది. అప్పుడు మీరు గుప్తాగుప్తమైన విషయాలు ఎరిగిన వాని వద్దకు మరలించబడతారు.ఆయన మీరేమి చేసారో మరియు ఏమి చేయలేదో మీకు తెలుపుతాడు." ఖుర్ఆన్ 62:8

ప్రతి ఒక్కరి ఇహలోక జీవిత ఆచరణలు నమోదు చేయబడుతున్నాయి మరియు భద్రం చేయబడుతున్నాయి.. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

"మరియు కర్మపత్రం వారి ముందు ఉంచబడినప్పుడు, ఆ అపరాధులు అందులో ఉన్నదానిని చూసి భయపడటాన్ని నీవు చూస్తావు. వారు ఇలా అంటారు: "అయ్యో! మా దౌర్భాగ్యం ఇదేమి గ్రంథం! ఏ చిన్న విషయాన్ని గానీ, ఏ పెద్ద

విషయాన్ని గానీ ఇది లెక్క పెట్టకుండా విడువలేదే!" తాము చేసిందంతా వుర తమ ఎదుట పొందుతారు. నీ ప్రభువు ఎవ్వరికీ అన్యాయం చేయడు." ఖుర్ఆన్ 18:49

మన ఆచరణలన్నీ ఎంత ఖచ్చితంగా నమోదు చేయబడినాయో చూడగానే మనం ఆశ్చర్యపోతాము. మనం మరిచిపోయిన విషయాలు కూడా మనకు గుర్తు చేయబడతాయి. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది,

"అల్లాహ్ వారందరినీ మరల బ్రతికించి లేపి, వారు చేసిందంతా వారికి తెలిపే రోజున వారు (తాము చేసిందంతా) మరచిపోయి ఉండవచ్చు." ఖుర్ఆన్ 58:6

దీనిపై చేయబడిన దీర్ఘాలోచన ఇక ముందు ఎలాంటి చెడు పనులు, పాపకార్యాలు చేయాలన్నా అవన్నీ జాగ్రత్తగా నమోదు చేయబడుతున్నాయని, అంతిమ తీర్పుదినం నాడు అల్లాహ్ ఎదుట బహిర్గతం చేయబడతాయనే వాస్తవాన్ని గుర్తు చేసి, సిగ్గుపడేలా చేస్తుంది.

ఎవరికైతే అల్లాహ్ యొక్క పునర్జీవింపజేసి, అంతిమ తీర్పు చేసే అద్భుత శక్తిపై అనుమానం ఉన్నదో, అలాంటి అవిశ్వాసుల గురించి అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా పేర్కొన్నాడు:

"అతడు ఇలా అంటాడు 'కృశించిపోయిన ఈ ఎముకలను తిరిగి ఎవడు బ్రతికించగలడు?' వారితో ఇలా అను (ఓ ముహమ్మద్), 'మొదట వాటిని పుట్టించిన ఆయనే, మళ్ళీ వాటిని బ్రతికిస్తాడు. మరియు ఆయనకు ప్రతిదానిని సృష్టించే జ్ఞానముంది!' " ఖుర్ఆన్ 36:78-79

## స్వర్గనరకాలు

ఎవరైతే కేవలం అల్లాహ్ మాత్రమే ఆరాధింపబడే అర్హతలు గలవాడని విశ్వసించి, మంచి పనులు చేస్తారో, అలాంటి వారు స్వర్గంలో ప్రవేశించబడతారు.

“నిశ్చయంగా, ఆ రోజు స్వర్గవాసులు, సుఖసంతోషాలలో నిమగ్నులై ఉంటారు. వారు మరియు వారి సహవాసులు చల్లని నీడలలో, ఆనుడు ఆసనాల మీద హాయిగా కూర్చొని ఉంటారు. అందులో వారికి ఫలాలు మరియు వారు కోరేవన్నీ ఉంటాయి.” ఖుర్ఆన్ 36:55-57

అల్లాహ్ పలుకులను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు:

“సన్మార్గంలో నడిచిన నా దాసుల కోసం నేను ఏ కన్నూ ఎన్నడూ చూడని, ఏ చెవీ ఎన్నడూ వినని, ఏ మనస్సూ ఎన్నడూ ఊహించని అద్భుత విషయాలను తయారు చేసి ఉంచాను.”

దీనికి భిన్నంగా, అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని తిరస్కరించిన వారితో ఇలా అనబడుతుంది:

“మీకు వాగ్దానం చేయబడిన నరకం ఇదే! మీరు అవిశ్వాసం చూపినందుకు గాను ఈ రోజు దీనిలో మీరు కాల్చబడతారు.” ఖుర్ఆన్ 36:63-64

అవిశ్వాసుల కొరకు అల్లాహ్ తీవ్రమైన శిక్షను తయారు చేసి ఉంచాడు:

“నిశ్చయంగా, నరకం ఒక మాటు; ధిక్కారుల గమ్యస్థానం; అందులో వారు యుగాల తరబడి ఉంటారు. అందులో వారు ఎలాంటి చల్లదనాన్ని గానీ మరియు పానీయాన్ని గానీ చవిచూడరు. సలసల కాగే నీరు మరియు చీములాంటి మురికి పానీయం తప్ప! (వారి కర్మలకు) తగిన పూర్తి ప్రతిఫలంగా! వాస్తవానికి వారు లెక్క తీసుకోబడుతుందని ఆశించలేదు. పైగా వారు మా సూచనలను (ఆయతులను) అసత్యాలని తిరస్కరించారు. మరియు మేము (వారు చేసిన) ప్రతి దానిని ఒక పుస్తకంలో వ్రాసి పెట్టాము. కావున మీరు (మీ కర్మల ఫలితాన్ని) చవి చూడండి. ఎందుకంటే, మేము మీకు శిక్ష తప్ప మరేమీ పెంచము.’ ” ఖుర్ఆన్ 78:21-30

## ముగింపు

“ఓ మానవుడా! అత్యంత కరుణామయుడైన నీ ప్రభువు గురించి నిన్ను మోసగించింది ఎవరు? ఆయనే నిన్ను సృష్టించాడు, నిన్ను మంచి ఆకారంలో తీర్చి దిద్దాడు, నీకు అవసరమైన వాటిని ప్రసాదించాడు. ఆయన తలిచిన ఆకారంలో నిన్ను తయారు చేసాడు. కాదు, ముమ్మాటికీ కాదు! అయితే నీవు ప్రతిఫలాన్ని నిరాకరించావు. (తీర్పుదినం నాడు మంచి పనులకు పుణ్యాలు మరియు చెడు పనులకు శిక్షలు).” ఖుర్ఆన్ 82:6-9

“నిశ్చయంగా, సజ్జనులు ప్రశాంతంగా, సుఖసంతోషాలతో ఉంటారు. దుర్మార్గులు నరకాగ్నిలో వేయబడతారు.” ఖుర్ఆన్ 82:13-14

మరణం తప్పనిసరిగా సంభవిస్తుంది. మన జీవిత ఉద్దేశం కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించడం, మంచిపనులు చేయడం మరియు నిషేధింప బడిన వాటన్నింటికీ దూరంగా ఉండటం. మన ప్రస్తుత ఆచరణల ఆధారంగా మన భవిష్యత్తు నిర్ణయించ బడుతుంది. కాబట్టి పరలోక జీవితంలో స్వర్గంలో మంచి స్థానం పొందే అర్హతలు సంపాదించేందుకు ఈ భూమండలంపై మనకు ఇవ్వబడిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఒకవేళ వాటిని వృధా చేసుకుంటే, మనల్ని మనం తిట్టుకుంటూ నరకాగ్నిలో గడప వలసి వస్తుంది.

## 17వ రమదాన్ సాంస్కృతిక క్విజ్ పోటీ షరతులు

## 1436 హి /2015, రబ్వహ్ జాలియాత్ , రియాద్ , సౌదీ అరేబియా.

1. క్రింది ప్రశ్నలకు ఈ పుస్తకంలో నుండే సరైన జవాబు ఎంచుకోవలెను.
2. మీ సమాధానములు రబ్వహ్ ఆఫీసులో స్వయంగా లేదా, telugu@islamhouse.com ఈమెయిల్ ద్వారా లేదా P.O.Box 29465, Riyadh 11457 పోష్టు ద్వారా 29-11-1436 హిజ్రీ అంటే 13-9-2015 లోపు పంపవలెను.
3. సమాధానాలతో పాటు మీ ఇఖామహ్ లేదా పాస్ పోర్ట్ లేదా మరేదైనా ఐడెంటిటీ కార్డు ఫోటో కాపీ తప్పకుండా జత పర్చవలెను. అలా జత పర్చని సమాధానములు చెల్లవు.
4. పేరు ఖచ్చితంగా మీ ఇఖామహ్/పాస్ పోర్టు/ఇతర ఐడెంటిటీ కార్డులో వ్రాయబడిన విధంగానే వ్రాయాలి. ఒకవేళ విజేత పేరు మరియు ఐడెంటిటీ కార్డులోని పేరులో తేడా ఉంటే, బహుమతి ఇవ్వబడదు.
5. మీ పేరు, ఈమెయిలు, ఇంటర్నేషనల్ డయల్ కోడ్ తో సహా మీ మొబైల్ ఫోన్ నెంబరు స్పష్టంగా వ్రాయవలెను.
6. విజేతలకు ఫోన్ నెంబరు ద్వారా మాత్రమే ఫలితాలు తెలుప బడును
7. ఇంషా అల్లాహ్ విజేతల పేర్లు 1437 మొహర్రం (అక్టోబర్ - 2015) నెలలో రబ్వహ్ ప్రచార కేంద్రంలో ప్రకటించబడును. అన్నీ భాషల ఫలితాలు www.islamhouse.com వెబ్సైటులో చూసుకోవచ్చును, బహుమతులు ప్రదానం చేసే సమయం గురించి ఇస్లాం హౌస్'తో పాటు ఫేస్ బుక్, ట్విటర్ మరియు ఇన్'స్టాగ్రామ్ ల ద్వారా కూడా తెలుపబడును.
8. మీ సమాధానాలను స్పష్టమైన చేతివ్రాతలో లేక నీటుగా టైపు చేసి పంపవలెను. ప్రతి ప్రశ్న క్రమసంఖ్య మరియు దాని జవాబు (a,b,c,d లలో సరైనది) సూచిస్తే సరిపోతుంది. ఉదా: 1- a, 2-b.

**9.** చీటింగ్ ఇస్లాంలో నిషేదించడమైనది, కాబట్టి ఇతరుల నుండి కాపీ చేయవద్దు. ఒకటి కంటే ఎక్కువ సార్లు వేర్వేరు పేర్లతో జవాబులు పంపడం నిషిద్ధం.

**10.** విజేతలు బహుమతి అందుకోవడానికి ఆఖరి తేదీ సఫర్ నెల, 1437 (నవంబర్ -2015). దీని తరువాత కారణాలేమైనా సరే, విజేతలు బహుమతి అందుకునే హక్కు కోల్పోతారు.

**11.** పోటీలో పాల్గొనడానికి రమదాన్, 1436 హి నాటికి కనీసం 10 ఏళ్ల వయసు ఉండవలెను.

## బహుమతులు

| నగదు బహుమతి | క్రమం |
|---|---|
| 1500 సౌదీ రియాల్స్ | 1వ బహుమతి |
| 1250 సౌదీ రియాల్స్ | 2వ బహుమతి |
| 1000 సౌదీ రియాల్స్ | 3వ బహుమతి |
| ప్రతి భాషలో పాల్గొనే వారి సంఖ్యను బట్టి ఇతర సెంటర్లలో కూడా నగదు బహుమతులు అంద జేయ బడును. | ఇతర సెంటర్లు |

# క్విజ్ ప్రశ్నలు

**1. పరలోకం గురించి పట్టించుకోకుండా అశ్రద్ధతో జీవించిన వ్యక్తి మరణం ఆసన్నమైనప్పుడు ఏమంటాడు: (ఖుర్ఆన్ భావానువాదం)**

a) 'నా ప్రభూ, నన్ను వెనక్కు పంపించు! తద్వారా నిర్లక్ష్యం చేసిన సత్కార్యాలను నేను ఆచరిస్తాను.'

b) మేము నమాజులు చేసిన వారిలోని వారము కాదు మరియు బీదలకు దానధర్మాలు చేయలేదు.

c) మంచి పనులు చేస్తున్న వారితో అనవసర వాదనలలోనికి దిగేవారము.

d) అంతిమ దినాన్ని తిరస్కరించేవారము.

e) పైవన్నీ సరైన జవాబులే

**2. అల్లాహ్ చావు బ్రతుకులను ఎందుకు సృష్టించాడు ?**

a) సదాచారాలలో, పుణ్యకార్యాలలో ఎవరు ఉత్తములో పరీక్షించేందుకు.

b) దీని జవాబు ఎవ్వరికీ తెలియదు.

c) అనేక పునర్జన్మల తర్వాత మానవాత్మను పరమాత్మలో కలిపేందుకు

d) వాటిని ఆయన సృష్టించలేదు.

**3. "ఎవనికైతే అల్లాహ్ ఇద్దరు కుమార్తెలను ఇచ్చాడో, అతడు ఆ ఇద్దరిని మంచిగా పెంచితే, అతడు స్వర్గంలో ప్రవేశించేందుకు వారిద్దరూ కారణం కాగలరు." ఇలా బోధించింది ఎవరు ?**

a) ఏసుక్రీసు (ఈసా అలైహిస్సలాం)

b) మోసెస్ (మూసా అలైహిస్సలాం)

c) అబ్రహాం (ఇబ్రహీమ్ అలైహిస్సలాం)

d) ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం

**4. ఖుర్ఆన్ గ్రంథం -**

a) 1400 సంవత్సరాల నుండి ఎలాంటి మార్పులు చేర్పులకు గురి కాకుండా నేటికీ సురక్షితంగా ఉన్న ఏకైక దివ్యసందేశం

b) మానవాళి కొరకు ఒక మార్గదర్శకత్వం

c) తప్పు ఒప్పులను, మంచి చెడులను ఖచ్ఛితంగా వేరు చేసే అద్భుత గీటురాయి

d) పై వన్నీ సరైన జవాబులే

**5. దైవప్రవక్త అంటే ఎవరు ?**

a) జీవిత ఉద్దేశ్యాన్ని తెలిపి, స్వయంగా ఆచరించి చూపేందుకు మానవ సమాజంలో నుండి అల్లాహ్ ఎంచుకున్న పుణ్య పురుషుడు.

b) మానవుల పాపవిమోచన కోసం శిలువుపై ప్రాణత్యాగంచేసిన దేవుని బిడ్డ

c) పై రెండూ తప్పు

d) దేవుడి అవతారం

**6. "కేవలం ఇరవై సంవత్సరాల క్రితం నుండే మహిళల ఆస్తి హక్కులను క్రైస్తవ ఇంగ్లండ్ గుర్తించగా, ఇస్లాం ధర్మం దానిని అన్ని కాలాలలో గుర్తించింది. మహిళలకు మనస్సు లేదని ఇస్లాం ధర్మం బోధిస్తున్నది అనడం ఒక అపనింద, అభాండం మాత్రమే." అని పలికింది ఎవరు ?**

a) మహాత్మా గాంధీ

b) సరోజినీ నాయుడు

c) అన్నె బీసెంట్

d) మదర్ థెరిస్సా

**7.** "పూర్వకాలంలో మానవుడు దాదాపు నగ్నంగా ఉండేవాడు. తన బుద్ధీ వివేకం పరిణితి చెందిన కొద్దీ, దుస్తులు ధరించడం మొదలు పెట్టాడు. నేను ఈ రోజు ఎలా ఉన్నానో మరియు ఏమి ధరిస్తున్నానో, అది మానవుడు సాధించిన మహోన్నత ఆలోచన మరియు నాగరికతలకు ప్రాతినిధ్యం వహిస్తున్నదే గానీ తిరోగమనాన్ని కాదు. అంతేగాక దుస్తులు త్యజించడమనేది మరలా ప్రాచీన కాలానికి చేర్చే తిరోగమనాన్ని సూచిస్తుంది." అని పలికింది ఎవరు ?

a) ఆయెషా, ఆస్ట్రేలియా

b) నోబుల్ ప్రైజ్ విజేత తవక్కుల్ కర్మాన్

c) యాస్మిన్, ఆస్ట్రేలియా

d) తస్లీమా నస్రీన్

**8.** ఇస్లాం ధర్మం ప్రకారం నీచాతి నీచమైన పాపం ఏది?

a) సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ కు సాటి కల్పించడం లేదా ఆయనకు ఇతరులను భాగస్వాములుగా చేయడం

b) సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ యొక్క దివ్యలక్షణాలను ఇతరులకు కట్టబెట్టడం

c) అల్లాహ్ తో పాటు లేదా అల్లాహు కు బదులు ఇతరులను ఆరాధించడం.

d) పై వన్నీ సరైన జవాబులే

**9.** "మంచీ – చెడూ సమానం కాజాలవు. కాబట్టి చెడును మంచి ద్వారా తొలగించు. ఆ తర్వాత నీకూ – తనకూ మధ్య బద్ధవిరోధం ఉన్నతను సైతం నీకు ప్రాణస్నేహితుడై పోతాడు." ఇది ఏ గ్రంథంలో ఉన్నది?

a) బైబిల్

b) తౌరాత్

c) ఖుర్ఆన్

d) వేదాలు

e) పై వాటిలో ఏదీ సరైన జవాబు కాదు

**10.** "ఏకైక నిజ ప్రభువుకు మాత్రమే సమర్పించుకోండి" అంటే ముస్లింగా మారండి అని తమ ప్రజలను పిలిచింది ఎవరు?

a) ప్రవక్త నోవా (నూహ్ అలైహిస్సలాం)

b) ప్రవక్త మోసెస్ (మూసా అలైహిస్సలాం)

c) ప్రవక్త జీసస్ (ఈసా అలైహిస్సలాం)

d) ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి

e) పైప్రవక్తలతో పాటు మొత్తం ప్రవక్తలందరి దివ్యసందేశం ఇదే.




ننشر الإسلام بـ ١٠٠ لغة

100

భాషలలో

ఇస్లాం పరిచయం

Islamhouse.com

المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة

هاتف : ٩٦٦١١٤٤٥٤٩٠٠+ فاكس : ٩٦٦١١٤٩٧٠١٢٦+ ص ب : ٢٩٤٦٥ الرياض : ١١٤٥٧

ISLAMIC PROPAGATION OFFICE IN RABWAH

P.O.BOX 29465 RIYADH 11457 TEL: +966 11 4454900 FAX: +966 11 4970126

keek